# పూజారి

(పెద్దకథ)

(కీ.శే. బి.యన్. రెడ్డిగారి "పూజాఫలం" సినిమాకథ)

1950 దశకంలో రచింపబడిన యీకథ
నా చిరకాల మిత్రుడూ హైకోర్టు సీనియర్ న్యాయవాదీ
సృజనాత్మక రచయిత నిరంతర తాత్విక చింతకుడు అయిన
శ్రీ చంద్రమౌళి వెంకట కృష్ణ గారి
ప్రేరణ ప్రోత్సాహాలతో వెలుగు చూచింది.
మా ఆరు దశాబ్దాల స్నేహచిహ్నంగా ఈ అంకితం ఆ సుహృద్వరునికే.

## 1

పార్కులో నీడనిచ్చే చెట్టు ఒక్కటీ లేదు. నేలమీద గడ్డిలో పచ్చదనం పోయి, దుమ్ము బట్టిన గోధుమ ధరించింది. పార్కు వేయించిన పాత ఛైర్మన్‌గారు, దానిని తన పేరుతోనే పిలుస్తారని నిర్ధారణ చేసుకొని ఉబ్బసపు వ్యాధితో, తృప్తితో పట్టణ రాజకీయాల నుండి విరమించారు. కొత్తగా వచ్చిన "చేర్మన్" గారికి టెండర్ల సంగతీ, కంట్రాక్టుల సంగతీ, వేలంపాటల సంగతీ మినహాయించి, ఇతర బాధ్యతలను గురించి, ప్రజల హక్కులూ అవసరాలను గురించి విశేషంగా తెలియదు. పౌరుల్లో చాలామంది పార్కును కాలక్షేపం బటానీలను నెమరువేసే సర్కారు పోరంబోకు స్థలంగా భావించే వాళ్ళే గనక -చెట్ల సంగతి, పూలమళ్ళ సంగతీ ఎవరూ పట్టించుకోనక్కర్లేకపోయింది.

పార్కులో గడియారపు స్థంభం గూడా ఉన్నది ( అయితే దాని రెండు ముళ్ళూ కలిసి మూడంకెమీద గత పదేళ్ళనుండీ, అతికిపోయినాయ్) అంత మాత్రం చేత అది నిరుపయోగమని చెప్పవీల్లేదు. దాని వెనుక ఉన్న ప్లాటుఫారందిమ్మెమీద "బాధ్యత" గల పురజనులు పగలు నీడకోసమూ, రాత్రి విద్యుత్కాంతి కోసమూ విరామం లేని చీట్ల పేకసభలు సాగిస్తూంటారు. గంట స్థంభానికి ముందున్న మెట్లు తాతల - కాలం

నాటి తిరుపతి కొండమెట్లు. ( దీని డిజైన్ అంతా "మునిసిపాలిటీ ఇంజనీర్" గారి పేరుతో చలామణీ అయిన వారే వేశారు). నవజవాన్ యువకులు తప్పితే, ఈ మెట్లను ఏకబిగ్రున ఎక్కగలిగేవారు పట్టణపు పాత యువజన సంఘంలో కూడా లేరు. కాని అవి గత యుద్ధకాలం ముందునుండీ, ఉపన్యాస వేదికలుగా గణుతికెక్కిన శిలలు కావటంలో, వాటి ఇబ్బందిని లెక్కించేవారు అసలే లేరు.

ఆ సాయంత్రం ఏ ప్రాంతం నుంచో వచ్చిన ఒకానొక చౌకబారు వేదాంతి, ఆ మెట్లమీద నుంచొని, "గంభీరోపన్యాసం" ఇస్తున్నాడు. వేదాంతి చుట్టూ ఏభైమంది దాకా మనుషులు మూగారు. (చల్లనిగాలికని వచ్చిన పౌరులే వీరు) మూగటం మూగారు గాని, అందులో సగంమంది చీట్ల పేక రభసగా గంటస్తంభం వెనుక జరుగుతోన్న మహాకోలాహలానికి దగ్గరగా జరగటం కోసం అక్కడ నుంచొన్నట్లు వ్యక్తపరచుకొన్నారు. మిగతా వాళ్ళలో కొందరు, అప్పుడే దుకాణాలు కట్టివేసి వచ్చిన షావుకార్లు. (బిల్లు కలెక్టర్లు లేని మునిసిపాలిటీ కావటం వల్ల, సాయంత్రపు పూట ఆఫీసు బల్లలు వదిలిపెట్టి గుమాస్తాలే పన్నుల వసూళ్ళకు బయలుదేరుతుంటారు). వేదాంతి గారి ఉపన్యాస వస్తువేమిటో ఎవ్వరికీ గ్రాహ్యం కావటం లేదు. కాని విశేషభాగం, పన్నుల వసూళ్ళకు బకాయిపెట్టిన ఈ షావుకార్ల నుద్దేశించి దొర్లివస్తున్నది.

"లోకం ఉదయాన నవ్వుతుంది. మధ్యాహ్నం నిర్లిప్తమైపోతుంది. సంధ్యా సమయంలో నిస్తేజమైపోతుంది. ఆవేదనలో మునిగి తేలుతుంది. రాత్రి నిశ్శబ్దంగా దుఃఖిస్తుంది. ఎందుకు? ఎందువల్ల? " - అని ముందు నిలబడి విస్తుపోతూ, మున్సిపాలిటీ గుమాస్తాల కంట కనబడ్డం లేదుగదా అని సంతోషిస్తున్న షావుకార్ల వంక, ప్రశ్నార్థకంగా చూచి, నాటక రంగం మీద నటకుడి విభ్రమం కృత్రిమంగా కొంత ఎరువు తెచ్చుకొని - వేదాంతి తన కంఠానికి కాస్త విరామం ఇచ్చి, కింద మెట్టుమీద పై ఉత్తరీయం పరిచాడు (చందా డబ్బులకు).

ఈ అసంగత ప్రలాపం ఇక వినలేక, అక్కడినుండి, మధు కదలి గేటుదాకా వచ్చి ఒకసారి పార్కు దుమ్మును ముఖంమీదినుంచి తుడుచుకుంటూ బయటపడ్డాడు. సన్నగా, దివిటీవలె ఈ పొడగరి యువకుడు - మధును, చూడగానే గుర్రపుబగ్గీకి అనుకొని, చుట్టకాల్చుతున్న రంగప్ప, తటాలున ముందుకు వచ్చి బగ్గీ తలుపులు తెరిచాడు. బగ్గీలో కెక్కికూర్చొనబోయే ముందు, అయిష్టతతోనే తన చుట్టూ లోతు కళ్ళతో కలియజూచుకున్నాడు మధు. ఆ దృశ్యం అతని మనోభావాలకు అనుగుణంగానే ఉంది. ఆ ప్రదేశంలో దాగి నిర్వీర్యమై పురాతనత్వమేదో తొణికిసలాడుతోంది. మరొక అవతారమెత్తిన నిరాశా దేవత అసంఖ్యాక రూపాల్లాగా ఆ వాతావరణం వెలవెల

పోతున్నది. అప్పుడే వెలిగిన బజారు దీపాల్లో, అర్థంలేని సమ్మర్ధంలో నడిచి పోతూన్న వేలాది ప్రజల మధ్యగా - ప్రపంచంలో తమది మాత్రమే ముఖ్యగమ్యమైనట్లు పరుగిడిపోతున్న బండ్లు, పాత మోటార్లలో గూడా, మధుకు ఆశ, తృప్తి కనిపించలేదు. రంగప్ప తలగుడ్డ సర్దుకొని బండిమీద కెగిరి గుర్రాలను అదిలించాడు. బగ్గీ గుర్రాలు రెండూ ఒకే అడుగుతో కదిలినవి.

గుర్రాల కదం వెనుక ఒక లయ, ప్రేరణ ఉన్నవి. వాటి గిట్టలు ఉక్కుశబ్దంలో ఒక క్రమమూ, పద్ధతీ వేగమూ ఉన్నాయి. ఈ చిన్ని ఆలోచన మధుకు క్షణిక మాత్రంగా తట్టింది.

కాని అతని జీవితంలో లయ, ప్రేరణ, క్రమమూ, పద్ధతీ ఏవీలేవు. అతడు నిరాశా వేదాంతి కావటమే అందుకు ముఖ్య కారణం. బగ్గీ వెళ్ళి ఇంటి ముందు పోర్టికోలో నిలిచింది. అతడు లోపలికి వెళ్ళకుండానే, ప్రక్కనున్న మెట్లమీదికెక్క నారంభించాడు. అతని గది మేడమీద.

మధువంటి అందమైన ఆరోగ్యవంతుడైన యువకుడు ఒక నిరాశా పూరిత, నిరర్థక నిరభ్యుదయ వేదాంతియైపోయి, కాలం గడచిన కొద్దీ అడవిలోని మునీశ్వరుడి వలె బాహ్య ప్రపంచంతో సంబంధం లేనట్టుగా సంచరించటం ఎవరినైనా ఆశ్చర్యపరుస్తుంది. ఆనాడు అతను పార్కుకు వెళ్ళటం కూడా నూటికి కోటికి జరిగే వింత సంగతి.

కాని మధు పూర్తిగా నిరాశావాదే. తను జన్మించింది - తనదైన ప్రతి వస్తువునూ తను కోరిన ప్రతి వస్తువునూ కోల్పోవటానికే -అన్న సంక్షోభిత నమ్మకంతో అతను జీవనయాత్ర సాగిస్తున్నాడు. తన కిష్టమైన వస్తువును ఏదైనా సరే తను కోరినాడో అది తనది కాకుండా పోతుందనీ, తత్ఫలితంగా మరింత నిరాశతో, ఆవేదనతో మగ్గిపోవలసి వస్తుందనీ అతనిలో భయంకరమైన అనుమానమొకటి, స్థిరపడిపోయింది. ఈ అనంత నిరాశావాదానికి అతని జీవితగతే పెద్దకారణం. చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఎవరూ తీర్చలేని ఈ పెద్ద కొరతతో అతని బాల్యం గడిచి పోయింది. ఈ ఒంటరి అనాథ బాలుణ్ణి తాతగారు (తల్లినిగన్న తండ్రి) పెంచారు. తాతకు పెద్ద జమీ అంతటి ఆస్తి ఉన్నది. ఆయన గూడా ఏకాకే. మధు - ఆ ఆస్తికి ఏకైక వారసుడు. మధు ఈ జమీ ఇంటికి వచ్చిన కొలదీ వారాల్లోనే తాతగారికి క్షయ వ్యాధి వచ్చింది. అప్పటినుంచీ ఆయన ఆరోగ్య రక్షణకు నీలగిరి కొండల్లోనో, మదనపల్లి శానిటోరియంలోనే కాలక్షేపం చేస్తున్నాడు. ఈ వాతావరణంలో, తాతగారి తల నెరిసిన గుమాస్తా రామకిష్టయ్యగారి సంరక్షణ కింద, ఇంటి సేవకుడు రంగప్ప జాగ్రత్త కిందా

లంకవంటి కొంపలో - దిగులుగా యువకుడైనాడు మధు. అతనికి స్నేహితులు లేరు. సరదాలు లేవు.

కాని ఈ ఒంటరి జీవితంలోనే మధుకు సంగీతమంటే అభిమాన మేర్పడింది. అతన్ని శూన్యలోకాలనుండి వస్తు ప్రపంచంలోని రంగుల వైవిధ్యానికి కొనివచ్చేది సంగీత సాధన ఒక్కటే. మేడమీద ఏ మూలనో చీకట్లో కూర్చుని ఫిడేలో, వీణో, మురళో ఎదలో నిద్రాణమైయున్న తంత్రుల్ని జాగ్రదవస్థకు ఆకర్షిస్తుంటే, గంటలు పరవశతలో గడపటం అతనికి క్రొత్తగాదు. కొన్ని గంటల తర్వాత, నిరంతన ప్రకృతి ప్రేమగీతికవలె నలుదిశలా చిరుతరంగాలను రేకొట్టి కాలాన్ని జోకొట్టుతున్న ఆ సంగీత నిస్వాసాలు హఠాత్తుగా ఆగిపోతాయి. హృదయవీణా తంత్రుల్ని మీటుతున్న మృదుల హస్తపు లేతలేత అంగుళీయాన్ని ప్రకృతిమాత ఒక్క శాపంతో స్తంభింప జేసిందో లేక స్వాభిలాష లేని సంగీతాన్ని శమింప జేసినందుకు తంత్రులన్నీ ఒక్కసారిగా తెగి పోయినవో తన జీవికలోని నిష్ఫలత గోచరించగానే అంత అకస్మాత్తుగా నిరామయుడై పోతాడు. వాయులీనగానం అతన్నిక వేధించదు. బాధించదు. నిర్గుణత్వం ఆవహిస్తుంది.

అతనికి ఆస్తిపాస్తుల వ్యవహారాల్లో ఇసుమాత్రపు జోక్యం గూడా లేదు. ఆ విషయాలు రామకిష్టయ్యగారివి. సంగీతం ఆగిపోగానే రంగప్ప వచ్చి - "బాబూ, భోజనం వేళ అయింది" అంటాడు. ఇది మధు నిత్యజీవితం. కాలేజీలో చదువుకునే అవసరం కూడా లేకపోయినట్లయితే దైవిక కృత్యాల్లో వేరేమార్పు ఉండేది కాదు. కాని పొద్దున ఎంత ఆలస్యంగా లేచినా కళాశాలకు వెళ్లే అలవాటు అతడెప్పుడూ మానుకోలేదు.

## 2

ఏపని చేసినా తాపీగా నిరుత్సాహంగా ఒడంబడే మధుకు సంగీతం ఆత్మానందమే గాక శరీర వ్యాయామం కూడా యిస్తుంది. ఒడలంతా చిరుచెమటలు పడతాయి, అలసి పోతాడు. ఆ తరువాత నిద్ర అతి సులభంగా వరిస్తుందని అతని అనుభవం. అట్టి అలసటతోనే చీకటి గదిలో అతను విశ్రమిస్తున్నాడు. చీకటి అతని ప్రేయసి, సురాపాత్ర. రామకిష్టయ్యగారు వచ్చి దీపం వేసి, కళ్ళజోడు తీసి చేతిలో పెట్టుకొని, వేరొక చేతిలో ఉన్న పింగాణీ పళ్ళెం మధు ముందు ఉంచాడు.

"ఏమిటిది?"

"ఏమి లేదు మధుబాబూ, మా సుశీ పట్టినరోజు పండుగ. పంచమి, శ్రావణ శుద్ధ పంచమి గాదు బాబూ ఇవ్వాళ? ఇంట్లో మిఠాయి చేయించాను. తల్లి లేనిది

నాయనా. ముచ్చటా మురిపెం ఎవరు తీరుస్తారు?"

మధు సిగ్గుతో ఒక లడ్డు తీసి నోటిదాకా పోనిచ్చి హఠాత్తుగా తిరిగి పళ్ళెంలో ఉంచి - "తాళం చేతులు ఇనప్పెట్టెలో పెట్టారా?" అని అడిగాడు.

ముసిలాయన ఆందోళనతో "లేదు బాబూ, బోడ్లో గట్టుకు తిరుగుతున్నా" అని అతని ప్రశ్నకు విస్తుబోతూ సమాధానం ఇచ్చాడు. ఎందుకంటే, తాతగారి ఆజ్ఞ ప్రకారం డబ్బు తాళపు చేతులు తనే జాగ్రత్తగా పెట్టవలసి ఉన్నా మధు - లెక్కలు డబ్బు విషయంలో ఏ మాత్రమూ అంటకుండా తిరుగుతాడు. నెలకు ఒకటి రెండుసార్లు తనకు కావలసిన డబ్బు తీసుకొని, రామకిష్టయ్యగారు వ్రాసిన పద్దుకెదురుగా పొడి అక్షరాలతో తన సంతకం మాత్రం పెడతాడు. అంతే. ఆర్నెల్లకోసారి తాతగారెక్కడ ఉంటే అక్కడికి వెళ్లి, రామకిష్టయ్యగారు లెక్కలన్నీ చూపించి సంతకాలు తీసుకొని జమా ఖర్చులు సరిజేస్తుంటాడు. ఆ రాత్రి హఠాత్తుగా మధు తాళపుచెవులను గురించి ప్రశ్నించటంలో వృద్ధుడి కరచరణాల వణకనారంభించినవి.

"ఓ వంద రూపాయలు తీసుకురండి"

రామకిష్టయ్యగారి నోటిమీదకి "ఎందుకు బాబూ?" అన్న ప్రశ్న వచ్చింది గాని, వెంటనే దిగమింగి తిరిగి కళ్ళజోడు పెట్టుకొని ఒక పెద్దనోటుతో మళ్ళీ ప్రత్యక్షమైనాడు.అప్పటిదాకా మధు మిఠాయిని ముట్టుకోనేలేదు.

"ఏమన్నారు అమ్మాయి పేరు?"

ముసిలాయన ఈ ప్రశ్నకు మరింత చకితుడైపోయాడు. ఈ పెద్ద ఇంటి తోటలో ఆ మూల పాత ఇంట్లో ఇన్నేళ్ళుగా ఉంటున్నా మధుబాబు ఆ ఛాయలకెప్పుడూ పోలేదు. సుశిని ఎప్పుడు చూశాడో గాని పుష్పవతి అయిన తర్వాత చూడలేదు.

"సుశీల గాదూ బాబూ. వట్టి పిచ్చిది. తల్లిపోలిక అమాయకత్వానికి, మాటకారి గాదు. పిచ్చితల్లి."

"సుశికి ఏమన్నా కొనిపెట్టండి" అని ఆ వాక్యాన్ని తను పొడిగించాడు మధు. తన చేతిలోకి ఆ వందరూపాయల నోటు తీసుకోనేలేదు. అదింకా ముసిలాయన చేతుల్లోనే ఉన్నది. వృద్ధుడి కళ్ళనిండా నీళ్ళు తిరిగినవి - ఈ అయాచిత బహుమానంతో కృతజ్ఞతతో అతని కంఠం పూడిపోయినది.

"తమరింట్లో ఉప్పు తింటున్నాంగా బాబూ. ఏదో చిన్న పండుగ. పెద్ద విషయాలకు తమ ముందుకు వచ్చి కష్టసుఖాలు విన్నవించుకొంటాను" అని వృద్ధుడు మధు ముందే ఆ నోటు ఉంచబోయాడు.

"వద్దు. వద్దు. తీసుకోండి. సుశికి గుడ్డలు కొని వ్వండి" తన చేతుల్తో నోటు తాకలేదు. రెండు చేతుల్లోనూ రెండు లడ్డు తీసుకొని పని కల్పించుకొన్నాడు మధు.

రామకిష్టయ్యగారు మెట్లు దిగిపోతూ మరోమారు పైకివచ్చి-"బాబూ, తమర్ని వేరే విషయం అడగాలని వచ్చి బొత్తుగా మరచిపోయా. తాతగారి నుంచి ఉత్తరం వచ్చింది. ఊళ్లో దొంగతనాల సంగతి వ్రాశాను. మన రాత్రి కాపలావాడు చచ్చిపోయం తర్వాత, నమ్మకస్థుడు దొరికితే చూద్దాంలే అని ఎవర్నీ పనిలో పెట్టలేదు. తాతగారు వ్రాస్తున్నారుగదా-మన ఇంటికి కూడా శుభం శోభ. కింద భాగం ఎవరికయినా అద్దెకిచ్చెయ్యమని. కళ్ళకద్దుకు తీసుకొంటారు బాబూ- ఈ రోజుల్లో."

"ఊ"

"కొత్త బ్యాంక్ మేనేజరుగారి బదిలీ మీద వచ్చారు. మనవాళ్ళేనట. ఎక్కువ బాదరబందీ లేదుట. తమ కిష్టమయితే వారికి మాట ఇచ్చేస్తాను. తమర్ని కలుసుకోమని సెలవా?"

"అక్కర్లేదు"

"మరి ప్రవేశించమని చెప్పనా? ఇల్లంతా బావురుమంటున్నది. ఆ వంట మనిషి కూడా భయపడి ఛస్తున్నది. రేపే వచ్చి మంచి ఘడియల్లో దిగమంటాను".

"మంచిది" అన్నాడు మధు ఒక క్షణం ఉండి. ఎందుకన్నాడో ఏమో అతనికే తెలియదు.

మధు ఆ సాయంత్రం కాలేజీ నుంచి వస్తూంటే, బ్యాంక్ మేనేజరుగారి సామానులను సేవకులు ఇంట్లోకి చేర్చటం కన్పించింది. ఆ సామాన్ల వెనుకనే చిన్న కార్లోంచి మేనేజరు గారి కుటుంబం అంతా దిగుతున్నారు. సగం మెట్లెక్కి మధు ఎందుకో గాని వెనుదిరిగి చూశాడు. కార్లోంచి ఒక తెల్లటి సన్నని అమ్మాయి, చేత గొలుసు పట్టుకొని దిగుతూ, 'ఫిడో', 'ఫిడో' అంటూ నిల్చున్నది. ఆ పిలుపుకు ఒక తెల్లసీమ కుక్క కిందికి దూకింది. కుక్కను చూచుకొని ఆ పిల్ల నవ్వుకొన్నది. కుక్కపిల్ల ఆ అమ్మాయి చుట్టూ ప్రదక్షణం చేసింది- రెండుసార్లు. ఆ అమ్మాయి మేనేజరుగారి కూతురు ప్రీతి ఆ అమ్మాయి నుంచొన్న చోట ఏదో శోభ వెలిసినట్లయింది. ఆ ప్రదేశానికి అవాచ్య సంపూర్ణత సమకూడినట్లుగా వుంది. ఆమె తోడుతో యింకో ముత్తయిదువ దిగింది. "ఏమే పిల్లా నీకు కుక్కపని తప్పితే, ఇంటి సామాన్లు సర్దటం గిట్టదా ఏమిటి? పదపద. ఆ కుక్కముండను అట్లా పెట్టేసి సామాన్లు సర్దించు మీ నాన్నగారు వస్తారు" అన్నదామె - కుక్కతో ఆడుతూన్న కూతుర్ని చూసి మధుకు అప్రయత్నంగా నవ్వువచ్చింది. అక్కడే

వాళ్లకు దగ్గరలోనే నిలబడి ఉన్న రామకిష్టయ్యగారు కూడా ఆ కుక్కను ఆడిస్తున్న ఆ పిల్ల ఆటలకేనేమో నవ్వుకొన్నాడు.

మరునాడుదయం సెలవు కావటం వల్ల మధు మేడమీదనే ఉన్నాడు. సాయంత్రం షికారుకని మెట్లు దిగి దిగుతుండగానే, పోర్టికోలో బొచ్చుకుక్క 'భౌ, భౌ' అని అతన్ని అడుగుదీసి అడుగుపెట్టనియ్యలేదు. మీదపడి పీకిరక్కినంతపనిచేసింది. ఇంతలోనే ఆ అమ్మాయి వచ్చి - కుక్కను సంబాళించుకొని "'ఎవరునువ్వు? కుక్కలున్నై జాగ్రత్త అని బోర్డుకూడా పెట్టాం. అః కరువదు మరీ అః అని'' మధును నిలవేసి దబాయించటం ప్రారంభించింది.

రంగప్ప ఈ గందరగోళానికి రొప్పుకుంటూ రోజుకొంటూ వచ్చి, నోటిమీద వేలేసుకొని - "స్సుస్సుస్స్-బాబుగారమ్మా-బాబూగారు-" అని ముందుకొచ్చి బాబుగారికి దండం పెట్టాడు.

ఆ అమ్మాయి తెల్లపళ్ళన్నీ వెళ్ళబెట్టి - "మా కుక్క చాలా మంచిది. దొంగల జోలికి తప్పితే పోదే?" అని చిలిపిగా కిలకిలా నవ్వింది. రంగప్పకు కోపం వచ్చినా యేమీ అనలేకపోయాడు. "ఫిడో" తోకాడిస్తూ మధుబాబు బూట్లునాకి, యజమానురాలి దగ్గరకు పోయి మళ్ళీ ఓ ప్రదక్షిణం చేసింది. మధుకు చిరునవ్వు వచ్చింది. షికారు పోవటం మానుకొని గిరుక్కున వెనుదిరిగి మెట్లెక్కి పైకిపోయాడు.

రంగప్ప ప్రీతివంక చూస్తూ - "యజమాన్లు, ఈ ఆస్తంతా ఆ బాబుగారిది. కుక్కను కట్టెయ్యండమ్మా" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆలోచించుకొంటూ మధు తన గదిలోకి పోయాడు. లైటు వేసి తిరిగి ఆర్పివేశాడు. స్నేహితులూ, గుంపులూ అంటే - ఎప్పుడూ జొరబడని అతనికి ఆ రోజున అదొక కొత్త అనుభవం. ఆడపిల్లలతో మాట్లాడటానికదే ప్రథమం. నిజానికి ఆ అమ్మాయితో తను మాట్లాడిందీ లేదు. ఆ పనంతా ఆ పిల్లవంతులోనే వేసుకొన్నది. అందులో అట్లా దబాయించింది. చిరుగంటలవలె చిన్న చిన్న తెరలుగా ఆ నవ్వు, అతని కంతా ఆశ్చర్యమయంగా తోచింది. ఆ ఆశ్చర్యంతోనే వాయులీనం కొత్త సంగీతం పాడింది.

## 2

మధు, ప్రీతి స్నేహాన్ని సంపాదించటం కన్నా, తత్స్నేహం అతనిమీద బలవంతంగా వచ్చి పడిందనటమే సమంజసం.

మధు కాలేజీకి వెళ్లే సన్నాహంలో మేజోళ్ళు తొడుక్కుంటున్నాడు. గది తలుపు

మీద రెండుసార్లు చిన్న చిన్న శబ్దాలయినవి. అటుతిరిగి చూచాడు. ప్రీతి లోనికి అడుగు పెడ్తూనే-

"ఏం చదువు?" అని బాణం విసిరిన చందంలో ప్రశ్న వేసింది. యువకుడు తబ్బిబ్బయినాడు - "బి.ఎ"

ఏ గ్రూపు?"

"సై...న్సు...."

"ఎందుకని?"

"ఊఁ"

"ఊఁ ఏవింటి ఊఁ"

"సైన్స్ మెడిసిన్‌కి వెళ్దామని" మధుకు ముచ్చెమటలు పోయడం ఆమె చూస్తేనే నుంచొంది.

"ఈ ఫోటో?"

"తాతగారిది"

"ఇలా పిలవండి"

"మదనపల్లిలో - మందుతీసు".....

"ఆ సంగతి నేనడగలేదు గాని - నేనొచ్చిన పని వేరే ఉంది. చదివేందుకేమైనా పుస్తకాలున్నయ్యా - అట్లా చూస్తారేంటి. మీ దగ్గరేనండి బాబూ."

మధు ఈ, రాంబాణాలకు తెప్పరిల్లలేక - "లేవు" అన్నాడు మొదట. ఊఁ, వూఁ ఉండాలి అన్నాడు మళ్ళీ.

"ఉంటే ఇయ్యండి - చదువుకోవాలి ఏమీ తోచటం లేదు. ఎవరి మానాన వాళ్ళు వెళ్ళిపోతారు. నేను పొద్దుపోక ఛస్తున్నా ఈ కొంపలో. వెళ్తూ వెళ్తూ అలా కింద పడేసి పోండి పుణ్యం ఉంటుంది"

గాలివానవలె వచ్చి పూలజల్లువలె పోయింది- ఆపిల్ల. ఆ వంకనే చూస్తూ, మధు మేజోళ్ళు తొడగకుండా బొమ్మవలె స్తంభించిపోయాడు. ఎవరీపిల్ల? మొదటిసారి ఈ గదిలోకి వెన్నెల తెచ్చి వలకపోసిన మాలతీలత-ఎవరు? నవ్వుతాలో, కోపమో, అధికారమో, అమాయకత్వమో-ఆమె భాష అతనికగమ్యగోచరమైంది. తుఫానువలె వచ్చింది. అప్పుడే ఎందుకుపోయింది. మధు తన ముఖం మీద స్వేద బిందువుల్ని తుడుచుకున్నాడు కొందుకొచ్చిందట? పుస్తకాలికి.

అతను తాతగారి పుస్తకాలయం గదిలోకి వెళ్ళాడు. ఆ పిల్లపేరేమిటి? ఏం పుస్తకాలు ఇష్టమో? ఏం కావాలో? ఆ మాట చెప్పలేదే? అడిఇతే మళ్లీ రాంబాణాల ప్రశ్న పరంపర వదులుతుందేమో. ఎగతాళి చేస్తుందేమో. బూజుపడుతున్నా, దుమ్ము, ధూళి దూసరగ్రస్తమైన అల్మాయిరాలన్నీ వెతకనారంభించాడు. అన్నీ పురాతన గ్రంథాలు కొన్నిటికి చెదలు గూడా పడుతున్నై, అట్టలు చిరగని రెండు పుస్తకాలు వెలికితీసాడు. ఆలోచన, సందేహం, సిగ్గు, భయం మళ్ళీ అక్కడే పెట్టాడు. ఏమి తోచిందో యేమో, వెంటనే చెప్పులు వేసుకొని బజారుకెళ్ళి ఒక పుస్తకాల దుకాణంలో ఇన్ని కొత్త నవలలు కొని తెచ్చి, అల్లికలో మొల్లపాటపాడుతూన్న ఆమె ముందుకెళ్లి నించొన్నాడు. ఆమె కాళ్ళకింద సుపుత్రి "ఫీడో" మెదలగానే ఆమె అతని వంక చూసింది. పుస్తకాలు అందుకొంటూ- "అరే, అన్నీ కొత్త ప్రచురణలు. భలే మంచి పుస్తకాలు మొత్తానికి అసాధ్యులేనండి" అన్నది - అతన్ని వీపు చరచలేదు. అంతే (అక్కడిదాకా చెయ్యి లేచింది).

మధు నవ్వుతూ, సిగ్గుతో నిలబడ్డాడు.

"అరే, మీరు కాలేజీ గూడా మానుకొన్నారు లాగుందే. పాపిష్టిదాన్ని నా పుస్తకాలకోసం ఇంత పని చేయించానా? ఇందాకా గమ్మత్తు చేద్దామని అలా దబాయించేశాను. మనకలవాటేలేండి-ఇంట్లో! మీరు ఏం అనుకోకండేం. రొంబా థాంక్సు. పుస్తకాలికి మిమ్మల్నడక్కుండానే తోటలో పూలన్నీ కోసేస్తున్నాను. మరేం అనుకోకండేం! మన కలవాటేలేండి-అడక్కుండా పూలుకోయటం!!

ఒకటే ధోరణి. జలపాతం కాకపోయినా, కవులు మెచ్చే సెలయేరు రొద.

ఇంతలోకే ప్రీతి తల్లి అక్కడకు వచ్చింది. మధు సిగ్గుపడుతూ ఇవలకు వచ్చేశాడు. ఆమె కూర్చోమంటున్నా. అప్పటికి కాలేజీ సమయం మించి రెండు గంటలు దాటింది.

అంతే, ఇద్దరికీ అంత సులభంగా స్నేహం కలిసింది. ఆమెది తన స్వభావానికి కేవలం వ్యతిరేకశక్తి అని మధు గ్రహించాడో లేదో గాని, ఆమె సన్నిధిలో కలిగే అనూహ్యానందంలో, ఆ ఆనందానుభూతిల్వ పాలుపంచుకోటానికి వెనుకంజ వేయలేదెప్పుడూ. నవ్వుతూ, పాడుతూ, కేరింతలు కొడుతూ, హాస్యంగా, గేగా, విచ్చిన గులాబి పుష్పం వలె ఆ పిల్ల సిగ్గుతో - దీనంగా, జిజ్ఞాసలో త్రొక్కిసలాడుతూ తనూ. ఒకటి ఉత్తర ధృవమూ, మరొకటి దక్షిణ ధృవమూ, ఆమె ఆశ, అతని నిరాశ.

మొదటి రోజుల్లో ప్రీతి అతణ్ణి గురించిన ఏ ప్రశ్నా వెయ్యలేదు. అంతా 'తన' గురించే ప్రతివాక్యంలో నేను, నాది, నా కోసం నాకు దొర్లివస్తుంది. నాకు ఫిడో అంటే

భలే ఇష్టం. మా నాన్నగారి కెప్పుడూ బ్యాంకు గొడవే. మా అమ్మకు మూడొందలరవై అయిదు రోజులు ఏదో ఒక నోము, వ్రతమూ, పూజా, నాకు పుస్తకాలంటే ఆరోప్రాణం. నేను కొత్త పూల వేసులుకొన్నా చూశారా? చూపిస్తారండి. ఇది దక్కను మోడలు ఇది. ఇది రాజస్తాన్ పనితనం. ఈ బెంగాల్ లేసు-శాంతినికేతనం పరిశ్రమ శాఖ వాళ్ళది - అన్నిటికంటే నాకు ఇదే బాగుంటుంది. నీకు? (మీరు నుంచి నీకు, మళ్ళీ మీరు - కు సంభాషణల్లో ఇష్టం వచ్చినట్టు మారుతుంది)

సాధుమూర్తి మధు, ఈ అపరిచిత బాలిక అధికారం కింద కించపడుతున్నాడని రంగప్ప, రామకిష్టయ్యగారు తలలు ఓ దగ్గిర చేర్చారు. ఈ బాలికగా కనబడే యువతి తల్లిదండ్రులకు కించిత్ జ్ఞానమైనా ఉండక్కర్లేదా? రామక్రిష్ణయ్యగారు ధైర్యం చేసి మధును హెచ్చరించబోయాడు.

"బాబూ - ఈ మేనేజరుగారి అమ్మాయి - మన ఇంట్లో అద్దెకున్న వారి అమ్మాయి..'
'

"చాలా మంచిదికదూ!" అని పూర్తిచేశాడు ఆ వాక్యాన్ని మధు. చలించి విభ్రమంతో వృద్ధ గుమాస్తా ఆ మాటవిని, ఒక శిరః కంపనంతో మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

## 4

ఉక్కును ఆకర్షించే సూదంటురాయివలె, ఆమె స్నేహాన్ని, మానసిక సన్నిహితాన్ని గాఢంగా ప్రగాఢంగా వాంఛించటం మధుకు అవ్యక్తావస్థతగానే అలవడింది. ఆమె స్నేహం కోసం, ఆమె చదివే పుస్తకాలే తను చదవటం, ఆమె సాన్నిహిత్యం కొరకు ఆమె ప్రేమించే పూ పొదలనే తను ప్రేమించటం. ప్రీతి హఠాత్తుగా వచ్చి, 'ఇదిగో ఈ పుస్తకం చాలా బావుంది." - అని అథార్టీ చెలాయించినట్లుగా, అతని మీద తనకేదో ఎదురులేని అధికారం ఉన్నట్లుగా ఓ పుస్తకం ఇస్తుంది. తక్కిన పనులన్నీ అట్టే పెట్టి వెంటనే మొదటి పేజీ నుంచి ప్రారంభిస్తాడు శ్రద్ధతో.

మధు చీకటి గదిలో కూచొని సంగీత సాధనలో ఉంటే చడీ చప్పుడు లేకుండా వచ్చి, హఠాత్తుగా లైటు వేస్తుంది, లేదా వెనుక నుంచి కళ్ళు మూస్తుంది. "నేనిచ్చిన పుస్తకం చదవటం మానేసి ఏమిటి పని?" అని కోపం అభినయిస్తుంది. మధు ఫిడేలు అవల ఉంచి పుస్తకము చేతబట్టుతాడు. ఈ మూగ శిష్యత్వం చూసి ఆమె పక్క లెగిరి పోయేటట్లు నవ్వుతుంది. "ఇంత పిచ్చివాడివైతే ఎట్లా?" అని అతని జుట్టులో తన చేతివేళ్ళు దూర్చి బుజ్జగిస్తుంది.

అతనికి సంతోషదాయకమైన పాటలు పాడటం నేర్పింది ఒక విధంగా ఆమే.

అతని పాటల్లో విషాదరాగాలకు ఆమె చలించిపోయినట్లు ఒడలు జలదరించుకొనేది. "కాదు, ఇంకో రాగం" "కాదు ఇంకోటి" అని వేధించి వేధించి మధు చేత విప్పారుతున్న పుష్పగీతికల సంగీతం పాడించేది. అతను పాడుతున్నప్పుడు మాత్రం నాగస్వరానికి కట్టుపడ్డ త్రాచువలె, అంతఃపురాంతర మందిరంలో కూచొని ఆస్థాన గాయకుడి వీణానాదం వింటున్న రాకుమారివలె ముగ్ధయై బొమ్మగా మారిపోతుంది.

ఆమె అతని పాలిట ఆనంద దేవత అయిపోయింది. కాలేజీ నుంచి వస్తూ వట్టి చేతులతో ఎప్పుడూ రాడు. లక్ష్మిని కొలిచే వ్యాపారి అయినాడు. ఆమెకు అందంగా కట్టిన పూల గుత్తులు తెస్తాడు. కొత్త పుస్తకాలు తెస్తాడు. ప్రీతి వసంత వాయువు. స్థావర వస్తువుగా, తన నిరాశా పరివేధిత వేదాంతంలో సుస్నితమైన జడునిగా మారిన మధు, ఆ వసంత వాయు ప్రసారంతో తిరిగి చైతన్యవంతుడు కాసాగాడు. తన సిగ్గుకు, భయాందోళిత మానసికావస్థకు, అశాంతికి - కారణం - ఇన్నాళ్ళూ ఈ ఆనందమూర్తి, కళ్యాణ దేవత తన దగ్గరలో లేకుండటమే అని అతడు ఆశ్చర్యపడ్డాడు.

క్రమక్రమంగా అతని మౌన వ్రతానికి కూడా పెద్ద పెద్ద విఘాతాలే తగల సాగినాయ్ చెవులు మెలిపెట్టో బుగ్గలు గిచ్చో, జబ్బమీద పాశం పెట్టో, చేతులకు తన గోళ్ళతో మురుగులు ఎక్కించో, జుట్టుపీకో, చిన్న చిన్న మొట్టికాయలు వడ్డించో, తలుపు సందున దాగి వులికించో, పాపిడ చేరిపో-అంతంలేని తన విచార గీతిక నాపి వేసిన - ఈ అల్లరి పిల్ల ముందా తన శాంతి? ఆమె ఆనందనృత్యం ముందా తన మౌనం? ఈ విశ్వాస దేవతను చూచి బ్రదుకునే నమ్మవచ్చు. మృత్యువునే కౌగలించవచ్చు.

పత్రికల్లో అతని పరిక్షా ఫలితాలు వచ్చినప్పుడు, ప్రీతి పుటలు తెరిచిందాకా అతనికి నమ్మకం లేదు. అతడు కృతార్థుడైన సంగతి. అవిశ్వాస దేవత పెదవుల నుంచి వచ్చినదాకా అతని హృదయం రోగి హృదయం వలె పవిచేసింది.

మధు మొదటినుంచీ డాక్టరు కోర్సుకు పట్నం వెళ్దామని ఆశించాడు. తాతగారి ఆశయమూ అదే. తన అభాగ్య విధి నుండి - వైద్యుడై తను మానవసేవలో కృతార్థుడైనప్పుడు - శాపవిముక్తి దొరుకుతుందని అతని వింత ఊహ. ఇట్టే వచ్చి అట్టే గడచిపోయాయ్-వేసంగి సెలవులు. మెడికల్ సీటు వచ్చింది. అంతవరకూ ప్రీతికి తెలియనివ్వలేదు. ఆమె విచారిస్తుందని, దిగులు పడుతుందని, చివరకు ఏడుస్తుందేమోనని గూడా భయపడ్డాడు. తను పట్నం వెళ్ళవలసిన రోజు సమీపిస్తున్న కొద్దీ-ఈ ఊహాభారంతో అహర్నిశలూ సతమతమైనాడు.

ఆ రోజు అప్పుడే కురిసి వెలిసిన వానలో ఇద్దరూ తోటలోపూల మడులు పరిశీలిస్తున్నారు. ప్రీతి ఉండీ ఉండి అదనుచూసి, జాగ్రత్తగా బాటలో బురదకాకుండా

నడుస్తున్న మధుకు బురదలోకి తోసింది.

"ఇక పదిరోజులేగా?" అన్నాడు తిరిగి కాలిబాట మీదికి వస్తూ.

"ఆ తరువాత?"

"ఆ తరువాత నేను పట్నంలో - నువ్విక్కడ"

"పట్నం ఎందుకో పోకిరి బాలుడా!"

"డాక్టరు చదువుతాగా"

"ఓహో! ఎంతమంది నిర్భాగ్యుల ప్రాణాలమీద తమరు ప్రయోగాలు చెయ్యబోతారో అట్టి లిస్టు ఒకటి తయారు చేయించే ఏర్పాటేమైనా ఉందా?"

ఎంత చులకనగా నవ్వింది. హృదయాంతరాళంలోని అగ్ని పర్వతం పగిలి పోతుందనుకొన్న మధుకు ఈ చిలిపి వాక్యం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇన్నాళ్ళూ భావి వియోగమధురానుభూతిలో మునిగి తేలున్న తనకు ఆమె మాటలు అత్యల్పాలుగా తోచినాయ్. తను - ఉండటం, వెళ్ళటం-ఆమెకేమంత ముఖ్య విషయాలు కావన్నమాట! ఆమె కళ్ళల్లోకి జాలిగా, ఆశ్చర్యంగా, ఖిన్నుడై చూచాడు.

"అయితే మీకు సెలవలిస్తుంటారుగా. వైకుంఠం లిస్టులో పేరుమీద పేరు ఎక్కిస్తుండు. మళ్ళీ సెలవల్లో వచ్చి వాకు పూలూ, పుస్తకాలూ, పాటలూ కరువున పడకుండా చూడు"

మళ్ళీ ఈ చిలిపి మాటల్తో అతనికి ఉత్సాహం అంకురించింది.

"నాకు.... నీ ఆటలు, మాటలు, నృత్యాలూ. కరువవుతైగదా?"...ఈ మాటలు పెగిలి రాలేదు అతని కంఠం నుంచి.

అతడు పట్నం వెళ్ళే రోజున స్టేషను దాకా రామకిష్టయ్యగారూ, రంగప్పా వచ్చి దిగబెట్టిపోయారు. తన కన్నీటి వీడ్కోలులో-ప్రీతికి చెబుదామనుకొన్న శాంత వచనాలు అతనిలోనే ఉండిపోయాయి. ప్రీతి అసలు స్టేషనుకే రాలేదు. మధుకు రామక్రిష్ణయ్యగారినీ, రంగప్పను కూడా విడిపోవాలని తట్టగానే కళ్ళనీళ్ళు వచ్చినవి. రైలు ప్రయాణమంతా ఏవేవో పిచ్చి ఆలోచనలతోనే గడిచిపోయింది.

## 5

పట్నం వెళ్ళిన కొద్ది రోజులకే మధుకు ఈ కొత్త జీవితం మీద విరక్తి జనించింది. ప్రీతిసన్నిధిలో ఆశా వినోది అయినవాడు, ఈ దూరంలో తిరిగి తన పాత నిరాశా పరిధిలోకి తరలిపోయాడు. నిర్విచారంగా, కుటుంబ భారాలు ఆర్థిక బాధ్యతలూ లేక కేరింతలు

కొట్టి తిరిగే కుర్రవాళ్ళ మధ్య హాస్టలు జీవితం అతనిలో ఏ నూత్నోత్సాహాన్నీ రేకెత్తించలేదు. రెక్కలు వచ్చిన కొత్తపక్షులవలె ఎగిరి గడిచిపోయిన గత సంవత్సరంకోసం అతను ఆక్రోశించసాగాడు. ఆమె స్నేహమేనా తను వాంఛిస్తున్నది? ఆమె ప్రేమకై తను తహతహ ఈ ఎడబాటులో అతనికి తెలియవచ్చింది. ప్రేమ! ప్రతిరాత్రి నిద్రకు సోలితూలిపోయే ముందు, ప్రీతిని ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచమని భగవంతున్ని ప్రార్థించేవాడు. "ప్రేమించటం"లో ఇంత అశాంతి ఉన్నదని మొదటిసారిగా తెలుసుకున్నాడు. ఆ తలంపు మనసు నావరించినప్పుడల్లా, పాత నిరాశదృక్పథం కూడా పీడకల వలె చుట్టుముట్టేది. ఆ దివ్యలోకాల పరిధిని, భయంకరమైన కలలు వచ్చేవి. జడుసుకొని మేల్కొనేవాడు. "నేను కోరింది ఏది నాదైనది? ఆమెను నేను కోరటానికి ఎంత దుర్మార్గుణ్ణి?" అనుకొనేవాడు. దినమొక యుగంగా గడిచే ఆ రోజుల్లో-ఈ అప్రస్తుత తలంపే అతన్ని మరింత కుంగదీసేది.

ఒకరోజున ధైర్యం చేసి ఆమెకు జాబు వ్రాశాడు. కేవలం ఆమె క్షేమం అడుగుతూ. వ్రాసిన రోజు నుంచీ జవాబుకు ఎదురుచూశాడు. కాని ఆమె తిరిగి వ్రాయలేదు. హాస్టల్లో కుర్రవాళ్ళు అతనికి చాలా పేర్లు పెట్టారు "శోకాచ్ఛాధితుడు" అన్నది. దాని తక్కువ తరగతి నామాంతరాల్లో ఎక్కువగా చలామణి చేశారు. కాని మధు చాలా ధనవంతుడని వాళ్ళకు తెలియకపోతే ఇంకా ఏమేమి ఏడ్పించేవాళ్ళో. కాని 'ధనం' అనగానే గుడ్డి గౌరవాన్ని సంపాయించే ఈ దేశంలో,ఆ ఒక్కపదంతోనే వాళ్ళ మానసిక హింసాత్మక చెలగాటం ఆగిపోయింది.

సెలవలు రాగానే తాతగారి వద్దకు వెళ్ళి నీలగిరి కొండల్లో ఒకవారం రోజులు మాత్రమే గడిపి, తిరిగి ఆత్రుతతో వూరికి వచ్చి చేరాడు. ప్రీతికి పూలు, పళ్ళూ, పుస్తకాలు, ఒక కొత్త గ్రామఫోను తెచ్చాడు బహుమతులు. ఇక్కడ ఏ మార్పూ లేని వాతావరణం చూడగానే అతనికి అమితానందం కలిగింది. ప్రీతి ఆటల్తో, చిన్న తగాదాలతో కాలగమనాన్ని గుర్తించే విరామమే దొరకలేదు.

వృద్ధ గుమాస్తా రామకిష్టయ్యగారూ, రంగప్పా "ఈ చినబాబుగారిని" చూడగానే పొందిన ఆనందం వాళ్ళ అశ్రుల్లో చూచి సిగ్గుపడ్డాడు- ద్వీపాంతరం వెళ్ళి తిరిగి వచ్చిన వానిని ఆశీర్వదించినట్లుగా తన దర్శనంతోనే ఆ అమాయికులిద్దరూ పొందిన సంతోషానికి!! తన నుండి ఏ బహుమానం వాళ్ళు ఆశించి ఉండరు. తన క్షేమమే వాళ్ళ ఆనందం, సాయంత్రం కనుచీకటి పడుతూండగా ఒక పళ్ళెం మీద తెల్లని గుడ్డకప్పి ఇన్ని తీపివస్తువులు తెచ్చి ముందుంచాడు - ముసలి గుమాస్తా.

"ఎందుకివన్నీ - మీకు లేనిపోని శ్రమ?" అంటూ మధు ప్రీతికోసం మెట్లు

దిగబోతూ అన్నాడు.

"శ్రమా బాబూ! దీన్ని శ్రమంటారా? మా తల్లి తమరు వచ్చారని చెప్పగానే ఇవి చేసింది"

ఆయన, తన కూతురు సుశీలను గురించి చెప్పాడని కొన్ని క్షణాలకు గాని మధుకు తట్టలేదు. ఆ మరునాడు బజారువెళ్ళినప్పుడు రామకిష్టయ్యగారికో చేతికర్రకొని తెచ్చి బహుమతి ఇచ్చాడు. ఆయన శ్రమతో మేడ మెట్టెక్కడం ఆ కిందటి రాత్రే తను చూసి ఉన్నాడు.

కాని ప్రీతితోనే అతని ప్రపంచం. తన ప్రేమను వెల్లడించాలని తహతహ. ఆ వాక్యమే తన నోటినుండి బయల్వెడలితే, క్రూర విధిబలం తన నామెకు కాకుండా చేస్తుందేమోనన్న భయం. ఆ సాయంత్రం అతనికి పెదిమల కొసవరకూ వచ్చింది "ప్రీతీ-"

ఆమె గులాబీ పొదలో చేరిన గులక రాళ్ళు ఏరుతూన్న దల్లా వెనుదిరిగి చూసింది. అతనికిక మాట పెగలలేదు. ఆమె జడను మృదువుగా స్పృశించాడు. ప్రీతి అతని చేతి మీద ఒకటి వడ్డించింది. "పనీ లేదూ, పాటలేదు, రా, వెళ్ళి చదవనైనా చదువుదాం" అని మేడ మీదికి తీసుకుపోయింది.

అతని ఆంతరంగిక బాధ ఆమె కర్థమైనట్టు ఒక్క సూచనా లేదు. సెలవలయి పోతున్నై. తిరిగి దూరపు ప్రయాణం పెనుభూతం వలె చీకట్లో వేచి ఉన్నది. తిరిగి పది రోజులకు మనో ధైర్యం తెచ్చుకొని - "ప్రీ....తీ"....అని ఉపోద్ఘాతం చేయబోయాడు. ఆమె కళ్ళ లోతుల్లోకి చూచాడు. అతనికేమీ గోచరించలేదు. తనకళ్ళలోనే నీళ్ళు నిలిచాయ్.

"ఎందుకేడుస్తున్నావ్ మధూ?" అని ప్రీతి ప్రశ్నించింది.

"ఏమీ లేదు."

"మరెందుకు?"

"నీ...."

ప్రీతి వెకిలిగా నవ్వింది. ఆమె జడలో పూలను సొగసుగా సర్దుకొన్నది. జడ నుంచి ఒక పువ్వు రాలిపడినది. ఆమె వెళ్ళగానే ఆ పూవు నతడు జేబులో వేసుకున్నాడు.

సెలవులు గడచిపోయినాయ్. మధు పట్నానికి పయనమైనాడు. స్టేషనులో వీడ్కోలు గంట మ్రోగినది.

# 6

ఎడాపెడగా తిరిగే మధుకు పట్నంలో శ్రీరాం అనే సైన్సు విద్యార్థితో కొన్ని విచిత్ర పరిస్థితుల్లో నెయ్యం కలిసింది. ఒక్కరోజుకో -వాళ్ళిద్దరూ మొదటిసారిగా కలుసుకొన్న గంటలోనే -చిరకాల స్నేహితులైపోయారు. కాలేజీ విద్యార్థులు వేసిన ఒక నాటకానికి హాజరై, వినోదం మధ్యలోనే హాలు విడిచి తన గదికి చేరుకున్నాడు మధు. అతని స్వాభావిక గాంభీర్యం, నిర్మల శాంతి పూరిత వాతావరణంలోనే తృప్తి పొందుతుంది. శబ్దం, ఉద్రేకం ఏమాత్రమూ సహించలేని తత్వం అతనిది. తీరా గది ముందుకు వచ్చి, నిలిచిన తర్వాత గానీ తనపర్సు పోగొట్టుకొన్న విషయం, అతనికి స్ఫురించలేదు. పర్సులోనే గదితాళం చెవి ఉన్నది. చేసేది లేక వరండాలో పచార్లు మొదలుపెట్టారు. నాటక హాలులో తను కూర్చున్నచోట జారిపడి ఉంటుందన్న అనుమానం అతనికి తోచలేదు. తోచినా అచటకు పోయే ఓపిక అతని స్వభావ విరుద్ధమైన సంగతి. నాటకం అయిపోయింతర్వాత శ్రీరాంవచ్చి, గది నెంబరు వెదుకుతూ మధును అక్కడే చూసి - మీ పర్సే కామాలి, మీ సీటులో జారిపడ్డది. నాకు దొరికింది. మీరు గుర్తించారో లేదో చీకట్లో మీ పక్కనే నేను కూర్చొని ఉన్నా. ఇదిగో...'' అని అందించాడు అంతే. ఆ క్షణాన్నుంచి ఇద్దరూ మిత్రులైనారు.

చిరునవ్వుతో ఆరోగ్యంగా, బలంగా, ఉత్సాహంగా తిరిగే తత్వం అతనిది. శ్రీ రాం ఆత్మ విశ్వాసం ఎవరినైనా అంటురోగంగా అంటే శక్తిగలది. కాని, మధును కేవలం తలక్రిందులు చేయకపోయినా, అతని నత్తగుల్లవలె ముడుచుకు పోతున్న నిస్సంతోషకర వాతావరణాన్ని కొద్దిగా, కాంతివంతం చేసింది ఈ స్నేహం. ఇద్దరూ సాయంసంధ్యల్లో షికార్లు వెళ్ళేవాళ్ళు.

శ్రీరాం చిటికెలు వేసి - "చూస్తూండు మధూ! ఒక రోజున నా సొంత లేబొరేటరీ స్థాపించి తీరతాను. శతాబ్దాల నుండీ మన భారత స్త్రీలు వంట గదుల్లో మార్పు లేదు గదా. అదే చీకటి, అదేమసి పొయ్యి. పొగ. ఇంతమంది ప్రఖ్యాత శాస్త్రజ్ఞులు, ఎన్నెన్ని బిరుదుల్తో, ఎంతెంత ప్రఖ్యాతితో తిరుగుతున్నారు? కాని కాని వాళ్ళకేమైనా ఇన్ని యుగాల అంధకారపు భారత స్త్రీ వంటగదిలో పొయ్యికి కొంచెం శ్రమ తగ్గించే విధానం కనుక్కోలేకపోయారా? అశక్తత కాదు. ఈ ప్రజమీద సహజ సానుభూతి లేదు. భోగాలు, బిరుదులూ'' అతను ఏమాట చెప్పినా ఇదే ధోరణి. ఇదే విశాల దృష్టి.

శ్రీరాం బీద విద్యార్థని క్రమక్రమంగా గాని మధుకు తెలియరాలేదు. అతనికి సహాయం చెయ్యబోవటానికి ఎంతో ఆతృత చూపించాడు. కాని, ఎప్పుడూ బిడియం లేకుండా ఆ సంగతి శ్రీరాంతో హెచ్చరించలేకపోయాడు. శ్రీరాం-నిరంతరోత్సాహానికి

తన మాట వ్యాఘాతమవుతుందేమోనని భయపడేవాడు.

"మన ప్రాంతాల్లో ఒక్క పరిశ్రమ లేదు గదా నేనక్కడ స్థిరంగా ఉందామన్నా - మధూ! నాక్కొటే భయం. నా జీవితాంతం మాతృదేశానికి దూరంగా ఉండిపోవాల్సి వస్తుందేమో" అని ఓసారి శ్రీరాం అన్నాడు. ఆత్మ విశ్వాసం లేని అతని మాట వినటం మధుకదే ప్రథయం.

"ఎందుకు? మన దేశంలోనే నీ లేబొరేటరీ పెట్టవచ్చు గదా?"

"చాలా ధనం కావాలి"

"ఎంత?"

"ఎంతయినా?"

"నీకు మధు అనే స్నేహితుడున్నాడనేమాట మరచిపోవద్దు - శ్రీరాం!"

శ్రీరాం అతని చేతిని గట్టిగా నొక్కాడు - కృతజ్ఞతాపూర్వకంగా.

"అప్పుగా మాత్రమే సుమా! ఇప్పుడు కాదులే. నేను యీ డి.యస్.సి. గూడా తీసుకొన్న తర్వాత. నీ అప్పు తీర్చేయనిస్తేనే సుమా!"

రింగు రింగున అతడి మాటల్లో ధ్వనించే ఆత్మబలం, భవిష్యత్తు మీద నమ్మకం - మధుకు ప్రీతిని స్మృతికి కొని తెచ్చేవి. ఆ సాయంత్రం నోరుజారి తన రహస్యం, ఇన్నాళ్ళు గుప్తధనంగా దాచిన తన మధురాతి మధుర బాధను అనాలోచితంగా బయలుపెట్టాడు.

"శ్రీరాం! నిన్ను చూస్తుంటే ఆ అమ్మాయి జ్ఞాపకం వస్తుంది. నిజం శ్రీరాం. నీ మాదిరిగానే ఎప్పుడూ ఉత్సాహం - ఆశా-"

శ్రీరాం ఈ మాటల్ని కొంచెం ఆశ్చర్యంతో విన్నాడు. తన జీవితంతో పాలు పంచుకొనే వేరొక వ్యక్తి మనుగడను, అనుమానంగా కూడా ఎన్నడూ ఆలోచనకు రానీయని మధు హఠాత్తుగా ఉచ్చరించిన ఈ వివరణ ఎవరినైనా చకితుల్ని చేసేదే.

చివరకు "ఏ అమ్మాయ్ మధూ!" అని కనుబొమ్మలు ఎగరవేసి ప్రశ్నించాడు.

మధును వెనువెంటనే సిగ్గు ఆవహించింది. కాని అంత సిగ్గులోనూ అతని ముఖ కవళికలు తేజోవంతమైనాయి.

"ఒక అమ్మాయ్. ఆమెను ప్రేమించటం వృథా అని తెలుసు నాకు"

"ప్రేమించటమనేది నిష్కామమైన కార్యం. అది దేవత్వం ఆపాదించుకొంటుంది. నిష్కామమైన దైవకార్యంలో తప్పేమున్నది"

"నీకు తెలుసునో తెలియదో కాని శ్రీరాం. నేను అభాగ్యజీవిని. నేను కోరినవన్నీ కాకుండా పోతాయ్. నాకు దక్కవు. మట్టి గలుస్తాయ్. ఆమెకు నా ప్రేమను చెప్పలేను. చెప్పినా? ఆమె ప్రేమ నాకు దక్కుతుందనే నమ్మకమేముంది? అది ఆమెకు ప్రమాదం కొనితేవటం అవుతుంది"

"నీ వేదాంత ధోరణి బహువిచిత్రంగా ఉంది మధూ. నీకు కాకుండా పోవటమేమిటి? అభాగ్యతేమిటి? వర్తి మూఢనమ్మకాలు. మానవుడు మొదట చెయ్యదగిన పని, వాటి నుండి విముక్తి పొందటమే."

"కాదు. అవునని నేను నమ్మకంగా చెప్పలేను-నా జీవితానుభవాల్ని బట్టి. నా జీవితం నీ వనుభవించలేదు. నాది భయానక స్వర్గ జీవితం. ఇందులో నివసించలేవు. నీవుగూడా"

"అది కాదు నేననేది. మన ఆంతరంగిక భయాందోళనల ప్రాబల్యంతో మన బాహ్య జీవితగతి నడపకూడదు. అట్లా నడిపించటం ఉత్తమ మానవలక్షణం కాదు. ధైర్యవంతుడి ప్రజ్ఞ కాదు. పిరికిడివాడి చేతగాని తనమది."

"ఏమైనా అను. ఏ పేరైనా పెట్టు. అది మాత్రం నా అనుభవం. ఎప్పటికైనా ఆమె నోటినుండే 'ఆమాట' వస్తే, ఈ దురదృష్ట జాతక ప్రభావం నుండి ఆమెకు రక్షణ ఉంటుంది. అప్పుడామెను నేను నిశ్చితంగా పెళ్ళిచేసుకోగలను.

శ్రీరాంకు నచ్చలేదు - అతని భయసంశయాలు :

"నేనే నీవైతేనా? అమాంతం నిల్చొన్నపాటున వెళ్ళి - ఇదిగో అమ్మాయ్. మన పెళ్ళికి శుభలగ్నం నిర్ణయించేస్తున్నా - అని చెప్పి ఉందును"

"నా కోసంగాదు భయం. ఆమె కోసం"

"అయినా నాకు ఈ ప్రేమా పచ్చడీ అంటే బొత్తుగా తెలీదు సుమా. మా నాన్నా, అమ్మ ఏ సంబంధం కుదిర్చినా పెళ్ళాట్టానికి నేను సిద్ధం. నాకూ ఓ మూల మేనరికమేదో ఉండాలి. వినికిడేలే. పెద్దగా తెలీదు".

ఇలాంటి సంభాషణలె ఆ స్నేహితుల మధ్య రెండుమూడు సార్లు దొర్లినవి. ఇట్లాగే ఆగిపోయినవి.

మళ్ళీ తొమ్మిది నెలల గడిచినవి. సంవత్సరాంత పరీక్షలకు మామూలు నిరుత్సాహంతోనే కూర్చొని బయటపడ్డాడు మధు. మొదట్లో వైద్య విద్యంటే ఎంత ఆత్రుత, ఉత్సాహం ఉండేవో, అవి అతని మానసికాందోళనల మధ్య తిరోగమించినవి. సెలవులు ప్రారంభమైన మొదటిరోజునే మధు ఇంటికి ప్రయాణం కట్టాడు. ఆ కిందటి

వారమే తాతగారి నుండి వచ్చి ఉన్నది - ఇంటికి పోయి రామకిష్టయ్యగ్గారితో కలిసి, తిరిగి నీలగిరి వెళ్ళాలని. కొన్ని ముఖ్యమైన పత్రాల విషయం తాతగారు మధుకు అప్పగింత పెట్టాలని తలపోస్తున్నారట. తాతగారి ఉత్తరంవల్ల కాకపోయినా, మధు ప్రీతి దర్శనార్థం. ఏకాఏకిని ఇంటికే వెళ్ళనిశ్చయించుకొని ఉన్నాడు. శ్రీరాం తన పరీక్షల దాకా ఉండమని బలవంతం చేసినా మధుకు మనస్కరించలేదు. అతను అనూహ్యమనోవ్యాకులతతో, యుగాల క్రిందట దేశ బహిష్కృతుడైన దేశభక్తుని వలె మాతృదేశం పోనుత్సహిస్తున్నాడు. స్టేషన్ దాకా శ్రీరాం వీడ్కోలు చెప్పవచ్చాడు. ఇద్దరూ ప్లాట్‌ఫారం మీద ఆలస్యమైన రైలు బండికోసం నిరీక్షిస్తున్నారు.

ఇంతలో హాస్టల్లో పనిజేసే కుర్రవాడు రొప్పుకుంటూ వచ్చి - "మీకు తంతి వచ్చింది మధుబాబూ. మీ బండి "వెళ్ళిపోయిందనుకొన్నా బాబూ - రక్షించింది" అని టెలిగ్రాఫ్ కవరు అందించాడు.

నీలగిరి ఆస్పత్రి నుంచి తంతి - "తాతగారు ప్రమాదస్థితి. వెంటనేబయలు దేరు?"

తంతి ముట్టిన అతని చేతులు మలేరియా రోగపీడితుడి శరీరంవలె వణికిపో నారంభించినవి. తాతగారి క్షేమం తను నిర్లక్ష్యం చేసినట్లు, పశ్చాత్తాపదావానలంతో కాలిపోయాడు. తనలో ఇంత స్వార్థం ఎందుకు ప్రవేశించింది? శ్రీరాం స్నేహితుణ్ణి ఓదార్చాడు. టిక్కెట్టు మార్చి నీలగిరి బండిలో మధును కూర్చోబెట్టాడు. "ఏం ఫరవాలేదు సుమా. తాతగారికి కులాసా చిక్కుతుంది" అని ధైర్యం చెప్పాడు.

## 7

**తా**తగారి ప్రమాదస్థితిని మధు తక్కువ అంచనా వెయ్యలేదు. ఆయన రోజులమీద ఉన్నాడు. మనుమడిని తాకి కన్నీళ్లుపెట్టుకొని - "ఈ నాలుగురోజులూ నా ప్రక్కనే ఉండరా మధూ" అని ఆయన క్షీణస్వరంతో కోరాడు.

"రామక్రిష్ణయ్య గారిని పిలిపించనా? ఆయన వస్తే కొంచెం ధైర్యంగా ఉంటుంది తాతయ్యా!"

"ఇంకెందుకురా పిచ్చి బాబూ ధైర్యం. నేనేమి చిన్నవాణ్ణిగాదు ఇంకా పది కాలాలు బతకటానికి. నా జబ్బూ చిన్నది గాదు ఆశలు చిగిర్చటానికి"

మధు అక్కడకు చేరిన దినానే వాళ్ళ వకీలు కూడా వచ్చి తన పనికి ఉపక్రమించాడు. వీలునామా వ్రాయటం, కంపెనీల్లో పేర్లు మధుపేర మార్పించటం,

ముసిలాయన సంతకాలూ, దస్కత్తులూ - నాలుగు రోజులపాటు మార్పులూ, కూర్పులూ, చేర్పులూ జరిగినవి. ఆ వారంతం వరకూ ఆయన ఉండి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఒక వారం రోజులు వరకూ తాతగారి స్థితిలో ఏ మార్పు లేదు. ఈ లోపల ఒక్కసారి మాత్రం అతనికి శ్రీరాం నుండి ఊరడింపు జాబొకటి వచ్చింది. అందులో శ్రీరాంకు స్కాలర్‌షిప్పు వచ్చిన సంగతి కూడా ఉన్నది. కాని మధుకు ఉత్తరాలకు జవాబిచ్చే ఓపికా, ఆత్మశాంతి మృగ్యమైపోయినవి. తన జీవిత పథంలో కాంతి మార్గమనేది వేరేదీ లేదని తాతగారి అంత్యదశ తనను హెచ్చరిస్తున్నట్లుగా అతనికి తోచింది. తనతో ఈ సమయంలో ప్రీతి ఉంటే, ఈ కారుచీకటిలో ధైర్యం ప్రబోధించేదేమోనని ఆశించాడు. కాని తన స్నేహితుడు శ్రీరాంవలె ఆమె ఎన్నడూ ఆశావేదాంతాన్ని బోధించలేదు. తన ఆకతాయితనంతో ఎంతటి జుగుప్సనయినా, ఇట్టే మంత్రగత్తెవలె, సంతోషసమ్మోహిత వాతావరణంగా మార్చగల శక్తిమాత్రమే ఆమెకున్నది. ఆమె ప్రౌఢ కాంతగాదు. జవ సత్వాలు తొణికిసలాడుతున్న బాలమాత్రమే.

ఆ రాత్రి నిద్రలో అతనిని నర్సువచ్చి లేపింది. తాతగారు పరలోక గతులైన విశేషం చెప్పటానికే ఆ నిద్రాభంగం చేయబడ్డది. మరునాడంతా తాతగారి భౌతిక దేహానికి చేయవలసిన దహన సంస్కారాలతోనే గడిచిపోయింది. ఆనాటికి దేవతవలె ఆ వకీలుగారే తిరిగి ప్రత్యక్షమైనాడు. కూచొన్న చోటు నుండి కదలకుండా, అన్ని పనుల్నీ (తెలుగు బ్రాహ్మణ పురోహితులను రప్పించటం సహా) ఆయనే, స్విచ్చి బోర్డును నొక్కినట్టుగా చేయించేశాడు. డబ్బు, మానవతకంటే గూడా, శక్తి సంపన్నమైన ప్రత్యక్ష దైవమని మధుకు మెరుపువలె తట్టింది. మూడవనాడు, సంప్రోక్షణలతో తాతగారి అస్థికలను మూట గట్టుకొని వకీలుగారి వీడ్కోలుతో మధు గృహోన్ముఖ ప్రయాణం సాగించాడు.

రైలు బండి దిగటంతోనే, తన పెట్టె కెదురు గా రంగప్పా, రామకిష్టయ్యా ఖిన్నులై, ఆపృధ్విలో ఏదో శాపంచేత అతకబడ్డ బొమ్మలుగా కన్పించారు. రంగప్ప భోరు భోరున ఏడ్చాడు. వృద్ధ గుమాస్తా తన్ను తాను సంబాళించుకొంటూ-"అదేమిటి చిన్నబాబూ! మమ్మల్ని రావద్దని తంతి ఇప్పించారు. ఆ మాంధాత చివరి దర్శనానికి మేం నోచుకోలేదా? మమ్మల్ని తండ్రిలేని బిడ్డలుగా చేసి పోయారు బాబూ. ఆయనకేం పుణ్యాత్ముడు" అని పసి బాలుడి వలె కంట నీరు పెట్టసాగాడు. వాళ్ళిద్దర్నీ ఏమని ఓదార్చాలో అతనికి తెలియలేదు. కాని తను తంతి ఏమీ ఇవ్వలేదని అతనికి తెలుసు.

"నేను తంతి ఇవ్వందే? మిమ్మల్ని పిలిపిస్తానంటే తాతగారు ఆ శ్రమ కలగనీయ దలచలేదన్నారు"

"తమరి హృదయం నాకు తెలియకనా బాబూ. వకీలుగారే ఆ తంతి నిచ్చింది. చనిపోతూ కూడా తాతగారు మా యందు అంతటి దయ చూపారు. ఏమో బాబూ! నేనూ వృద్ధుణ్ణయిపోయా. కడుపులో దాచి ఇన్నాళ్ళూ కాపాడిన ఆ చక్రవర్తి లేడు గదా" వీళ్లకు యీ దుఃఖవార్త తెలిసేగదా స్టేషన్‌కు వచ్చింది. మరి ప్రీతి ఎందుకు రాలేదో.

బండిలో కూర్చుంటూ - "ప్రీతి వాళ్ళకు తెలీదా?" అని అడిగాడు మధు. అతనికి అర్థం కాలేదు. ఆమె సానుభూతి కొరకు తనెందుకీ తహతహపడుతున్నాడో ఒక్క ప్రేమికులకే తెలుసుననుకొన్నాడు. బండి చుట్టూ వాతావరణంలో ఏదో వెలితి, తీరని అసంతృప్తి కనిపించిందతనికి. తిరిగి (రామకిష్టయ్యగారికి వినిపంచలేదేమోనని) "ప్రీతి రాలేదా?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"వెళ్ళిపోయారుగా బాబూ, అప్పుడే మూణ్ణెల్లు కావస్తుంటే".

"ఎవరు?"

"మీకు తెలీదా బాబూ? ఆ కొత్త బ్యాంకీ కాస్తా దివాలా తీసింది. ఇక ఇక్కడ మేనేజర్ గారికి పనేముంది? మనం కూడా ఎరుగక ఆ తెలివితక్కువలో పడలేదు. బాబూ. వకీలుగారు మన ఎక్కౌంటంతా ఈ బ్యాంకిలోకీ మారుద్దామని వ్రాశారు. తాతగారు వీల్లేదన్నారు. వారికి దివ్యజ్ఞానం ఉండి ఉండాలి చిన్నబాబూ. వ్యవహారంలో ఎంత దక్షత!"

"ప్రీ....తి...."

"అంతా వెళ్ళిపోయారు బాబూ. విచిత్రమేమంటే వారంతా ఎక్కడికి వెళ్ళిందీ, ఎవరికీ తెలీదు. చాలామంది కూపీలాగారు. అంతు చిక్కలా. మనిషంటే ఆయన బాబూ! చిల్లి దమ్మిడీల్తో సహా అద్దె గిద్దె ఎవరికివ్వవలసిన బాకీలు వాళ్ళకు, ఆ రాత్రికి రాత్రే సర్ది, తెల్లవారేసరికి ఇల్లు ఖాళీ చేసేశారు"

వజ్రాయుధ ఘాతం తగిలిన వాడివలె, మధు అప్రతిభుడై విన్నాడు. నిరుత్తరుడై పోయాడు. బండి రెండు వైపులా కిటికీలను గట్టిగా రెండు చేతుల్తో పట్టుకొన్నాడు.

"బ్రాహ్మలు వేచి ఉన్నారు బాబూ. తమరు స్నానం చేసి కర్మ ప్రారంభించాలి" అని గుమాస్తా మేల్కొలిపిందాకా అతడు ఏ అయోమయావస్థలో ఉన్నాడో, విగ్రహం వలె చలనం లేని మధుకు తెలియనే తెలియదు.

తను కోరింది ఏది తనదైనది?

## 8

ప్రీతి గది, కొద్ది మార్పులు మినహాయిస్తే, యధాతథంగా ఉంది. మధు వచ్చిన బహుమతులు, పుస్తకాలూ, పూలకుండీలు. ఎక్కడికక్కడినే చెదరనిల్చి వున్నాయి. తను పట్నంనుంచి పంపించిన కొత్తరకం విదేశీ రంగుల పూలకుండీలు గది బయట అమర్చినవి అమర్చినట్లుగానే - గతించిన సంతోష కాలాలకు ప్రతి చిహ్నాలుగా ఉన్నాయ్. ఆమె గదినంతా మధు శ్రద్ధగా పరికించాడు, పరిశీలించాడు. ప్రతి కాగితపు ముక్కనూ తీసి చూశాడు. ఎక్కడ పెన్సిలు దస్తూరి ఉన్నా పరీక్షగా చదివాడు. (ప్రీతి ఎప్పుడూ కలంతో వ్రాసి ఎరుగదు). తన కోసం ఒక్క ఉత్తరమైనా వ్రాసి పెట్టి విడిచి ఉంటుందని ఆశతో అతడు చేసిన పరిశోధనంతా విఫలయత్నమే అయింది. ఆమె వాడిన గ్రామఫోను రికార్డులను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాడు. ఎక్కువగా అరిగి ఉన్న రికార్డులన్నీ ఆమెకు ప్రియతరమైనవిగా గుర్తించి ఒక పక్కకు పేర్చాడు. తన సంగీత సాధనాలతో, ఆ రికార్డు పాటల్ని శ్రద్ధగా, దిగులుతో సాధన చేశాడు. తన మేడమీద గది వదలి, ఆ విసరిత ఆరామంలోకి మకాం మార్చాడు. ఆ గదిలో వాడిపోయి ఉన్న పూలవేసుల్లోని గుత్తులను ఎవ్వరూ తాకగూడదని రంగప్పకు చెప్పాడు.

తాతగారి కర్మకాండలింకా జరుగుతూనే ఉన్నాయ్. బ్రాహ్మణ సంతర్పణలు, బీదలకు అన్నదానాలు, గోదానాలు, భూదానాలు తాతగారి వీలునామాలో ఉదహరించిన ప్రకారం సలక్షణంగా కొనసాగించబడుతున్నాయ్. రామకిష్టయ్యగారు ప్రతి చిన్న విషయానికీ తన అనుమతి కోరటం, అది వినీ వినకేముందే తన "ఊఁ"తో సమ్మతినీయటం జరిగిపోతున్నది. కాలం ఆగిఉన్నదో, జరుగుతున్నదో అతనికి తెలిసే అవకాశమే లేదు. ఈ పక్షం రోజుల్లోనూ, తనంతట తానుగా అతడు తాతగారి పెద్ద ఫోటోనొకటి ఎన్లార్జి మెంటుగా తయారుచేయించి, "వెనుకటి" తన మేడ మీద గదిలో ఉంచటమొక్కటే బాహ్యజ్ఞానంతో కూడిన పనిగా తోచింది.

తాతగారి పెద్దఫోటోకు ప్రతి ఉదయమూ వెళ్ళి నమస్కరించటం తను విధి నిబంధనగా ఏర్పరచుకొన్నాడు. తను వెళ్ళకముందే ఆఫోటోకు ఒక పెద్దపుష్పమాల, చందనమూ అలంకరింపబడి ఉండటం అతడు మొదటిరోజునే గుర్తించాడు. కాని ఈ భక్తిపూరిత అలంకరణ ఎవరు చేశారో అతనికి తెలియదు.

ఆ ఉదయం కూడా తాతగారి గదిలోకి ప్రవేశించుతుండగా, లో నుండి ఓ యువతి చీర చెఱగు ఆచ్ఛాదితం చేసుకొని బయటకు వస్తున్నది. ఆమె ముఖము కనుపించీ కనుపించినట్లుగా ముసుగు ఉన్నది. మధు ఒక్కక్షణం, అదిరిపడి ఆమె మెల్లని నడక,

తనను చూడగానే వేగంగా సాగటం, నేలకు అతికిపోయి చూశాడు. ఎవరీమె? యక్షకన్యా? దేవదూతికా? ఈ విశాల భవనంలో తన కగపడకుండా ఇన్నాళ్ళూ దాగి ఉన్న ప్రీతేమో? ప్రీతి విద్యుత్తటిల్లతా వేగంతో అతని మనస్సులో ఒకటిరెండు సార్లు మెదిలింది. ఇక ఆలస్యం చేయక ఆమె వెళ్ళిన దిక్కునే గబగబా నడచిపోయి మెట్ల నుంచి కిందికి చూశాడు. అక్కడ ఎవరూ లేరు. పెద్దగా, ఆందోళనా పూరిత హృదయంతో - "ప్రీతీ! అని కేక వేశాడు. చల్లని ఉషఃకాలపు స్పర్శతో మేల్కొంటున్న తోటలోని పూల మడుల మూలనుండి తిరిగి ప్రతి శబ్దం - "ప్రీతీ" అని వినవచ్చింది. అతడినేదో భయం ఆవరించింది. ఈ మలయ మారుతంలో మలయ మారుతంగా కలిసిపోయిందా తన ప్రీతి? అసలామె మానవకన్య కాదా? అయితే ఇట్టే వచ్చి మంచులాగా ఎలా విచ్చిపోయి మాయమైపోగలదు? వెనుదిరిగి తాతగారి గదిలోకి వచ్చి చూశాడు. చక్కని పూలహారం ఫోటోకు వేళ్ళాడుతున్నది. బల్లమీద వెలిగించిన అగరవత్తుల నుండి సుగంధ వాయువు మెల్లగా వేస్తున్నది.

ఒక నెల గడిచినా మధు కాలేజీ మాట, పట్నంలో వైద్యవిద్య మాట తల పెట్టలేదు.

తాతగారి కర్మకాండలకు చాకిరీ చేసిన వంటమనిషి సెలవు మీద వెళ్ళిపోయింది. ఆ వారం రోజుల్నుంచి, రామకిష్టయ్యగారే అతని భోజన సదుపాయం దగ్గర ఉండి చూస్తున్నాడు. భోజనం చేస్తున్నంత సేపూ పక్కనే కూర్చొని ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పటం ముసలాయన అలవాటు. ఏదో విధంగా మధును తిరిగి నవజవాన్ యువకుడిగా, ఇంటి విషయాల్లో శ్రద్ధ వహించేందుకు అనునయిస్తున్నారు రంగప్పా, ముసలి గుమాస్తాగారూ.

రాత్రి ప్రొద్దుబోయినా మధు భోజనానికి లేవలేదు. గ్రామఫోను పెట్టే ముందు కూర్చొని ఉన్నాడు. రంగప్ప వచ్చి - "బాబూ భోజనం వడ్డించారు" అని మనవి చేసుకొన్నాడు. మధులేచి నేరుగా భోజనాల హాలులోకి వెళ్ళాడు. మామూలుగా అతడు భోంచేసే బల్లకెదురుగా ఒక వ్యక్తి నిలిచి ఉన్నది.

"ప్రీతీ ... ! అని ఒక్క అడుగుతో ఈ సమీపానికి చేరాడు.

వెనకనే ఉన్న రంగప్ప - "లేదు బాబూ. మన గుమాస్తాగారి అమ్మాయిగారు" అని చెప్పాడు.

ఆమె అవనిత శిరస్కయై ఉన్నది. ఇక అతడామెను చూడలేకపోయాడు. సుశీల సిగ్గుతో వంటగదిలోకి పోయింది.

"రామకిష్టయ్యగారెక్కడ?"

"బంధువుల గ్రామం వెళ్ళారు. పొద్దుపోతూనో, పొద్దునో గాని రారేమో బాబూ" అని రంగప్ప అన్నాడు.

మధు కొంచెం ఎంగిలి చేసినట్లే చేసి చెయ్యి కడుక్కున్నాడు.

"బాబూ! వంట్లో కులాసా లేదా?"

"ఎందుకు లేదు! వెళ్ళి పడుకొంటా. అమ్మాయిని రేపటి నుంచి ఇట్లా శ్రమ పెట్టవద్దని ఆయనకు చెప్పు. వంటమనిషి ఏమైంది?"

"తమరు సెలవు దయచేయిస్తిరి"

"మళ్ళీ పిలిపించండని రామకిష్టయ్య గారికి చెప్పు."

రామకిష్టయ్యగారు ఆ రాత్రి రాలేదు. మధుకు జ్వరం వచ్చి పడుకొన్నాడు. డాక్టరెవ్వరూ అక్కర్లేదని రంగప్పను నివారించాడు.

అర్ధరాత్రికి గాని అతనికి స్పృహ రాలేదు. రంగప్ప యుడికలోన్ పట్టీలు వేస్తున్నాడు. సుశీల ఆ పక్కనే ఉండి పట్టీలు తయారు చేస్తున్నది. మధు కళ్ళు విప్పి ఆ ఇద్దర్నీ చూశాడు.

"ఎంత టైం అయింది రంగప్పా!"

"ఒంటిగంట బాబూ. తమకెట్లా ఉందో యేమో మాకు భయంగా ఉంది వైద్యుణ్ణి గూడా వద్దంటిరి."

"ఎందుకీ పట్టీలన్నీ? అక్కర్లేదు".

"జ్వరం మండిపోతున్నది బాబూ"

"అక్కర్లేదు. కాసిని నీళ్ళు కావాలి దాహం వేస్తున్నది."

గ్లాసులో సుశీల నీళ్ళందించింది. అతడు లేవలేకపోయాడు. రంగప్ప వచ్చి రెక్క కింద చేతులు వేసి లేవదీసి పడిపోకుండా పట్టుకొన్నాడు. సుశీల గ్లాసు నోటి వద్దకు తెచ్చి నీరు త్రాగించింది. నీళ్ళు త్రాగి అతను ముఖం మీద పట్టి తీసివేస్తూ తిరిగి పడుకున్నాడు.

"పట్టీ ఎందుకు తీస్తారు? మందూ మాకూ లేకుండా జ్వరం ఎట్లా తగ్గుతుంది. పట్టీ ఉంచుకొని పడుకోండి.

ఆ మాట ధ్వనించిన దిక్కుగా అతడు తలతిప్పి చూశాడు. అప్పటి దాకా మౌనంగా తన సేవలో నమగ్నమై ఉన్న సుశీలే అతనికా ఉపదేశమంత్రం ఇచ్చింది. ఇద్దరి కళ్ళూ

ఒక్కక్షణం కలుసుకొన్నవి. ఆమె మారు మాట్లాడకుండా, అతని మీదకి వంగి తిరిగి కొత్త పట్టీ వేసింది. రోగికి మగత వచ్చి తిరిగి అవ్యక్తావస్థలో పడిపోయాడు.

## 9

ఆ జ్వరం జ్వరం పదిరోజులకు గాని తగ్గుముఖం పట్టలేదు. ఈ పది రోజులూ మధు గది ముందు ముసలి గుమాస్తా, రంగప్పా పడిగాపులు కాచారు. రోగిని కంటికి రెప్పవలె సుశీల కనిపెట్టుకొని ఉంది. బార్లీగంజీ, గ్లూకోజునీళ్ళు, పండ్లు ఏది తాగినా ఆమే రోగి నోటికి అందించాలి. ఆస్పత్రి నుంచి వచ్చిన నర్సుకు కేవలం పని ఏ మాత్రమూ లేకుండా పోయింది. నర్సు ఏ సేవచేయబోయినా, అతడి నిరాకరణతో ఆగిపోయేది. రోగి మందు తాగక మతంవేస్తే, డాక్టరు సుశీల వంకే సహాయాన్నర్థిస్తూ చూసేవాడు. ఏ సామాన్య రోగినైనా విదిలించి కొట్టి, ఒక్క భయాతిరేకంతోనే రోగి రుగ్మతను ఎక్కువ చేయగల ఈ డాక్టర్లు, అట్టి "విలువైన" రోగిముందు అణుకువతో మెలగాలి గదా మరి! సుశీల ఒక్కచూపుతో, రోగి మంత్రముగ్ధుడివలె, ఏ కటిక చేదు తాగటానికైనా తల ఒగ్గేవాడు. ఎంత భయంకరంగా గోచరించే సూదికైనా నిరాటంకంగా చెయ్యి జాపేవాడు.

పూర్తిగా జ్వరచిహ్నాలు తగ్గిపోయి, మధుబాబు గదిలో పచార్లు చేయమొదలు పెట్టినప్పుడు సుశీల ఆ గదికి రావటం విరమించుకొంది. కాని పొద్దస్తమానం రామకిష్టయ్యగారూ, రంగప్పా అతన్ని విడిచి ఉండేవాళ్ళే కాదు. అతని జ్వరానికి ఇద్దరూ భయపడ్డారు.

తాతగారు పోయిన రోజునుంచీ, రిజిస్ట్రారు ఆఫీసునుంచి కొత్త హక్కులతో బాధ్యతలతో కొత్త కాగితాలు వచ్చినప్పటి నుంచీ ఎంత కాదన్నా మధు నెత్తిన ఒక పని వచ్చి పడ్డది. ఏ ఖర్చు జరిగినా రామకిష్టయ్యగారి పద్దులోకి ఎక్కుతుంది. ఏ తోట మీద ఆదాయం వసూలయినా, ఏ భూమి మీద ఐవేజు జమఅయినా మధు - ఆ పద్దు ముందు సంతకం పెట్టాలి. రామకిష్టయ్యగారు ఇంటి చిల్లర ఖర్చులకు కొద్ది మొత్తాన్ని తీసి తన వద్దనే ఉంచుకొని మిగతా మొత్తాన్ని, బ్యాంకిలోకి వెళ్ళిందాకా ఇనప్పెట్టెలో భద్రం చెయ్యటానికి చిన్న బాబుకే ఇస్తున్నాడు. ఎంత బలవంతం చేసినా ఇప్పుడాయన తాళం చేతులు తన వద్ద ఉంచుకోటానికి బొత్తిగా విముఖుడుగా ఉన్నాడు.

"బాబూ - పెద్దవాణ్ణయిపోయాను. కనుచూపు గూడ మధ్యంతరంగా ఉంది. తమరి హయాం వచ్చింది. నాకెందుకు పెట్టారు బాబూ ఈ పెద్ద బాధ్యత? డబ్బుతో పని బాబూ. ఏ సమయానికి ఏం బుద్ధి అంకురిస్తుందో బ్రహ్మంతవాడికే తెలియదు.'

' అని ఆయన మధుకు బాధ్యతల్ని మెల్లమెల్లగా నేర్పుతున్నాడు. జ్వరంలో ఉండగా కూడా తాళంచెవులు, అతని తలగడ కిందనే భద్రం చేయబడ్డాయ్. రైతుల్తో, వకీలు గారితో మాటమంతీ మాత్రం ఆయనే చేసినా ఎప్పటికప్పుడు మధుకు చెవినవేస్తే గాని ఆయనకు తృప్తి ఉండదు.

ఆ రోజున గూడా అటువంటి సంతకాలే కొన్ని పెడుతున్నాడు మధు. రామక్రిష్టయ్యగారు చేతులు జోడించుకొని నిలబడి ఉన్నాడు. ఆయన చినబాబు గారి సన్నిధిలో ఎంత బలవంతం చేసినా కుర్చీ మీద కూర్చొనడు. సంతకాలన్నీ అయిపోయినా ఆయన కదలలేదు.

"బాబూ...."

మధు ఆయనకేసి చూశాడు. ఆయన ఇంకా అనుమానిస్తూనే నోట మాటరాక ఒక కాలుమీది బలం ఇంకొక కాలుమీదకి మోపుతూ నిలబడే ఉన్నాడు. మధు జాలి గుండె కరిగిపోయింది.

"నా జ్వరంలో మీరు నిద్ర కాచారు. చాలా శ్రమ పడ్డారు. పదిరోజుల పాటు విశ్రాంతి తీసుకోండి" అన్నాడు. ముసిలాయనకు కళ్ళ నీళ్ళు తిరిగినవి.

"ఎక్కడ విశ్రాంతి తీసుకోను బాబుగారూ. తమరి అనుగ్రహం ఉండాలి గాని ఈ పేదవాడికేం ఫరవాలేదు నాయనా. ఒకసారి మిమ్మల్ని కోరి ఉన్నాను. పెద్ద విషయం వచ్చినప్పుడు తమ సన్నిధిలో కష్టసుఖాలు విన్నవించుకొంటానని."

మళ్ళీ మధు ఆయన కళ్ళల్లోకి చూశాడు.

"పెళ్ళి ఈడు దాటిపోతున్నది బాబూ- నా బిడ్డకు. వెనకటిరోజులు కావు. కాలం ఎంత మారింది బాబూ. కాలికి బలపం గట్టుకొని వరుడి కోసం అన్వేషిస్తున్నాను. రెండేళ్ళ నుంచీ ఎక్కడకు పోయినా కట్నాలు - వేలతో మాట - ఎక్కడినుంచి తేను? తమకు తెలియనిదేముంది?"

మరొక్కక్షణంలో ఆయన వదనం దైన్య వివర్ణమై పోయింది. అశ్రుధారలు పండి వడిలిన ఎర్రని బుగ్గల మీది పలిత కేశాలను తడుపుతున్నవి.

"ఎవరికి వరుడు - సుశీకా?"

"మరెవరికి బాబూ. ఆ ఇల్లాలు తన కష్టం విరగడ చేసుకొని దాటిపోయింది. ఈ పసిగందును పెంచి పెద్ద చేశాను. అన్ని ఆశలూ కళ్ళల్లో పెట్టుకొని కాపాడుకొచ్చాను."

"మరి వరుడు దొరికాడా?"

"డబ్బుతో పని. మాటాడితే వందలుగాదు - వేలమీద లెక్క. ధర్మం నశించింది తిరిగి రమ్మన్నారాదు బాబూ. ప్రభువులు మీవంటి వారికెవరికో తప్పితే ధర్మం న్యాయం ఎవరి కవసరం ఈ రోజుల్లో బాబూ! డబ్బు మూట చూస్తే గాని పిల్లను చూడరారు గదా? "

"మరి సుశీ ఏమంటున్నది?"

"ఏమంటుంది బాబూ. అభం శుభం తెలియనిది. 'నా కోసం కష్టపడ వద్దంటుంది.' మరెవరికోసం పడను చెప్పండి".

"ఎంత కట్నమైనా నేనిస్తాను. సుశీకి ఉత్తముడైన వరుణ్ణి చూడండి."

వృద్ధుడు అతని పాదాలు తాకబోయాడు, కాని మధుపైకి లేచి నిలబడి ఆయనకు నమస్కరించాడు.

"ఇవిగో తాళం చెవులు ఎంత కావాలో తీసుకోండి."

"సగరమాంధాతాది మహా చక్రవర్తుల రోజుల్లో కూడా ఈ ధర్మదాతలుండబోరు బాబూ. అలా ముట్టుతానా తిన్న ఇంటి డబ్బును, తమరే ఆ 'శిబి' చేతుల్తో ఇవ్వాలి గాని."

వాళ్ళిద్దరూ ఒకే కులంవాళ్ళు. దాదాపు ఒకే సుస్వభావ సంపన్నులు. కాని ఇద్దరి మధ్యా ఈ విపరీత భేదమేమో మధుకు అవగాహన కాలేదు.

"సుశీ మణిపూసవంటి యువతి. ఆమెకు నా జబ్బులో ఋణపడి ఉన్నా, నేను చూడందే ఏ వరుణ్ణీ నిశ్చయం చేయవద్దు. అయినా సుశీ ఇష్టాఇష్టాలు గదా మీకు కావల్సింది. ఆమె నడిగి చూశారా?"

మధు వాక్యాలికి వృద్ధుడు ఆశ్చర్య చకితుడై పోయాడు. ఈ చినబాబులో ఇంతటి ఊహాశక్తి, ఇంతటి అంతఃకరణ ఉండి కూడా, బాహ్యంగా ఎప్పుడూ మాట్లాడి ఎరగడే!

'చిత్తం, తమరి కంటే ఈ పేదల శ్రేయోభిలాషులు వేరేనా?'

మధు తాళం చెవుల కోసం వెతికాడు. ఇనప్పెట్టె ఒక మాత్రాన రాలేదు. తలుపులు వీగి. అసలే బలహీనంగా ఉన్నాడేమో ఆ కొద్దిపాటి శ్రమకే ముఖమంతా స్వేదజల మయమైపోయింది. అలసిపోయినాడు. వృద్ధుడు దగ్గిరిగా వెళ్ళి - "బాబూ, మీకింకా స్వస్థత చిక్కలేదు. ఇప్పుడేమీ వద్దు. విశ్రాంతి తీసుకోండి రేపు చూడవచ్చు. ఇంటికి వెళ్ళి కొంచెం ఆవుపాలు వేడిచేయించి తెస్తా - కాసిని తాగండి" అని చినబాబును పడక కుర్చీలో పండబెట్టి తను వెళ్ళాడు.

పది నిమిషాల్లో ఒక గ్లాసుమీద పళ్ళెం బోర్లించుకొని వెచ్చని పాలు తెచ్చి నిల్చొన్నది సుశీల. అతడు పథ్యం తిన్న తర్వాత ఆమె పునర్దర్శనానికిదే ప్రథమావసరం ఆమె ముఖం మీద మామూలు ఆచ్ఛాదనం లేదు. నిశ్చల నిర్మల గంభీర వీక్షణాలతో ఆమె అతని వంక చూసింది. ఆ ఒక్క చూపుతోనే మొట్టమొదటి సారిగా ఆమె సౌందర్యాన్ని తిలకించటాని కతనికి అవకాశం దొరికింది. ఆమె ముఖంలో ఆందోళన సువ్యక్త మవుతున్నది."

"ఎందుకింత ఆందోళన?! ఆయన మాటలు విని పాలు తెచ్చావా సుశీ."

తను ఆమె కంటే ఎన్నో ఏండ్లు పెద్ద అయినట్లుగా మధు ఆమెను ఈ మధ్య "సుశీ" అని వ్యవహరిస్తున్నాడు. ఆమె అతని హస్తానికి దగ్గిరగా పాల గ్లాసు ఉంచుతూ...

"మీకెవరు చెప్పారు - పూర్తిగా బలం రాకముందే ఇట్లాంటి అఘాయిత్యపు పనులు చెయ్యమని?" అని ప్రశ్నించింది.

అంత ధైర్యంగా ఆమె అతని జబ్బులో కూడా మాట్లాడి ఎరుగదు.

"మరి నీకు వదుడెట్లా వస్తాదు - ఈ మాత్రపు శ్రమ కూడా తీసుకోకపోతే."

"మీరు పాలు తాగండి. మాట్లాడుతాను."

ఆమె చూపుల్లో మనోనిశ్చలత వ్యక్తమౌతున్నది. తను ఆ క్షీరపానం ముగించందే ఆమె మాట్లాడబోదని గ్రహించాడు. పాలు చప్పరించి మెల్లమెల్లగా తాగేసి, ఆముదం తాగిన పసిబిడ్డ ముఖం పెట్టి - "అబ్బా వట్టి పంచదార కషాయం, పాలు పితికిన గొల్లపిల్ల మనస్సును చాటుతున్నదీ క్షీరరుచి-" అన్నాడు.

ఆమె లజ్జావనిత వదనంతో అతని పాదాల వంక చూసింది.

"అవును. నాన్నగారికి డబ్బిస్తున్నారట మీరేనా?"

"అవును ఏం? ఈ డబ్బులో కొంత హక్కు ఆయనకూ ఉంది."

"అది సరే. ఈ అప్పు మేమెలా తీరుస్తామని?"

"ఇది వరకు తీర్చిన అప్పేగనక. సుశీ! మీ రిద్దరూ నాకు ప్రాణ రక్షకులన్న మాట మరచిపోలేను."

"అసలా డబ్బెందుకో విచారించారా?"

"సుశీ పెళ్ళికి"

"ఎవరు పెళ్ళి చేసుకోవాలో వారి ఇష్టాఇష్టాలతో తమవంటి జమీందార్లకి పని లేదన్నమాట."

అతడు నిరుత్తరుడైపోయాడు. ఆ ప్రశ్న అంతరార్థమేమో అతనికి తపస్సాచరించినా గోచరమయ్యేటట్లుగా లేదు. చివరకన్నాడు:

"ఎందుకు లేదు సుశీ. మేమంతా నీ శ్రేయస్సును కోరటం లేదంటావా?"

"అవును. నాకు పెళ్ళి చేసి కన్నెచెర విడిపించి - మీరు పుణ్యంకట్టుకుంటారు. మరి నేను పోతే నాన్నగారికి దిక్కేమిటి? ఆ సంగతేమైనా విచారించారా?"

ఆమె హృదయౌన్నత్యం, నిస్వార్థపితృప్రేమ - ఆ నిర్భయ వాక్యంలోని ప్రతి అక్షరమూ ఘంటారావమై చెప్పింది. అతడు తలవంచుకొన్నాడు. ఆమె వెళ్ళిపోయింది.

ఆ మరుసటి వారం మిట్టమధ్యాహ్నపు వేళ పెళ్ళి చూపులకని, ఒక పార్టీని వెంట బెట్టుకొని రామకిష్టయ్యగారు తోటలో బండి దిగారు. పెళ్ళికొడుకు వెంట ఇద్దరు మేనమామలు, ఒక పినతండ్రి, ముగ్గురు బావలూ ఉన్నారు. తల్లీదండ్రీ మళ్ళీ వచ్చి చూస్తారట. బావలిద్దరూ అడబడుచు లాంఛనాల మీద సరియైన ఒప్పందం కుదుర్చుకుంటారో లేదోనని నిర్ధారించుకోటానికి స్వయంగా బయలుదేరి వచ్చారు. పిల్లవాడు చామనచాయగా ఉన్నాడు. బలంగా పొట్టిగా ఉన్నాడు. ఇంకా చదువుతున్నాట్ట. మాట మాటకూ నలిగిపోతున్న పైజమా వంక చూసుకుంటున్నాడు. రామకిష్టయ్యగారు పెళ్ళి పెద్దల్ని మధుబాబుకి పరిచయం చేశాడు అతను సిగ్గుగా అందర్నీ చూసి కొందరికి నమస్కారం చేశాడు. అందరూ మారు మాట్లాడకుండా ఫలహార సేవకుపక్రమించారు. పిల్లను చూపించమని పెద్ద మేనమామ కోరాడు. కాని పెద్దబావగారు అడ్డువచ్చి ... ఇచ్చుకోటాలు పుచ్చుకోటాలు ముందు స్థిరపరుచుకొని, తరువాత "తరువాతి కార్యక్రమం..." అన్నాడు. చినబావ, షడ్డకుడిని బలపరిచాడు. వాళ్ళిద్దరూ తలకు పుట్టెడై పెరిగి కూర్చొన్న తమ బాకీలను కొంతైనా పరిష్కారం చేయగలుగుతామేమోనన్న ఆత్రుతతో ఉన్నారు.

మధు పనిమీద ఇంట్లోకి పోయాడు. అతని వెనుకనే వృద్ధ గుమాస్తాగారు ఒక క్షణం ఉండి అనుసరించారు.

"నచ్చలేదు. కుర్రవాడెట్లా ఉన్నా పెద్దలంతా ఆశపోతులుగా ఉన్నారు. మన పిల్ల సుఖపడే మాట దేవుడెరుగు..." అన్నాడు మధు.

"మరి... చిన బాబుగారూ.."

"చూస్తూ చూస్తూ ఇట్లాంటి వాళ్ళ చేతుల్లో పెడతామా?"

మధుకేం తెలుసు- ఆ పితృమూర్తి ఈ సంబంధం కొరకు పడిన చెఱలు?

రామకిష్టయ్యగారు చిన్న వదనంతో బయటికి వచ్చి పెద్దల నుద్దేశించి అన్నాడు.

"పిల్లకు అవాంతరం వచ్చింది. మంచిరోజు చూసి, మళ్ళీ కబురు చేస్తాను- పెద్దలు క్షమించాలి. మంచీ చెడ్డా అంతా అప్పుడే మాట్లాడుకొందాం.. ఏమంటారు?"

పెద్దబావలకిద్దరకూ కోపం వచ్చింది. కాని పైకి అనలేకపొయ్యారు. అటువంటి మానవులకు దేవుడెందుకో మంచిమాటల్ని ఇవ్వడు. మేనమామలిద్దరూ, 'తిరుగు ప్రయాణానికి బండి ఇప్పించ'మని కోరారు. ఆ కోరిక వెంటనే మన్నించబడ్డది.

## 10

అతని జీవిత గతితో పెద్ద జోక్యమేమీ కల్పించుకోకుండానే. అతని ఆలోచనల మీద సుస్థిరమైన అధికారాన్ని సుశీల సంపాదించుతున్నట్లు మధుకు తోచింది. ఆమెకూ తనకూ గల అకారణ జనిత సంబంధాన్ని - అదీ అత్యల్పమూ, అతి సామాన్యమూ. అతిపరిమితమూ అయిన 'అతిథి - అతిథేయ' పరిచయాన్ని గురించిన ఆలోచనగాని, ఆందోళన గాని అతని మనోక్షేత్రంలో ప్రవేశించనే లేదు. ఆమె తనకొనర్చిన సేవా పరిచర్యలకు ఆమె మీద జాలీ, కృతజ్ఞత చూపాలన్న అత్యంతాద్భుత మినహా- మధుకు వేరే ఆందోళనే మృగ్యం. కాని పదేపదే అతని ఆలోచనలో ఆమె ఎలా జొరబడుతున్నది? పదే పదే తన మనోదృష్టిని తనవైపే ఆకర్షించుకొంటున్నది. ఏ శక్తితో? ఆమె బేల. అసలు స్త్రీ హృదయపు లోతులు, ఆ జీవితానుభవ శూన్యుడికి తెలియనే తెలియవు. అతనికి - "గడచిన రోజుల్లో" - కొద్ది నెలల ప్రీతి పరిచయ స్నేహాలు తప్పితే స్త్రీలతో పరిచయమే లేదు. కళ్ళు తెరిచీ తెరవకనే పృథ్వీమాతను స్పృశించి, తన తల్లిని కోల్పోయిన బాలుడికి, సేవకా మధ్యంలో పెరిగి ఒంటరిగా పెద్దవాడయిన యువకుడికి - తల్లిప్రేమా తెలియదు. స్త్రీ హృదయాంతరాళమూ తెలియదు. మహా రసికులు, వేదాంతులు, మనస్తత్వ శాస్త్రవేత్తలూ వెరచే మహా ఓషధి వంటి తర్కశాస్త్రం - స్త్రీహృదయం - కాని హఠాల్లభ్యమైన ప్రీతి, హఠాత్సంభవమైన ఆమె నిష్క్రమణా, ఈ కొలది వ్యవధిలో - అతని పూర్ణ యౌవ్వనంలో చెలరేగిన ఆనంద విషాదానుభూతులూ - ఇవి చాలు, అతడిని అనుభవ శూన్యుడైన యువకుడి నుండి వేరు పరచి, ఈ మహా గంభీర రహస్య శోధనలో నిమగ్నుడైన, నిరంతర ఆశాంతాపూరిత అపరిపూర్ణ మానవుడిగా లెక్కించటానికి. ఈ అవ్యక్తానుభవమే,ఈ అసంపూర్ణ అంతఃప్రేరేపణే - అతడికి సుశీని మరింత సన్నిహితంగా అర్థం చేసుకోవటానికి మొదటి సోపానాలయినాయి. ధృఢంగా లేకపోయినా, ఈ సోపానాలనే అతడు అధిరోహించసాగాడు. ఈ అవిరళ ప్రయత్నం తన్నెక్కడకు కొంపోయి ఏ శిఖరం మీద అధిష్ఠాపన చేస్తుందో! ఏ అగాధాల్లో దించి పోతోందో! అతనికేమి తెలుసు? ఆ జ్ఞాన సూత్ర సందర్శనకు అవశ్యకమైన దూరదృష్టి ఎ క్కడినుండి తేగలడు?

శరీరంలో కులాసా చిక్కిన కొద్దీ మధు, తోటలో తన వెనుకటి సరిహద్దులు దాటి షికార్లు పోతున్నాడు. తోట చివర, ఆవలివీధి హద్దుకు అంటిఉన్న చిన్న పాత ఇంటి దాకా కాళ్ళు నడిపిస్తున్నాయ్. మొదట్లో అతనికక్కడ సుశీల కానరాలేదు. ఆ రోజు అంత ధైర్యంగా తన వివాహం గురించే మాట్లాడిన సుశీల అతనికి తిరిగి కనిపించలేదు. కాని, తనకు కొద్ది తలనొప్పి వస్తే, కొంచెం ఉష్ణతీవ్రత కనిపిస్తే - ఏదో ఆకాశ మేఘం సందేశం అందించినట్లుగా, ఏ మలయ మారుతపు వీచికో రహస్యంగా ఆమె చెవిలో ఊదినట్లుగా - కులదేవతవలె ప్రత్యక్షమై, తన అమృతహస్తాల స్పర్శతోనే బాధా నివారణ చేయగలిగిన - ఈమె అబలో, సబలో అతనికి తెలియలేదు. ఆమె వదనం ఎప్పుడూ ఒక్క గంభీరభావాన్నే ప్రకటిస్తుంది గాని - ఏ ప్రత్యేక ఆందోళననూ, ఏ విచార ముద్రనూ వ్యక్తీకరించి ఎరుగదు. నిజానికతడు, ఆమె ముఖాన్ని నిండుగా ఒకే ఒక్కసారి! చూడటం తటస్థించింది. అది కూడా క్షణిక మాత్ర దర్శనమే. ఆమెనతడు శిశు దృష్టితోనే "సుశీ" అని సంబోధించినది. కాని, ఆ నాటి క్షణిక సందర్భంలోనే అవగతమైన ఆమె నిశిత సౌందర్యం అతనినే శిశువుగా మార్చింది. ఇప్పుడు "సుశీల" ని "సుశీ"గా సంబోధించటం చేతనవునో కాదో తనకే తెలియదు. ఈ ఆలోచనలతోనే అతడు సుశీల దర్శనం కోసం ఎదురు చూశాడు. కాని, తోట మార్గంలో ఎప్పుడూ కన్పించలేదు.

ఒకరోజున అతడు నిద్రలేచి వరండాలోకి రాగానే వెనుకమెట్ల వేపుకు తలవంచుకొని పోతున్న - ఆమె పృష్ఠభాగం కనిపించింది. ఆ సమయంలో ఆమె రాకకు, పోకకు గమ్యమేమిటోనని అతడు తబ్బిబ్బు పడ్డాడు. మేడమీది గది వద్దకు పోయే ఉద్దేశంతో తనూ మెట్లవేపు దారి తీశాడు. అతనికేదో శంక ఆవరించి మెట్లమీదనే నిలిచి పోయాడు. ఆమె ఎంతసేపటికీ తిరిగి వచ్చి మెట్లు అధిరోహించలేదు. చివరకు మెల్లగా మేడనెక్కాడు. తాతగారి గదిలో నుంచి అగరవత్తుల సువాసన పవిత్రపవనంగా వెలికి వచ్చింది. ఆరోజు శుక్రవారం - తాతగారు గతించినవారం. గదిలోకి తొంగి చూచాడు. ఆమె లేదు. తాతగారి ఫోటోకు వాడిన పూమాల తొలగించబడి కొత్తమాల అలంకరించబడి ఉంది. తాతగారంటే ఆమెకంత భక్తి విశ్వాసము లెందుకో అతని ఊహకు అందలేదు. తాతగారు తన కుటుంబ పోషకులనా? ఆలోచనతోనే అతడు తన పాత గదివేపు దారి తీశాడు. ఆ గది నుండి సన్నగా మట్టి కంకణాల మృదుల నిస్వనం వినిపించి అచటనే ఆగిపోయాడు. కొద్ది నిమిషాల్లో గది నుంచి ఆమె వెలికి వచ్చి అతన్ని చూచి సిగ్గుతో నిలిచిపోయింది.

అతనూ,తన ఆలోచనా వాహినికి ఎదురువచ్చిన ఈ అకస్మాత్తు ఆటంకానికి విభ్రమంతో కొయ్యబారి చకితుడై నిలిచిపోయాడు.

"కింద గదిలో మీకింత గాలి రాదు. ఆరోగ్యం బాగులేని వారు ఈ గదిలో ఉంటమే మంచిది" అని ఆమె అన్నది.

"నాకు కింద గది ఇష్టం"

"నాకు తెలుసు. నేనన్నది ఆరోగ్యం పూర్తిగా బాగుపడ్డవరకైనా ఇక్కడే ఉండ వచ్చని"

"రంగప్పు మెట్లు ఎక్కలేడు రోజా. ఈ గది నెవరు శుభ్రపరుస్తుంటారు. నా గదిలోకి పని మనుషులెవరూ రారు."

"మీరు ఆరోగ్య నిబంధనలను పాటించాలే గాని, నమ్మకమైన సేవకులే కరువైనారా. రంగప్పుకే ఇమ్మని గాదు ఈ శ్రమ"

మధు నిరుత్తరుడై నించున్నాడు. ఆమె తలవంచుకొని ఒకడుగు మెట్లవేపు వేసింది. ఆమె వెళ్ళిపోతుందన్న భయం అతడిని చలిజ్వరంవలె కమ్మి వేసింది. ఏదో ఒక సంభాషణతో ఆమెను ఆపివేయాలి.

"మొన్న వచ్చిన వరుడు నాకు నచ్చలేదు" అన్నాడు.

"మరి వరుడు ఎట్లా ఉండాలని నా శ్రేయోభిలాషుల ఉద్దేశం?... కొంచెం సెలవిస్తారా?"

"సుశీని సుఖపెట్టేవాడు?"

"ఇప్పుడు సుశీకి సుఖంగా లేదని మనవి చేసుకొన్నదా?"

"ఏమో!"

" ఆ ప్రశ్నకు ఇదివరకే సమాధానం లభ్యమైంది. తిరిగి తిరిగి ప్రశ్నించే పృచ్ఛకుల ఆంతర్యమే తెలియదగిన విషయం."

ఆమె ఆ మాట అని కదిలిపోయింది. ఆమె వెళ్ళిపోయిన అయిదారు క్షణాలకుగాని తను వంటరిగా నిలిచివున్నట్లు మధుకు తెలియలేదు. ఆమె నిర్గమించిన దిక్కుకే అతడు చూచాడు. ఆ నడకలో తొట్రుపాటు లేదు. ఆమె వెనుదిరిగి చూస్తుందని ఆశించాడు. కాని ఆమె ప్రగతీర్ముఖియై పోతున్నది. త్రవ్వబడిన భూమి నుండి ఆవిరి వెడలి వచ్చినట్లుగా అతని హృదయాంతరాళం నుండి బలహీన జాతమైన ఆవేశం పెల్లుబికి వచ్చింది. అతడు నిలవలేకపోయాడు, అప్రయత్నంగా అతడి శరీరం వణికింది. ఆమె దిక్కునుండి అహంభావం ఎదురువచ్చి, అతనిని పరికించి చూచి మౌనాంతకమైన అవమానకర ప్రశ్నను వేసినట్లు తోచింది.

ఈమెనా! తను అసాధారణ వ్యక్తి అని తలపోస్తున్నది? ఈమెనా! తను అద్భుత భావపుంజాలమూర్తి అని ఉపేక్షించినది? ఈమెనా! అశిక్షితమైన తన బలహీనపు మనోక్షేత్రం దేవతగా సృష్టించుకొన్నది? ఈ అహంకారి భవిష్యత్తుకా! తను వేయి ఆలోచనలను కాల్చుకొంటున్నది?

అతడు మెట్లు దిగుతున్నాడు. కాని, అవమానితా వేశపు మెట్లెక్కుతున్నాడు. అతనికి తిరిగి జ్వరం వచ్చినట్లుయింది. అతని వేగం, తుఫాను గాలివలె ముందుకు చీల్చుకుపోయింది.

"బాబూ....!"

ఉలిక్కిపడ్డాడు. అగ్నిదేవుడి ఉద్యానవనంలో శిక్షననుభవిస్తున్న వాడికి, పుండు మీద మానవహస్తస్పర్శ తగిలినట్లయి, జ్వరపు కళ్ళతో సంబోధనా దిక్కుగా తల ఎత్తిచూచాడు.

"ఏం?"

"బాబూ - ఈ ఫోటో - దీన్ని ఫోటో అంటారో ఏమంటారో, మన పాత పుస్తకాల గదిని శుభ్రం చేయిస్తుంటే దొరికింది."

అతడు దాన్ని అందుకొన్నాడు. అది ప్రీతి ఫోటో! అతడి కళ్ళు చందమామను చూచిన శిశువు నేత్రయుగ్మంలాగా మెరిసినవి. ఫోటో అతని చేతిలో నిలవలేదు. సంభ్రమాశ్చర్యాలకు గురైన ఆ యువకుడి బాహ్యాంతరాలు రెండూ - భూకంపం వంటి ప్రళయచలనానికి లోబడినట్లయినవి.

"ఇన్నాళ్ళూ ఎక్కడ దాచావ్? ఎక్కడ దాచావ్?"

ఆ అసాధారణ హుంకారానికి వృద్ధ గుమాస్తా ఉలిక్కిపడ్డాడు. ఆ తర్వాతి క్షణమే నిర్వణ్ణతతో, మరు ఘడియలోని లిప్తలోనే అప్రమత్త చలనంతో ఆ భీషణ హుంకారాన్ని నమ్మలేక ఆ దిక్కునే చూచాడు.

"నేనా బాబూ? ఏమిటి.. దాచింది? నేనేమీ దాచలేదు చిన్నబాబూ... నాకు పాతపుస్తకాల్లో దొరికింది మధుబాబూ."

"దొరికితే దొరికింది. కానీ మీ అమ్మాయి పెళ్ళి విషయం నన్నింక బాధించ నక్కర్లేదు."

అతడు కింద పడ్డ ఫోటోను తీసుకొని గబగబా గదిలోకి నడిచిపోయాడు. తూలుతూ రామకిష్టయ్యగారు ఒక్కడుగు తప్పుకొన్నాడు ముందుకో, వెనకకో తెలియక.

మధు అల్మాయిరా బీగాల కోసం వెతికాడు. ఎక్కడ పెట్టాడో అతనికే తెలియదు. పుస్తకాలన్నీ బలంగా చిందరవందరగా నేలకేసి కొట్టాడు., తాళాలు పుచ్చుకొని ఇనప్పెట్టె తెరిచి నోట్లకట్టలు పైకి మోటుగా గుంజి ఒక్కొక్కటే ముసిలాయన ముందుకు విసిరి వేస్తూ-

"ఒకటి - రెండూ, మూడు, నాలుగూ - ఐదు పెళ్ళి చెయ్యండి. కావాలంటే ఈ బాధ్యత వదలటానికి ఇంకో ఐదువేలిస్తాను. మీ వరాణ్వేషణకు నన్ను వేధించి లాభం లేదు. ఆమె వరుణ్ని ఇదివరకే ఎంచుకున్నట్లున్నది."

తలుపులు దభేలుమని మూశాడు. ఆ ప్రభంజన వేగంతోనే ముందు పోర్టికో దాటి గేటుదాకా సాగిపోయింది - ఆ దివిటీ.

రంగప్ప అటునుంచే ఎదురువచ్చి -

"బాబూ - వకీలుగారి కారు వచ్చింది" అని మనవి చేసుకొన్నాడు.

మధు కారువేపుగా పోతూనే - "నేను వకీలుగారితో వెళ్తున్నా. నా కోసం చూడక్కర్లేదు' ' అన్నాడు.

రంగప్ప బుర్రుర్ర్ అంటున్న కారువేపు చూశాడు. మరుక్షణంలో ఆ చోటు నుంచి కొద్దిగా ధూళి లేచి గాలిలో కలిసిపోయింది.

"జీవితం అంటే ఏమిటి?" అన్న ప్రశ్న ( బహుశః వేదాంత చర్చలో ఇంతకంటే చిన్న ప్రశ్న ఉంటుందనుకోను!) మానవజాతి యొక్క ఏ దశలో, ఏ సందర్భంలో, ఏ కాలంలో, ఎవరికి ఉదయించిందో గాని - దానికి ఏకగ్రీవ సమాధానం ఇన్ని దశసహస్ర శతాబ్దాల తరువాత కూడా లభించినట్లు కనబడదు. ఆలోచించగలవారు, ఆలోచించడానికి తీరిక, ధనమూ, అపేక్ష ఉన్నవారు, ఏమీ ఆలోచనా శక్తీ, పాటవమూ లేకుండానే - ప్రశ్నలకు, జటిల సమస్యలకూ చిట్కా సమాధానాలు ఇచ్చే పామర నాయకమ్మన్యులూ, ఏ కారణం చేతనో రాజ్యాలేలుతున్న రాజకీయవేత్తలూ,ఆకు అలము తినే ముక్తసంగులూ, పల్లకీల్లో రాజహోదాతో చరించి హడలగొట్టే స్వాముల వార్లూ, పగలు మాత్రమే నిస్సంగులుగా చరించే ఫకీర్లూ, సన్యాసులూ, వేదాంతులూ - ఆకలితో చచ్చిన కవులూ; అభిమానుల బిరుదులతో సాహిత్య పత్రికల్లో చక్రవర్తులయిన కపిత్వ కవీశ్వరులూ, త్రాగి హృద్రోగంతో మరణించనున్న మహా రచయితలూ, మంచివారూ, చెడ్డవారూ, పండితులూ, పామరులూ - అందరూ ఏదో ఒక సమయంలో ఈ చిట్టిప్రశ్నకు, అడుగబడిగాని, అడగబడకుండా గాని సమాధానం చెప్పినవారే.

"జీవితమంటే మార్పు" అన్నారు, కారల్‌మార్క్స్‌తో అంతమయిన గతి తార్కికభౌతిక వాద ప్రధాన వేదాంతులు.

"సెక్స్ అండ్ హంగర్" ( కామం, ఆకలి మాత్రమే) అన్నాడు - భాగ్యవంతుల భార్యలచేత పొగడబడిన ఒక టూకీ మాత్రకవి. ( ఆ తరవాత అతడు చెడత్రాగి మరణించాడు).

"ఆడది" అన్నాడు. సెక్సు పత్రికా సంపాదక మహాశయుడు తన లుంగీని సవరించుకొంటూ, కోర్టు విచారణలో.

"విడాకులు లేకుండుట" అని ఆచార్లుగారు సిద్ధాంతీకరణ చేశారు ( ఆయనకు భార్య, మామగారు సింహ స్వప్నాలు).

"హిందూ నిరంకుశత్వం" అన్నాడు జిన్నా (ఆ రోజునే కలకత్తా జాతీయ వాద ముస్లిం నాయకుల వధ, నవఖాలీలో లీగు గుండాల అత్యాచారాలు ప్రారంభించింది)

"సామరస్యం" అన్నాడు మద్రాసులో శుగజంబందయర్, (కమ్యూనల్ జివో ప్రకారం కొడుక్కు ఉద్యోగం రాదని భయపడి).

"బ్యాంకీలు, డివిడెండ్లు" అన్నాడు డైరెక్టర్ల మీటింగులో మాట్లాడుతున్న సేత్‌జీ.

మానసిక అలసటతో, వకీలుగారి అతిథుల గదిలో పడుకొని, తన జ్వరాన్ని గుర్తించని మధుకు కూడా ఈ చిన్న ప్రశ్న కాశీ మజిలీ కథలలోని బ్రహ్మరాక్షసి రూపాన్ని చూపుతూ సాక్షాత్కరించింది. ఆ కిందటి రోజు సంఘటన, దగ్గర వస్తువుల్ని కూడా చూడనీయని మంచు తెరవంటి పొగగా మనోక్షేత్రాన్ని అలుముకొని ఉన్నది. ఈ పొగ తెరల పొరలలో అతని ప్రశ్నకు ఏ సమాధానమూ లభ్యం కాలేదు. అవ్యక్తతా, ఆందోళనా అతని జ్వరాన్ని రెండు రోజుల వరకూ తగ్గనీయలేదు. నెలసరికి వేయి రూపాయల ఆదాయమైనా లేని నిర్భాగ్యులెవరూ అడుగుపెట్టరాని ప్లీడరుగారింటికి, ఆ రెండురోజులు యిద్దరిద్దరు డాక్టర్లు వచ్చారు ( అందరూ వాడింది పెనిసిలిన్ లాంటి మందే). వారసులు లేని భాగ్యవంతులైన క్లయింట్లు చచ్చిపోవటం కన్నా, ప్లీడర్లకు వేరే దురదృష్టం ఉండదు కదా! కాని మధు జ్వరం అంతమాత్రపు జ్వరం మటుకు కాదు. మానసిక అలసట వల్ల జనితం కాబట్టి, అలసట తగ్గగానే జ్వరమూ తగ్గిపోయింది కాని పెనిసిలిన్ లాంటి పేటెంటు సూది మందు ఇచ్చిన డాక్టర్ల బిల్లులు వందల రూపాయల మొత్తంలోనే చెల్లించబడ్డాయి.

ఈ రెండురోజుల జ్వరం అతని ఆలోచనా ప్రవాహ వేగాన్ని పదివేల రెట్లకు హెచ్చించింది. ఈ వేగం నుండి విద్యుచ్ఛక్తి ఉద్భవించింది గాని విద్యుత్కాంతి కాదు.

ఆ నాటి ప్రీతి పరిచయమూ, మొన్నటి తన కోపమూ, అతనిజీవితంలో గొప్ప మార్పులు తేగలిగిన ప్రతీపశక్తులయిపోయినవి. ప్రేమ - ప్రేమ అశాంతి, ఆకర్షణ - అకర్షణ అగ్ని, ఎడబాటు - ఎడబాటు మృత్యు దర్శనమూ, ఇవి ప్రీతి సంఘటన వల్ల అనుభూతమైన మొదటి మార్పులు, మొన్నటి, జీవితంలో తన మొట్టమొదటి అహంకార ప్రదర్శన - అతనిలో పశ్చాత్తాపాన్ని రేకెత్తించింది. సుశీ ఏ తప్పు చేసినందుకాదండన? ముసలాయన ప్రీతి ఫోటోను తను దాచి ఉంచలేదన్న వాక్యాన్ని తానెందుకు నమ్మలేదు? తనకెందుకొచ్చింది ఆకస్మిక అహం? తన ప్రవర్తనకు సిగ్గు పడ్డాడు. తను పచ్చి నిరాశావేదాంతంలో మునిగి ఉన్నప్పుడూ, అవ్యక్తలోకంలో ఏకాకిగా జీవిత పథాన యంత్రప్రాయుడై నడుస్తున్నప్పుడూ, జీవితం ఇన్ని సమస్యలను తనలో ఇముడ్చుకొనగలదన్న ఘనసత్యం అతనికి తెలియదు. నేడు తెలిసినందునే 'జీవిత మంటే ఏమిటి?' అన్న ప్రశ్న పొడసూపింది. సమాధానానికై ఆ రెండు దివసాల్లోనూ, నిరుపేదకు దొరికిన నిక్షేపమైన, ప్రీతి ప్రతిమ వంక వందలసార్లు చూచాడు. కాని చిరునవ్వు సింగారంతో కూడా మూగగా ఉన్న ఆ బొమ్మ సమాధానం ఇవ్వలేదు.

ఆ ప్రశ్నకు సమాధానం ఇస్తానని ముందుకు వచ్చి జవాబు ఇవ్వ సాహసించింది. వకీలు మహాశయుడిగారి తమ్ముడు గోపాలం, వకీలుగారికి కోర్టు పనులలో తీరిక లేనందున, జ్వరం తగిలిన రెండు దినాలూ, మధుకు శ్రీగోపాలం "ఉప" అతిథేయుడైనాడు. గోపాలం రెండు నిముషాల పరిచయాన్నే రెండు యుగాల పరిచయంగా మార్చగలిగిన మహా మాటకారి మహాశయుడు కావటం వల్ల రెండు రోజుల సహచర్యం ఎట్లా వ్యర్థమైపోతుంది? వకీలుగారు కబురంపించిన విషయం నిజానికి, వ్యవహారానికి పెద్దదే అయినా మధుకుచాలా చిన్న విషయం. తాతగారి ఆస్తికి ఇన్నాళ్ళూ లేని వారసులెవరో లేచి కోర్టులో ఫీజు కట్టి నోటీసు ఇప్పించారు. మధు వచ్చి వకాల్తానామా కాగితం మీద సంతకం పెట్టి, వకీలుగారికి తిరిగి ఇచ్చేశాడు. అంతటితో అతని పని అయిపోయినట్టే. కాని జ్వరం తగ్గిన మరునాడు కూడా గోపాలం, అతడి ప్రయాణానికి అడ్డంకులు కల్పించాడు.

"మా అన్న కంటే పెద్ద మితవాదులున్నారని నేను ఇదివరలో నమ్మేవాణ్ణి కాదు. మితవాదులంటే మీరు" అన్నాడు గోపాలం.

"అసలు మీ ప్రశ్నకు గాదూ! సమాధానం కావల్సింది- జీవితమంటే హేమీ లేదు మూడక్షరాల మాట - భోగంది."

మధుకు బాగా అర్థం కాలేదో అయినదో గాని-

"అంటే" అని తిరిగి ప్రశ్నించాడు.

"అంటే భోగంది. ఎప్పుడూ భోగం వాళ్ళింటికి వెళ్ళలేదా ఏమిటి కొంప దీసి తమరు?"

"లేదు"

"చంపారండి జమీందారు గారూ. అసలు మీ నుండి మేం నేర్వదగిన విద్య ఇది."

"మా కుంటుంబంలో లేదు. మా తాతగారు కుర్రతనంలో ఏదో భోగం మనిషిని పోషించారట"

"అయితే ఇంకేం. అసలు ఆచారం ఉంది గనక - లేండి పోదాం. ఒక్క షరతు అయితే- మా అన్నగారికి చెప్పారా- నెలసరి కరువు భత్యం రద్దయిపోతుంది నాకు. గనుక విన్నవించుకొంటున్నా"

మధు లేచి తన సిల్కు లాల్చీ వేసుకొన్నాడు.

గోపాలం అన్నాడు మళ్ళీ- "అచ్చా.. ప్రియ మిత్రమా! కొంచెం డబ్బు కూడా వేసుకోండి ఆ పాపిష్టి జేబులోనే. కొత్త భోగంది బొత్తుగా నమ్మదు."

మధు జేబులో కొన్ని నోట్లు కుక్కాడు.

"శైరో, చలో గాడీ" అన్నాడు గోపాలం.

మరో ముప్పావుగంట చీకటిలో మధు వేశ్యాగృహ ప్రాంగణంలో ఉన్నాడు.

ఆ వీధి అన్ని వీధుల్లాగానే ఉంది. ఆ మేడ అన్ని మేడల్లాగానే ఉంది. కాని పరులు తన ఈ చర్యను చూస్తారన్న భయం, ఇది గర్హ్యనీయమైన విషయం అన్న సాధారణ జ్ఞానం - రెండూ ఏక లిప్తలో మధును అన్ని మూలల నుండి చుట్టుముట్టినవి. గోపాలం నీటుగా ఠీవిగా నడుస్తూ - 'ఫరవాలేదు, నాకూ కొత్తల్లో ఇట్లాగే ఉండేది. డామిట్! బ్రదర్! భయమెందుకు?" అని అతని చేతివ్రేళ్ళలో తన చేతివ్రేళ్ళు గుచ్చి అప్యాయంగా ముందుకు లాగాడు.

ఆ మేడ పూర్తిగ వాస్తు శాస్త్ర ప్రకారం నిర్మాణమైనది. కాని నాగరికతా బాహ్య లక్షణాలన్నీ దాగీ దాగక దృగ్గోచరమవుతూనే ఉన్నై. గోపాలం ఎదురుగా ఉన్న గుమ్మంలోకి ప్రవేశించకుండా, "ఇటు బ్రదర్, ఇటు" అన్నాడు - మధు హస్తకంపనాన్ని గమనించినవాడై, ఎడమ ప్రక్కగా సందుమండి వేరొక గుమ్మం ద్వారా ఇద్దరూ హాలులోకి ప్రవేశించారు. ఎదురుగా వేళ్ళాడుతోన్న నిలువుటద్దంలో, మధు తన జీవిత ప్రమాణపు ప్రతిబింబం - తనను ఆహ్వానిస్తున్నట్లు - ఈ ఇంటి రహస్య రసిక వాతావరణపు అన్ని

పవనాలను, ఆయనాలను, రుతువులను ఎరిక పరచటానికి సిద్ధంగా ఉన్నట్లు భ్రమ పడ్డాడు. హఠాత్తుగా అద్దంలోని మధు పెదిమలు తెరిచి ప్రశ్నించబోయినట్లు కన్పించాడు. కాని ఎందుకో జంకాడు. ఆ పెదిమలు చలించి స్వాగత వాక్కులేవో పలుక్కొన్నాయ్. ఆ చలనమే తన ప్రశ్న - జీవితమంటేే ఏమిటీ? మధుకు ఈ క్షణం నుంచీ ఆలోచించే వ్యవధి ఇక దొరకనే లేదు. సినిమా బొమ్మల్లాగా ప్రతి సంఘటనా, అత్యంత వేగోద్దీపితమై కాలవ్యవధిని తెలియనీయ రాకుండా జరిగిపోయినవి.

"ఇప్పటి భోగంవాళ్ళు కాదు. అసలు ప్రబంధపు యుగపువారసులు. పేరు విశాలాక్షి. ఇద్దరు కూతుళ్ళు. ఇప్పటి సంపాదనేం గాదు. మీ తాతగారి వంటి మహారాజేదో కట్టించి ఇచ్చిన ఇల్లు."

అప్పటికి కూడా హాల్లోకి వేరే ఎవ్వరూ రాలేదు.

"చాలా ధనికులన్నమాట."

"సందేహం లేకుండా!"

"మరి ఇంకా ఈ వృత్తేమిటి!"

"రక్తంలో ఉంది బ్రదర్, వాళ్ళ రక్తంలో ఉంది. ఇది రసిక జన సమాఖ్యా."మధు ఏమీ మాట్లాడలేదిక.

"అయితే తిరిగిపోదాం రాండి" అని గోపాలం ముఖంకేసి చూసి అన్నాడు.

"ఎందుకు వచ్చినట్లు మరి? మీరు శరత్ వ్రాసిన దేవదాసు చదివారా?"

"ఆఁ" ( ఆ పుస్తకం ప్రీతి అతడి చేత చదివించింది).

"అందులో వేశ్య - చంద్రవదనో, చంద్రికో - అదొక్కటే దేవదాసుకు తృప్తి నిచ్చిన శాశ్వత వస్తువు. మిగతావన్నీ అశాశ్వతాలే అని దేవదాసు నాతో అన్నాడు"

"మీతోనా? చునిలాల్‌తో కాదు?"

"మరి నేనెవరు మిత్రమా? ఉండు. ఉండు. త్వరపడిపోకు సుమీ. ఆ దేవదాసువే నువ్వు. ఐయామ్ చునిలాల్."

అతడు మేడమెట్లెక్కి అంతలోనే అదృశ్యమయినాడు. గోపాలం అజ్ఞాని కాదు. అహంకారి కాదు. పోరంబోకు రసికుడు గూడా కాదు. అన్నీ చదివిన వాడే. అతని రహస్యజీవితమొక్కటే తృప్తి నివ్వ గలిగిన వస్తువు.

అయిదు నిమిషాల్లో ముసలావిడ ఒకర్తె మెట్లు దిగుతూ హాలులోకి వచ్చింది. ముసలితనం కప్పి పుచ్చే యత్నం. ఆమె నయనాలొక్కటే చేస్తున్నవి. ఆమె కట్టిన నల్ల

పట్టుచీరె, పచ్చని శరీరకాంతి మెరుగు దిద్దుతున్నట్లున్నది.

"అట్లా నుంచునే ఉన్నారా? మా ఇల్లు ఏ నోమో నోచుకోబట్టిగాని తమ ఆగమనం సంభవిస్తుందా? రండి రండి."

వృద్ధవనిత నోటినుండి కస్తూరి వాసనతో తాంబూలపు కమ్మని తెమ్మెర వచ్చింది.

మధు గోపాలం పైన ఉంటాడని తలపోసి, ఆమె వెనుకనే నెమ్మదిగా మెట్లు ఎక్కాడు. ఆమె ఒక గదివేపు దారితీసి "దయచేయండి, తమ పాద ధూళికి మేము అనర్హులం కాదు" అని నిలిచిపోయింది. వాకిలి తెరను తొలగించుకుంటూ సందేహంతోనే లోన అడుగు వేశాడు. ఆ గది విశాలమైనది, అతి శుభ్రమైనది. మధ్యలో ఉయ్యాలబల్ల ఉన్నది. గోడలకు నలదయయంతులూ, మేనకా విశ్వామిత్రులూ, రతీమన్మధులూ, రవివర్మ బొమ్మలన్నీ నీటుగా వేళ్ళాడుతున్నవి. కిటికీ ఉన్న దిక్కుగా పెద్ద పందిరిమంచం ఈ రహస్య మందిరపు చివరి దుర్గమ మార్గంగా నిలిచి ఉంది.

అతడు ఉయ్యాల బల్లను సమీపించాడో లేదో వాకిలి తెరచాటున స్త్రీ హస్తకంకణాల మృదుల నిస్వనం క్షణికంగా వినవచ్చింది. చేతిలో కొవ్వువత్తి వెలిగించుకొని నిలిచిన యువతి అతనికెదురుగా ఉన్నది - మరుక్షణంలో మధు అప్రతిభుడై ఆమె తెచ్చిన కాంతిలో కళ్ళు మూసుకుని తెరిచాడు. ఆమె అపురూప సౌందర్యవతి అనటంలో సందేహం లేదు. ఆమె పెదవుల ఎరుపు దీపపుకాంతి మీద ప్రతిఫలించింది. ఆమె విశాలనేత్రాల్లో ఆ వక్రీకరణ కాంతి ప్రతిబింబించినది. అతడు అప్రతిభుడై నిల్చున్నాడు. ఆమె పెళ్ళికూతురు శృంగారంతో జడనల్లుకొన్నది. ఆ జడనిండా నిలువెత్తునా మొగలిపూవులు, ఆమె వేణి నీలనాగిని వలె కదిలింది, ఆమె పాదాలు రక్తం రంజితములైనట్లు, పారాణితో మెరిసినవి. ఆమె ధరించిన పట్టుచీరెలోని అసలు జరీ అన్ని మెరుపులకూ మెరుపునిస్తున్నది.

ఆమె కదలింది. చిరుగంటలు మ్రోగినవి. ఆలయంలోని గంభీర దేవతామూర్తివలె ఆమె తిరిగి నిలిచింది.

"నమస్కారం"

అతడు మాట్లాడలేదు.

ఆమె ఉయ్యాలబల్లమీద క్రొవ్వొత్తిని నెమ్మదిగా ఉంచింది. అతడు ఆమె పొడుగాటి వ్రేళ్ళను అలంకరించిన ఉంగరాలను అప్రయత్నంగా పరికించాడు.

ఇంతలో వృద్ధవనిత, ఆమె వెనుక ఒక దాసీ ప్రవేశించారు. వృద్ధవనిత చేతిలో పలహారాల పళ్ళెమూ, వెండిపాలగ్లాసులూ ఉన్నాయి. పరిచారిక దీపాన్ని తెచ్చింది.

అతడికి ముచ్చెమటలు పోశాయ్. నూతనాగంతికల వెనకనే నెమ్మదిగా తలుపులు తిరిగి మూసుకున్నవి. తిరిగి ఆ యువతీ యువకులే ఆ గదిలో మిగిలారు. ఒక్కమాట లేదు వేరొక్క కదలిక లేదు.

మధు మూసుకొన్న ద్వారం వేపు ఒకడుగు వేశాడు. ఆ యువతి హఠాత్తుగా వంగి అతని పాదాలను స్పృశించి, అతని ముఖంలోకి దీనంగా చూచింది. ఆమె చెవి లోలకులు కదిలి తిరిగి మంజుల నిస్వనంతో ఆ నిశ్శబ్దాన్ని క్షణికకాలం భంగపరిచినవి.

"కోపమా?" తన వీణా నినాదం అతనికి వినవచ్చింది.

"లేదు. నా కెందుకు కోపం? నేను గోపాలంగారితో మాట్లాడాలి."

"వారు కన్పించరు"

ఆమె అతని పాదాలను గట్టిగా స్పృశించి పట్టుకొన్నది.

"వారు రారు. వెతికినా లాభంలేదు."

మధు ఆమె నుండి వెనుకకు జరిగి ఉయ్యాల బల్లమీద కూచోబోయాడు. ఆమె లేచి వెండి పళ్ళాన్ని సర్దింది.

"నీ పేరు?"

"నీలనాగిని"

అతడు ఉలిక్కిపడ్డాడు. మత్తుగా పూలనుండీ సుగంధ ద్రవ్యాల నుండీ సువాసన వచ్చి నాసికా పుటాల ముందు నృత్యమాడింది. అతను జేబులోని నోట్లకట్ట తీసి ఆమెకిస్తూ "ఇదిగో నేను వెళ్ళాలి" అని లేచాడు. ఆమె నోట్లను అందుకోలేదు.

"నా మీద దయ లేదా? మీరు వెళ్ళితే నన్ను ఈ గృహ ప్రాంగణంలో బతకనిస్తారా? మా అమ్మ, అమ్మమ్మ చంపేస్తారు నన్ను"

"ఎందుకు? మీకు కావల్సింది డబ్బుకదా. అదుగో తీసుకో. ఇది చాలదనా? ఇదిగో..." అతడు ఆమె ముఖాన్ని తదేక దీక్షతో పరికించాడు.

ఆమె కళ్ళు చెమ్మగిల్లినవి. ఆమె తిరిగి శిరస్సు వంచుకొని అతని పాదాలను తాకింది. అతని బొటనవ్రేలిమీద వేడి అశ్రుబిందువు పతనమైనది. అతడు వంగి ఆమె రెండు భుజాల వెనుక చేతులు వేసి బలంగా పైకి లేవదీశాడు. ఆమె అతని గుండెల్లో హత్తుకుపోయింది.

"ఏడవకు ఈ డబ్బు తీసుకో"

"మీ అంత మంచివారి సహవాసం నేనుకోరేది. మీ పాదాల వద్ద సేవచేసి బ్రతక నీయరా?"

అతడు ఆమెను వదిలించుకోవాలన్న ప్రయత్నం చేయలేదు.

"నేను వెళ్ళితే మీ వాళ్ళు హింసిస్తారా? ఎందుకు?"

ఆమె అతని నేత్రాల్లో తన నేత్రాలు నిలిపి జాలిగా కనురెప్పల చెమ్మను తుడుచుకొన్నది. ఆమె సందేహించింది.

"చెప్పవా?" బుజ్జగిస్తూ తిరిగి ఆమె మోమును మృదువుగా తడివినాడు. ఆమె మరొక్కమారు లజ్జావనితయై నిలిచి అతని హృదయంలో దాగుకొనబోయింది.

"నేను కన్యను మీ నుండి నా కన్నెరికపు భిక్ష అర్థించమని మా అమ్మ పంపింది'

"నీలూ...!!" అతడు కామాతురుడుగా వణికిపోయాడు.

ఆ గది, రహస్యమైన మూగ సంగీతం వింటూ అచేతనమై పోయింది -మరొక్క క్షణంలోనే.

## 12

మధుబాబు, తాతగారి ఆస్తిపై తను ఎప్పుడూ చూడని, ఎన్నడూ వినని వారసులో, జ్ఞాతులో వేసిన వ్యాజ్యానికి వకాల్తానామా, రికార్డులు, డాక్యుమెంటుల సన్నాహం పూర్తి చేసుకొనడమే కాకుండా, నీలనాగినితో పాటు స్వంత ఊరుకు, స్వగృహానికి వచ్చి ఆర్భాటంగా గృహప్రవేశం చేశాడు. ఆర్భాటం ఎందుకన్నామంటే - శ్రీగోపాలం సలహా ననుసరించి ఒక క్రొత్త కారు కూడా కొన్నాడు. నీలనాగినితో పాటు ఆమె తెచ్చుకొన్న ఇద్దరు సేవకులకు కూడా, అతడు నిస్సంకోచంగా ఆహ్వానమూ ఆశ్రయమూ ఇచ్చాడు. మరివన్నీ అతడి శాంతి కాముక ప్రకృతికి భిన్న సాంప్రదాయములేగా! కొత్త యజమానిని అతి వినయ ప్రకటనలతో సంతృప్తి పరిచేందుకు వేశ్యాసేవకులు చేసే అన్ని యత్నాలూ సాధారణంగా ఆర్భాట సహితంగానే ఉంటాయ్. నిద్రబోతున్న ఈ మారుమూల తోటలోని మేడ, ఒక్కసారి దశాబ్దాల విషాదాన్ని వదిలించుకొన్నట్లు మేల్కొని వసంత నృత్యం చేయసాగింది. ఈ నవాశ్రితులందరకూ మేడమీదనే విడిది ఏర్పాటుచేయబడింది. చినబాబుగారి ఆజ్ఞ కోసం రంగప్ప ఒక్కడే మేడమీదకు వెళ్ళ సాహసించినవాడు. కాని, బాబుగారి దర్శనం నిమిష మాత్రంగానే లభించింది. కొత్త సేవకులు అతనికక్కడ చేసే పనిలేదని చెప్పేశారు. మేడ మీదనుంచి వచ్చే గాన కచ్చేరీలను, కేరింతలను వింటూ, వేరొక కార్యం లేకుండా మేడ కింద కునుకుపాట్లు తీయటమే రంగప్పకిప్పుడు తీరికలేని కార్యమయిపోయింది.

చినబాబుగారు వచ్చి పక్షం దినాలు గడచినా, వృద్ధ గుమాస్తా వచ్చి దర్శనం అర్థించలేదు. అసలు చినబాబుగారికి గుమాస్తాతో మాట్లాడవలసిన జరూరు కార్యమేమి తగలలేదు. ఆనాటి అతడు పశ్చాత్తప్త హృదయంలో నేడు నీలనాగిని నగ్న ప్రతిమ ప్రతిష్ఠాపించబడి ఉన్నది. కొత్తగా పరివారంలో చేరిన కారు డ్రైవరుకు గూడా ఎక్కడలేని పలుకుబడి లభించింది. ఏ చెక్కయినా బ్యాంకీలో మార్చాలంటే డ్రైవరు బుర్రున పోయి గిర్రున డబ్బుతో వాపసు వచ్చేస్తాడు. అమ్మగారి ఆజ్ఞలు చిటికెలో శిరసావహించటంలో అతడు ముఖ్యుడైపోయాడు. డ్రైవరుతో సహా కొత్త సేవకులందరికీ రంగప్ప 'పాలు మాలినతనం' గురించి కోపం వచ్చింది. అమ్మగారి సొమ్ము పొట్టపగుల తిని దొర్లుతున్నాడని కడుపు మంటతో వాళ్ళు చిల్లితగాదాలతో అతన్ని ఏడ్పించ మొదలు పెట్టారు. తను హారను ఇవ్వగానే గేటు తియ్యడని డ్రైవరు చాలా కోపగించుకుంటున్నాడు. కాని రంగప్ప వచ్చి యజమానితో మొరబెట్టుకోలేదు. అతడు యజమాని బాల్యకౌమారాలను చూచినవాడు. అర్ధనగ్నంగా ఆటలాడిన బాలుణ్ణి, తన నిత్యజీవితంలో సర్వత్రా తనపై ఆధారపడిన కుమారుడిని, యువకుడిగా సలహాలడిగి పుచ్చుకొన్న దయామయుణ్ణి అతడి హృదయంలో యజమానిగా స్థిరపరచుకొన్నాడు. వేశ్య అండతో యజమాని మీద అధికార ప్రవృత్తులు సంపాదించిన సేవకత్వం - అతడి ఊహకూ, అనుభవానికి నైతిక ప్రవృత్తికీ అందని విషయం. తరతరాల విశ్వాసపాత్రతే అతని రక్తంలోని ప్రధాన కణువులు. ఈ రక్తానికి అతడు ద్రోహం చేసి విష రసాద్ధులను పోషించగలడా - నేడు?

తరచుగా ఈ కొత్తకారు, శ్రీగోపాలం ఆయన మిత్ర బృందంలోని ప్రధాన మంత్రి వర్గదళాన్ని మోసుకు వస్తూనే ఉంది. తరచు - విదేశీ మద్యాల విదేశీ వాసన, ఆంగ్ల పద్ధతి హోటళ్ళ గ్లాసుల కణకణల మధ్య గుమ్మున కొడుతూనే ఉంది. ఈ మయ సభలు ఏ సంజసమయంలోనో మొదలయి దాదాపు మొదటి రౌండు కోడి కూతల వరకూ నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయ్. ఈ సభల్లో తన యజమాని పాత్ర ఎట్టిదో రంగప్పకు తెలియదు. అప్పుడప్పుడు - ఈ ఇంటి అధికారాన్ని అదృశ్యంగా చేపట్టి, ఈ చిన్న ప్రపంచంలోని అదృష్ట దురదృష్టాలను నిర్ణయిస్తున్న ఏకైక సర్వాధికారిణి - నీలనాగిని కూడా - శ్రీ గోపాలం మహాశయుల బృందంతో కారులో వెళ్ళి, మళ్ళీ ఒకటి రెండు గంటలకో, ఒకటి రెండు దినాలకో తిరిగి వస్తూంటుంది. ఆమె అట్లా అదృశ్యమైన దినాల్లో కూడా , మధు మేడ దిగి కిందికి రాలేదు. ఆమె తిరిగి రాగానే ఎడతెగని మయసభా సమావేశాలు తిరిగి మొదలవుతాయ్.

ఈ రెండునెలల్లోనూ శ్రీగోపాలం "రాకపోకలు" తగ్గి - స్థిర నివాసమే ఏర్పాటయింది దాదాపు. అందువల్ల ప్రతి దినమూ నిర్విరామ సమావేశాలు కొనసాగుతూ ఉన్నాయ్. శ్రీ గోపాలం మిత్రబృందంలోని మండలి సభ్యులంతా, నిజమైన సామ్యవాద పద్ధతిలో మధుబాబుకు పరిచయులైపోయారు. హెచ్చుతగ్గులు లేని సమాదారణలతో వారందరికీ అతిథ్యం ఇవ్వబడుతూనే ఉన్నది. ఈ లోకంలో ఇంతటి మహదానందం కొల్లలు కొల్లలుగా పడి ఉంటే, ఏవో లేనిపోని విచారాలతో కుళ్ళేవాళ్ళు, మానవులు కాదు గదా - చివరకు రాక్షసులు కూడా గాదు - అని శ్రీ గోపాలం తన నూతన సిద్ధాంతాన్ని ప్రతిదినమూ ప్రతిపాదిస్తూనే ఉన్నాడు. దానికి సభికులు వికటాట్టహాసాలతో ఆమోద ముద్రను వేస్తూనే ఉన్నారు.

మధుకిప్పుడు సంగీత సాధనతో ప్రమేయం తగ్గిపోయింది. వేశ్యాయువతి సంతోష సహకారాలకు అతని శక్తి సంపదలన్నీ కైంకర్యంగా వినియోగింపబడుతున్నాయ్. శ్రీ గోపాలం - ఇత్యాది మిత్రమండలి సాన్నిధ్యంలో, అతని నైతిక పతనానికి పరిపూర్ణత పట్టే యోగం హఠాత్తుగా లభించినట్లయింది. కాని జీవిత నాటక రంగంలో ఈ అంకం కూడా ఏదో రహస్య వాతావరణంతోనే అతడు కప్పుకోగలిగాడు. అంతవరకూ అది అతని అదృష్టమే అనాలి.

కాని గడియారపు ముల్లు కూడా ఏదో ఒకనాడు యజమాని అశ్రద్ధవల్లనైనా సరే ఆగిపోయి, గడిచిన కాలాన్ని చూపబోతోంది. పురోగామి అయిన చరిత్ర పాకిస్తాన్‌లో లాగా, పోర్చుగల్ ఫాసిస్టు రాజ్యాంగంలో లాగా ఒక్కోసారి అకస్మాత్తుగా వెనుదిరుగు తుంది. మధు జీవితంలో ఆ రోజు అట్టి పరిణామాలనే, ఏ సూచనా లేకుండా తెచ్చి పెట్టింది.

శ్రీ గోపాలం, డ్రైవరూ తెచ్చి ఇచ్చిన కవరు అందుకొని చూచి - "డామిట్ కథ అడ్డం తిరిగింది బ్రదర్! అవర్ చెక్ ఈజ్ నాట్ ఆనర్డ్ మధూ" అని మిత్రుడి ముఖంలోకి చికాకుగా చూశాడు.

మధు - రెండు క్షణాల పాటు , బ్యాంకు మేనేజరుగారి జిలుగు దస్తూరితో తిరిగి వచ్చిన చెక్కువంకా, నోట్సు వంకా నివ్వెరబోయి చూశాడు. ఒక్క డజను అక్షరాలతో ఈ లోకంలో మానవుడి విలువలను తలక్రిందులు చేయగల దస్తూరి అది.

ఆ వ్యాఖ్యానం చాలదని శ్రీగోపాలం ఇంకా వివరించాడు. "దట్‌మీన్స్, గాడ్ యీజ్ గ్రేట్, అంటే సదరు బ్యాంకిలో వెరశి నిలవ సున్నాకు సున్న. హళ్ళికి హళ్ళి."

నీలనాగిని, మధు కుర్చీని ఆనుకొని చూస్తున్నదల్లా, గురువు గోపాలం మహాశయుడి

కను సన్నను వెంటనే అర్థంచేసుకొని మధుబాబును గదిలోకి తీసుకొని పోయింది. సాథీ గోపాలం ఆ రోజునే ప్రయాణమై వెళ్ళిపోయి తిరిగి పది రోజుల దాకా కనిపించలేదు.

నీలు వచ్చిం తరువాతనే, అతనికి డబ్బుతో అవసరమూ, ప్రత్యక్ష పరిచయమూ, దాని విలువల హెచ్చుతగ్గులూ కొద్దికొద్దిగా తెలియసాగినాయ్. దాని విలువను అంచనా కట్టే శక్తి ఏర్పడ్డది. ఈ జ్ఞానశక్తే, శ్రీగోపాలం వివరణ కన్నా, అతని ప్రస్తుత పరిస్థితిని గూర్చి ఎక్కువ ఆలోచన నిచ్చింది. వేశ్యావృత్తిలో పడి నైతిక పతనానికి మొదటి అధోలోకం చేరబోతున్న నీలును తను రక్షించి ప్రేమించాను గదా అనుకొన్నాడు. ఈ ఉద్దేశ్యాన్నే అతడ సాధారణ ధోరణిలో శ్రీ గోపాలానికి వ్యక్తం చేశాడు - రెండు మూడుసార్లు. అతడు సమాధానంగా చిరునవ్వు నవ్వేవాడు. గోపాలనిది విచిత్రమైన చిరునవ్వు. మంచుకూ పూవు విచ్చినట్లు, సంతోషపూరిత వాతావరణంలో అంతర్గర్భితానందాన్ని సహజంగా పెదవుల కదలికతో వెలువరించే చిరునవ్వుగాదు. ఈలోకంలోని అనేక సహస్ర వస్తువుల బాహ్య రూపం వెనుక దాగి ఉండే చిదంబర రహస్యాలన్నింటినీ ఆమూలాగ్రంగా ఎరిగి వున్నాననే ధీమా గర్భితమై, వెగటుగా ఉంటుందతని చిరునవ్వు. కాని ఈ చిరునవ్వు మధుబాబుకు వెగటు పుట్టించలేదు. అతడా పెదిమల కదలికనే గమనించలేదు.

నీలు కంటనీరు అతని హృదయాన్ని ఇట్టే కలచివేస్తుంది. మొదట్లో ఆమెలోని వేశ్యా ప్రకృతికి బాహ్య ప్రతిబింబాలయిన హావభావ విజృంభణకు కూడా తికమక పడేవాడు. ఆమె శృంగార చేష్టలనన్నింటినీ అతడు విసుకోకుండానే ఆమోదించాడు. అర్ధనగ్నంగా అతని మెడను కరుచుకొని గుండెలో తలదూర్చి, ఆమె కోరిన ఏ కోరికా తిరస్కరింప బడలేదు.

"ఇట్లా ఎన్నాళ్ళుండమంటారు?" అని అడిగింది నీలు అతని గదిలో అడుగు పెట్టగానే.

"ఎట్లా?"

"మీరు చెప్పకపోతేనేం - చెక్కులు తిరిగి వచ్చినైటగా"

"అవును, డబ్బయిపోయింది, బ్యాంకులో ఉన్నది అంతే."

"మరి"

"ఏం కావాలి?"

"ఇట్లా నేను బోసిమెడతో చచ్చిందాకా ఉండాల్సిందేగా"

"ఏం ఉంటే? అందంగా ఉన్నావ్"

"స్త్రీల కోరిక ఆభరణాల మీదే ఉంటుంది. అవి లేకపోతే ఆమె జీవితమంతా కొరతే."

"తరవాత కొందాం"

"కొంటం ఎందుకు? ఇంట్లో పెట్టుకొని"

"నేనెప్పుడూ చూళ్ళేదు"

"మీ గుమాస్తాగారికి తెలుసట. అవన్నీ బ్యాంకిలో వాల్ట్‌లో ఉన్నయిట."

"ఎవరు చెప్పారు?"

"అబ్బో. ఆ మాత్రం తెలుసులేండి. మీ కష్టసుఖాల్లో భాగం పంచుకోటానికేగా నేనిక్కడికి వచ్చింది." ఆమె అతని ముఖాన్ని ముద్దుల్లో గుప్పి వేసింది. అతనిలో ఏ ఉద్రేకమూ ఉదయించలేదు. ఆ వాతావరణం, అకస్మాత్తుగా అతనిలో ఏదో ఎబ్బెట్టును కలిగించింది. ఎవరో ముగ్ధ ప్రాణనాయిక కోరినట్లు లేదీ కోరిక. ఈ కోరికలో అతనికి అవాచ్యమైన నీచత్వమేదో స్ఫురించింది. హఠాత్తుగా అతడికి కోపపు తెర వచ్చింది. ఆమె ముఖంలోకి తీక్షణంగా చూశాడు.

"ఎవరి సొమ్ములు? వాటి మీద నీకేమధికారం ఉందని?" అని గర్జనగా ప్రశ్నించాడు.

"నేను మీ చరణదాసిని - నాకు గాక ఇంకెవరికి అధికారం?" అని నీలు అతని పాదాలను తాకింది. చప్పున అతని కోపం దిగిపోయింది. అతడు పసిపిల్లవానివలె మెట్లువైపు నడిచాడు.

## 13

మెట్లమీద నుంచే మధుబాబు - 'రంగప్పా!' అని కేకవేశాడు. దానికి వెంటనే సమాధానం లేదు.

"రంగప్పా, రంగప్పా!!!"

మరొక్క పది క్షణాల్లో తలకు కట్టు కట్టుకొని ఉన్న రంగప్ప - "వచ్చా బాబూ" అంటూ కింది మెట్టు మీద చేతులు కట్టుకొని కనిపించాడు.

"ఏమిటా కట్టు తలకు -రంగప్పా"

రంగప్ప కట్టు, అతని ఒక కన్నును కూడా సగం కప్పి వేసి ఉంది. కట్టుగుడ్డ మాత్రం తెల్లగా ఉంది చుట్టూ. మధ్య ఉన్న రక్తపు మరక కనిపించకుండా, పైన పాత

ఉత్తరీయం కప్పుకొని ఉన్నాడు. చినబాబు అడిగిన ప్రశ్నకు రంగప్ప తడబడుతూ.

"ఏమీ లేదు బాబూ ఏమీ లేదు" అని సమాధాన మిచ్చాడు. అప్పటికే మధు మనస్సు వేరొకచోట లగ్నమై పోయింది. రంగప్ప తన యజమాని ఆజ్ఞ కోసం ప్రతీక్షిస్తూ నిలబడిపోయాడు.

"రామకిష్టయ్య గారినో సారి పిలుచుకురా"

రంగప్ప వెంటనే ఆ చోటు నుండి కదలలేదు.

"గుమాస్తాగారినా బాబూ?"

"అవును. త్వరగా"

రంగప్ప మళ్ళీ యజమాని ముఖం చూడబోయి, ఏదో చెప్ప సాహిసించినట్లుగా తాత్సారం చేశాడు. కాని మరుక్షణంలో అతడు తోటవేపు వెళ్ళిపోయాడు.

అయిదు నిమిషాల వరకూ మధు మొదటి మెట్టుమీదనే నుంచొన్నాడు. ఆ తర్వాత తిరిగి తన గదిలోకి పోవటానికేమో వెనుదిరిగి వెళ్ళాడు. మళ్ళీ దిశమార్చి గబగబా మెట్లు దిగటానికి ముందుకొచ్చాడు. తలవంచుకొని మెట్లు దిగి వేగంగా కిందికి వచ్చి, వెనుక తోటవేపుగా చూశాడు. తోటలో పూలబాట మీదుగా సుశీ, ఆమె వెనుక మెల్లగా నడుస్తూ తన వైపే వస్తున్న రంగప్ప కనిపించారు. అతనికి చిరపరిచితమై తన జబ్బులో చెవులకు అనేక సమయాల్లో సంగీత నిస్వనమై వినిపించిన గాజుల గలగల మెల్లగా వినిపించింది. నుదుటి మీద అకస్మాత్తుగా చల్లగా తగిలింది. అరచేతిలో ఆ ప్రదేశాన్ని స్పృశించాడు. స్వేద జలంతో అతని అరచెయ్యి తడిసిపోయింది. అతను తల యెత్తేసరికి సుశీ - చేతిలో పుస్తకాలతో ముందు నిలిచి ఉంది.

"తమరు పిలిపించారట" అన్నది.

"మిమ్మల్ని కాదు. రంగప్పా రామకిష్టయ్యగారెక్కడ?"

"బా..బూ...!"

ఈ మాట సుశే అన్నది సగంలోనే రంగప్ప మాట అందుకొని...

"నాన్న గారు గత రెండు నెల్లనుంచీ మంచం దిగటం లేదు. మీ అనుమతి లేకుండానే ఈ ఎస్టేటు గుమాస్తా పని నేను నిర్వహిస్తున్నా, తమరు పిలిపించింది గుమాస్తానేగా?"

ఆ మాటలు నమ్మనట్లుగా ఆమె ముఖంలోకి ధైర్యంచేసి , సిగ్గుతోనే, బిడియం తోనే చూశాడు. ఆమె తమరు అని సంబోధించటం, తను అప్రయత్నంగానే మీరు

అనటం - తన జీవితంలో ఈ కొద్దికాలంలోనే జరిగిన మార్పులు మాదిరిగానే అసంభవంగా, అసంగతంగా తోచిందతనికి.

"నాన్నగారికేం ... రంగప్ప కూడా చెప్పలేదే!" అనగలిగాడు చివరకు.

"పక్షవాతం బాబూ. కాలుచెయ్యి పడిపోయింది" అని రంగప్ప ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాడు.

మధు ఆ ఇద్దరి వంకా నిర్విణ్ణతతో చూశాడు. తను స్వతంత్రంగా "సుశీ" అని చంటిపిల్లను పిలిచినట్లుగా పిలిచిన ఆ యువతిలో ఏ మార్పూ కనిపించలేదు.

"నేనే మీ దర్శనం కోసం వద్దామని తాత్సారిస్తున్నాను. ఇంట్లో అతిథులున్నారని జంకి ఊరుకొన్నాను. తమరు చూడవలసిన కాయితాలు లెక్కలూ పట్టుకొచ్చాను. నాన్న గారికి కాలూ చేయీ స్వాధీనం తప్పినా కంటి చూపున్నది. వారికి చూపే ఈ లెక్కలన్నీ పూర్తి చెయ్యబడ్డాయి. తమరికి తీరిక ఉందా?"

సుశీల జంకూ గొంకూ లేకుండానే, యజమానికివ్వ దగిన సాధారణ గౌరవం ఇస్తూనే ఈ మాటలన్నది. కాని ప్రతి అక్షరం వెనకా ఏదో అసహజ వినయం. అతనికి వినిపించింది. వెంటనే అది తన భ్రమేనని అనుకొన్నాడు.

"పదండి. నాన్నగారితో నేను మాట్లాడాలి."

వాళ్ళ కోసం చూడకుండానే మధు దారి తీశాడు.

వరండా నుంచి ముందుగా కనబడే గదిలోనే ముసిలాయన మంచం మీద పడి ఉన్నాడు. ఎత్తుగా తలకింద రెండు దిండ్లు, మంచం మీద శుభ్రమైన జంబుఖానా తప్పితే ఆ మంచం మీద కాని, ఆ గదిలో గాని వేరే వస్తువు లేదు.

చిన్న బాబును చూడగానే. రామకిష్టయ్య కళ్ళు ఒక్కసారి మెరిసినవి. ఆ మెరుపు, మరుక్షణంలోనే ఊరిన భాష్పజలంతో మాయమైపోయింది. ఆయన పెదిమలు, కదిలినవి. కాని మాట వెలికి రాలేదు. స్వాధీనంలో ఉన్న ఎడమచేతిని కొద్ది ఎత్తుకు మాత్రం ఎత్తి మధుకు స్వాగతం ఇస్తున్నట్లుగా ఆడించాడు.

మధు ఆయన మంచం మీదకి వంగి ఆయన కళ్ళల్లో తన కళ్ళు కలవకుండానే - "మీ ఆరోగ్యం బాగాలేదని తెలిసింది. ఇప్పుడూ కులాసా చిక్కినట్టు లేదే" - అని సిగ్గుగా ప్రశ్నించాడు.

ముసిలాయన చెయ్యి మళ్ళీ కదిలింది. దగ్గరకు రమ్మన్నట్టుగా సౌజ్ఞచేశాడు. మధు రెండడుగులు ఇంకా ముందుకు వేయగానే అతడిని స్పృశించి మంచం మీద కూర్చొని బెట్టాడు. మధు బెరుకు బెరుకుగా దిగులుతో ఆయన చూపులతో తన చూపు

మొదటి సారిగా కలిపాడు. వరండా దాటి అప్పుడే గదిలోకి సుశీ ప్రవేశించింది. రంగప్ప వరండా లోనే కూలబడ్డాడు.

నూతిలో గొంతుకతో ముసిలాయన అన్నాడు - మధు హస్తంలో తన హస్తం కలుపుతూ.

"నన్ను క్షమించాననండి బాబూ. క్షమించాననండి".

మధుకు అప్రయత్నంగా కన్నీళ్ళు తిరిగినవి. అతను ముఖం వేరొక పక్కకు తిప్పే ప్రయత్నం చేశాడు. కాని ఆ ప్రక్కనే సుశీ నిలిచి యున్నది, అతడు రుద్ధమైపోతున్న తన కంఠంతో పెనుగులాడి వృద్ధుణ్ణి ఓదార్చబోయాడు.

"మీరేం తప్పుచేశారని క్షమించాలి? మీ పరిస్థితి ఇవ్వాళే తెలిసింది. డాక్టరు ఎవరు? మన డాక్టరేనా?" అన్నాడు.

సుశీ అందుకొని - "మన డాక్టరే" అని చెప్పింది.

"మీకేం కావల్సినా నాకు కబురు చెయ్యండి" అని మధు లేవబోయాడు. అతని హృదయంలో. మనసులో అనాడు తను ఈ వృద్ధుణ్ణి విదిలించివేసిన అసాధారణ సంఘటన ములుకుగా తల ఎత్తింది.

"వుండండి బాబూ ఒక్క క్షణం. దేవుడూ... అన్యాయం చేశాడు. ఆ పడిపొయ్యేది కుడిచెయ్యా, కాలూ పడిపోవాలా? అభం శుభం తెలీనిదాన్ని - సుశీ చేత లెక్కలు రాయిస్తున్నా."

"ఏం ఫర్వాలేదు"

"కాదు బాబూ. మీ ఉప్పూ కారం తిన్నవాడిని, అక్కరలో సేవ చెయ్యలేకపోతే ఇక నా బతుకెందుకు? ఎవరో ఆ అశపోతులు దుర్మార్గంగా మనల్ని దావాలోకి దించారు. చాలా డాక్యుమెంట్లు కావాలి."

"ప్లీడరుగారి దగ్గరున్నయిగా"

"అంతటితో తీరేదా! క్షమించండి. చిన్నవాళ్ళు బాబూ. ఈ ఒక్క కోర్టుతో కాదు. పై కోర్టులెన్ని తిరగాలో? ఎంత వ్యయ ప్రయాసలో అప్పుడే తీలీదు బాబూ. పాత రికార్డులన్నీ పెళ్ళగించాలి"

"ఏమీ ఫరవాలేదన్నారే ప్లీడరుగారు"

"కాలం, ధనం, ప్రయాస, అప్పీళ్ళు. ఈ ప్లీడర్లకందరికీ మనం రికార్డులిచ్చి దారిలో పెట్టకపోతే యేమీ కాదు"

"కానీండి చూద్దాం"

"పాత అల్మారాల్లో కాయితాలన్నీ వెతికించా బాబూ; కొన్ని దొరికినై. తాతగారి ఎరికలో ఉన్నవన్నీ ఎక్కడో అక్కడ భద్రంగా ఉంటై; అన్నీ వెతకాలి ఆడపిల్ల, తండ్రి రుణం తీర్చుకొంటానని ఈ పనిపైన నిద్ర కూడా మరిచిపోయింది బాబూ"

"'సు....శీల సంబంధం సంగతి మళ్ళీ ఏమన్నా తేల్చారా?"

ముసిలాయన సమాధానంగా తన పక్షవాతపు పార్శ్వాన్ని చూపించాడు. మధు అశాంతితో, పశ్చాత్తాపంతో ఆ కొద్ది నిముషాలూ గిజగిజలాడిపోయాడు.

అతను వరండాదాటి తోట దారిని పడ్డ తర్వాత గానీ, సుశీ తనను వెంబడించి వెనకనే వస్తున్నట్లుగా తెలియలేదు. వెనుదిరిగి "ఎందుకు?" అన్నాడు.

"సేవకులకు తల్లిదండ్రులు యజమానులే గదా." రంగప్ప తరుపున మీతో మొరబెట్టుకోటానికి వచ్చాను"

తనను ఇంకా సాధించాలనే ఆమె ఈ మాటలంటున్నదని కోపం తెచ్చుకోబోయాడు. కాని కోపం రాలేదు- ఆమెకైనా కోపం తెప్పిద్దామనుకొన్నాడు.

"రంగప్పకు నోరులేదా?"

"ఎట్లా ఉంటుంది-యజమానులు కట్టివేస్తే! చూడండి. మీ కారు డ్రైవరు చేసిన పని, ఇనుపముక్కతో నెత్తిమీద కొట్టాడు".

"రంగప్పా-"

రంగప్ప భోరున ఏడుపు మొదలెట్టాడు. మధు చరచరా ఆ చోటునుండి నడిచిపోతున్నాడు. ఆమె వదలలేదు.

"ఈ లెక్కలూ - ఎక్కౌంట్లూ"

"అన్నీ నువ్వే చూడు సుశీ. నా సంతకాలక్కర్లేదు. నీ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది" అతడు ఏ ప్రయత్నం చేయకుండానే ఆమెను తిరిగి వెనుకటి మాదిరిగా సంబోధించాడు.

"అందుకు ధన్యురాల్ని; కాని ఒక్కమాట; బ్యాంకులో చిల్లిదమ్మిడీ లేదు. ఈ సంవత్సరం వచ్చిన వసూళ్ళన్నీ ఇక్కడే ఖర్చు చేయించారు గనక అదీ లేదు. కనుక"

అతనికి హఠాత్తుగా తను అసలు ఆ రోజున గుమాస్తాను ఎందుకు పిలిపించవలసి వచ్చిందో జ్ఞాపకం వచ్చింది. అతని కళ్ళ ఎదుట వేశ్యారూపం నిలిచింది. నగలపెట్టె సంగతి వీలునామా సంగతి జ్ఞాపకం వచ్చింది.

"సరే తెలిసింది. నన్నేం చెయ్యమంటావ్?"

"ఒక మనవి. తమరి డబ్బు ఒక ఐదువేలు నా వద్ద ఉన్నది"

"నా డబ్బా?"

"అవును. వరాన్వేషణ కిచ్చిన మొత్తం. మా నాన్నగారి మీద తమరు విసిరివేసిన మొత్తం"

ఒక్క క్షణం పాటు అతను బదులు చెప్పలేకపోయాడు.

"ఆ డబ్బు నాది గాదు నీదే"

"నాదెట్లా అవుతుంది. నేను కోరి దానం పట్టలేదు అది మీదే"

"నీ దగ్గరే ఉంచుకో"-

అతను తిరిగి చరచరా నడిచి ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా వెనుదిరిగి "రంగప్పా నాతోరా" అన్నాడు.

ఒక్కలిప్తకాలంలో అతడు మెట్లెక్కిపోయాడు. అతను కళ్ళు తుమ్మనిప్పులుగా ఎరుపు రేగినవి. నీలనాగిని ఎదురుగా వచ్చి, ఆ కళ్ళు చూసి ఆగిపోయింది.

"నీ డ్రైవరెక్కడ?" అని హుంకరించాడు.

ఆమె డ్రైవరును పిలిచింది. మధు గదిలో వంకెకు తగిలించి ఉన్న పేముకర్ర చేతిలోకి తీసుకొన్నాడు. డ్రైవరు రాగానే - "రంగప్పను కొట్టే కావరం బలిసిపోయిందా నీకు"- అంటూ నాలుగు దెబ్బలు దెబ్బ వెంట దెబ్బ శరవేగంతో కొట్టాడు. డ్రైవరు రెండు చేతులూ, దెబ్బలు తగలకుండా, తల మీదికి చేర్చుకొని కూలబడిపోయాడు. మధు కర్ర అవల పారేసి గదిలోకి పోయి డబ్బు తెచ్చి వాని ముఖాన విసిరివేసి - "పో, కదులు. ఈ గడప తొక్కవద్దిక" అని గర్జించాడు. డ్రైవరు మారు మాట్లాడకుండా శరీరానికి కట్టిన బొప్పులు తడుముకుంటూ వెళ్ళిపోయాడు.

## 14

**ఆ**రోజల్లా నీలనాగిని మధు ముందుకు వచ్చి నిలబడలేదు. ఆ మర్నాడు గూడా - మధు రామకిష్టయ్యగార్ని పరామర్శించటానికి తోట మీదుగా వెళ్ళాడు. అక్కౌంటు పుస్తకాలన్నీ ముందేసుకొని, లెక్కలతో సతమతమవుతున్న సుశీ వరండాలో కన్పించింది. అతన్ని చూడగానే ఆమె లేచి నిల్చుంది.

"కూచో సుశీ. నాన్నగారికెట్లా ఉంది?"

"డాక్టరుగారు ఇంకా రాలేదు. ఆయనేమో ప్రాణాపాయం లేదనే చెబుతున్నాడు. రెండోసారి రాకుండా చూస్తే కోలుకొన్నట్టే -పక్షవాతం ఆయెను!"

ఆమెతో వెనకటి పరిచయం కోసం, ఆమె తన మీది ఆ వెనకటి రక్షక కర్త వాత్సల్యాధికారాన్ని మృదువుగా చూపిస్తుందన్న ఆశతో అక్కడే నిలిచాడు. కాని తన పరిస్థితి అగమ్యంగా ఉంది. వేశ్యగా - పతితగాకుండా, ఆమె శీలాన్ని రక్షించే కంకణధారి అయినట్లుగా, నీలనాగినిని తనతో తెచ్చాడు. మంచి నీళ్ళవలె డబ్బు ఖర్చయిపోతోంది. జ్ఞాతులు వ్యాజ్యాలు తెచ్చి బెదిరిస్తున్నారు. ఈ ఆస్తంతా తనకు కాకుండా పోయినా పోవచ్చు. తన జీవితంలో ఆశ్చర్యకరమైన సంగతేమీ లేదు - అందరికీ ఆశ్చర్యకరమైనవి. తన జీవితగతిని నడిపించే వేదాంతోపదేశాలైనప్పుడు ! తనవనుకొన్న వస్తువులెన్నో తనకు కాకుండా దక్కక అదృశ్యమైపోలేదా? ఈ ఆస్తిని గురించి అతను మామూలు ప్రయత్నం మించి మరేమీ చెయ్యదలుచుకోలేదు. ఏవో మానవాతీత ప్రయత్నాలను చెయ్యాలని తనకు తట్టనూ లేదు. కాని ఈ తండ్రీ ఆయన కుమార్తె తన ఆస్తి అన్యాక్రాంతం గాకుండా రేయింబవళ్ళు కృషి చేస్తున్నారు.

అతడికీ ఆలోచనలన్నీ ఒకేసారి వచ్చినవి. అన్నింటినీ మరిచిపోయాడు ఒకేసారిగా. కాని మళ్ళీ హృదయం ఈ విశ్వాసపాత్రుల మీది కృతజ్ఞతతో బరువెక్కిపోయింది.

ఆమెతో అన్నాడు. "నీ జీతం రెట్టింపు చేస్తున్నా. ఈ నెలనుంచీ ఆ లెక్కన తీసుకో సుశీ."

"ఊహూఁ... నాన్నగారికన్నా ఎక్కువ పనేమీ నేను చేయటం లేదు. నా జీతం పెంచవలసిన అవసరం ఏమీ రాలేదిప్పుడు"

"నేను యజమానిని... నా ఇష్టం ఒకప్పుడు కాకపోయినా ఒకప్పుడైనా చెల్లాలి."

"అందులో సందేహం ఏముంది? మీ ఇష్టం ఎప్పుడూ చెల్లుతుంది. అట్లా చెల్లకపోతే నిన్న మీరు ఆ డ్రైవరును అట్లా చావగొట్టి తరిమేసి ఉండేవాళ్ళా"

మధు ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు.

"తప్పా?" అన్నాడు.

"మీకు న్యాయాధికారి హృదయం ఉండవచ్చు గాని, న్యాయాధికారి అధికారం లేదు -శిక్షించటానికి. కనుక మీరు చేసింది తప్పే."

అతను ఇక మాట్లాడలేదు. లోపలకు పోయి ముసిలాయన మంచం మీద కూచొన్నాడు. వేశ్య యువతిని గురించి ఎవరూ అతడిని అడగలేదు. ముసిలాయన కోర్టులో దావా విషయమై మరికొన్ని వివరాలు చెప్పి, మళ్ళీ డాక్యుమెంట్లు గొడవ

మాట్లాడాడు.

తిరిగి వెళ్తూ వెళ్తూ అతను సుశీ వ్రాసుకొంటున్న బల్ల సమీపాన ఆగి - "రంగప; గాయాన్ని డాక్టరుగారు చూశారా?" అని ఆమెను చూడకుండానే ప్రశ్నించాడు.

"ఆఁ. ఇంకో వారం రోజుల్లో తగ్గుముఖం చూపుతుంది గాయం, అని చెప్పారు"

"మంచిది. అయితే వీలునామాలో నగల ప్రస్తావనేమైనా ఉన్నదా?"

"మీరు అసాంతం చదివి ఉన్నట్లు కన్పించదు. ఎస్టేటు గుమాస్తాలు మోసం చెయ్యాలంటే, వాళ్ళ పని సుగమంగా చేస్తారు మీరు! ఉన్నది, ఇదుగో చూడండి"

ఆమెచేతిలోంచి వీలునామా నకలు అందుకొని వెనుదిరిగి చూడకుండా నడిచిపోయాడు.

మెట్లు ఎక్కుతుండగానే అతనికి మేడ మీది నుంచి స్త్రీల శోకస్వరాలు పెద్ద పెట్టున వినిపించాయి. అందులో ఒకటి నీలుది. వేరొకటి అంతపరిచితం గాని స్త్రీ కంఠం. అతనికేమో తోచలేదు. ఆ సమయంలో ఎదురుగా శ్రీ గోపాలం మహాశయుడు వస్తూ ఆహ్వానిస్తున్నట్లు రెండు చేతులూ చూపినాడు.

"ఏమిటి మిత్రమా, మీ అత్తగారి రహస్య విటశేఖరుణ్ణి తన్ని తగిలేశావుట-" శ్రీ గోపాలం ఆహ్వాన వాక్యాలు ఇవే.

శరీరంలోని రక్తమంతా ఒక్కసారిగా పెల్లుబికి మధు సునిశిత ముఖాన్ని జేవురింపజేసింది. అతని హృదయం ఊడి భూపతనమైపోయినట్లుగా శరీరమంతా కంపించింది. శ్రీ గోపాలం అన్న వ్యంగ్య వాక్యం తన డ్రైవరును గురించే. ఆ ఒక్క వాక్యంలోని అవాచ్యనైతిక దురవస్థ, ఆ ఒక్క వాక్యంలోని కఠోర సత్యం ఎడారి చీకటిలో పెద్ద అగ్ని జ్వాలవలె అతనికి కన్పించింది.

"అవును బ్రదర్, నువ్వు కోపగించుకోవద్దు. వేశ్యల సంగతి బొత్తిగా తెలినివాడివి. నువ్వు నీలుని దుర్గతినుంచి రక్షించావనుకోవద్దు. అట్లా భ్రమపడుతున్న వాళ్ళలో నువ్వు మూడోవాడివి. ఎప్పటికప్పుడు వాళ్ళు కన్యాత్వం కొని తెచ్చుకుంటారు. నీవంటి కల్చర్డు వ్యక్తి నమ్మేస్తాడు. వాళ్ళకల్లా గురువులు నావంటి వాళ్ళు, కారుడ్రైవర్లు, హోటలు సర్వర్లు - దానికంతా వేరే కులం గోత్రం కావాలి"

ప్రతి అక్షరమూ, ప్రతిమాటా తనున్న నరకలోకానికి ఒక్కొక్కమెట్టుగా మధుకు తోచింది. ఇంత నీచపు మాటలు ఇంత తేలికగా అతడెప్పుడూ వినలేదు. అతను ఆవేశంతో వణికిపోతూ -

"ఈ మోసానికంతా ఎవరు కారకులు?" అని హుంకారం చేసినట్లు ప్రశ్నించాడు.

"ఎవరూ కాదు. మన దౌర్బల్యం. మగవారి చిత్త చాపల్యం. నా స్నేహాన్ని విడిచిపెట్టమని మా అన్నగారు వ్రాసిన జాబుల్ని నువ్వు చింపిగూడా చూడలేదు మధూ. అప్పుడైనా తెలిసేది. గతంగతః కనక ఈ పీనిగ ముండల్ని ఎట్లాయినా ఇక్కణ్ణించి పంపించేయాలి"

మధు అరిచాడు - "రంగప్పా, రంగప్పా!!

"లాభం లేదు బ్రదర్. నువ్వు గెంటించేస్తే మన ప్రైవేటుపరువూ, పబ్లిక్ పరువూ రెండూ తీసేస్తారు. మనకు ప్రైవేటు పరువనేది ఎట్లాగో లేదు గనుక, పబ్లిక్ పరువుకోసం పోట్లాడం కనీస ధర్మం. విను. నీ మీది ఛార్జిషీటులో రెండు కేసులున్నై- ఒకటి నీ దగ్గర డబ్బయిపోతున్నది. అది చాలు ఏ వేశ్యకైనా. రెండు - వేశ్యమాత విటుణ్ణి నువ్వు తన్నావ్. ఇక రాజీ. వాళ్ళ ముఖాన కొంత పారేసి (అంటె గుడ్‌విల్ మనీ అందాం మన పబ్లిక్ పరువుకోసం) వదిలించేద్దాం"

రంగప్ప వచ్చి పిలిచిందాకా మధు, ఆ ప్రపంచ సూత్రధారి మాటలు అసహ్యంతో వింటూ నిలబడి ఉన్నాడు. అతనికి వేరేమి తోచలేదు. రక్తమంతా ఉడికిపోతున్నది.

"రంగప్పా, సుశీని ఒక్కసారి పిలుచుకురా"

ఈ సాలెగూడు నుంచి బయటపడటం అతని స్వశక్తికి మించిన పనిగా తోచింది. అది అతనికి పరీక్షా సమయంగా తోచింది. తనకు గార్డియన్ అని అంతఃకరణ అడుగుపొరల్లో ఏనాడో ఒకనాడు తనేదాచిన సుశీ పేరే ఏకైక శరణ్యంగా ఆ సమయంలో అతనికి తోచింది. వెళ్ళి రంగప్ప లాఠీకర్రతో అందర్నీ చావమోద్దామన్న వెఱ్ఱికోపం ఆవేశించినా, ఆ నీచత్వపు పాప పంకిలాన్ని అతడు స్పృశించాలన్న ఆలోచనే నిర్వీర్యుణ్ణి జేసింది. సుశీ అబల అని అతనికి తట్టలేదు. తనకు - ఈ ఇంటి యజమానికి - అసాధ్యమైన కార్యం, ఆమెకెట్లా సాధ్యమని ఆలోచించనూ లేదు. - సుశీ వచ్చిందాకా.

"బ్రదర్, ఆ అమాయకురాలేం చేస్తుంది? ఇవ్వి భోగం పిశాచులు బ్రదర్" అని గోపాలం అంటూండగానే నెత్తిన పమిటె సవరించుకొంటున్న సుశీ కంకణ నిస్వనం అతనికి వినిపించి వెనుదిరిగి చూశాడు.

"సుశీ, ఈ ఇంట్లోంచి పరాన్న భుక్కుల్ని, వేశ్యల్ని అందర్నీ తరిమెయ్. ఒక్క క్షణం ఉండే హక్కులేదీ నీచులికి."

సుశీ రెండు మెట్లుపైకి వచ్చింది. ఇప్పుడతనికి ఆమె ముఖం పరికించే అవకాశం

చిక్కింది. ఆమె ముఖంలో భీతదృక్కులేమీ కనపడలేదు. కాని ఆమె నయనాలు అశ్రుజలంతో నిండి ఉన్నాయ్.

"రా, రంగప్పా, పైనున్న పెద్దమనిషికి, స్త్రీలకు దారి ఇవ్వమని చెప్పు" అని సుశీ ముందుకు సాగింది.

ఆమె మాటలకు సిగ్గుపడి గోపాలం మెట్టునుండి తప్పుకొని పైకిపోయాడు. మధు అక్కడ మరుక్షణం నిలవకుండా తోటలో చెట్ల పచ్చదనంలో కలిసి దూరంగా వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

సుశీ ఇల్లు జేరేసరికి, తండ్రి మంచంమీద కూచొని ఉన్న మధు కన్పించాడు. అప్పటికి గంట అయింది ఆమె మేడమీదికిపోయి. అతను గభాలున లేచి నుంచున్నాడు.

"ఇవిగో, తాళం చెవులు. ఇల్లు మీ స్వాధీనం చెయ్యమన్నారుగా, చేశాను గుమాస్తాను" అని ఆమె అతనికి తాళం చెవుల గుత్తి అందించింది.

ఆమె ముఖాన్ని వెతికాడు. అందులో ద్వేషమూ, అసహ్యమూ లేనే లేవు. చివరకు ఉద్వేగం కూడా లేదు. ఒక్క సంతృప్తిమాత్రమే అతనికి కనిపించింది. ఆ బజారు నీచుల్ని ఎట్లా తరిమేసిందో ఆమెను అడగ సాహసించలేకపోయాడు. ఆమె తనపాలిట కళ్యాణ దేవతగా, విశ్వాస దేవతగా, జీవన దేవిగా తోచింది.

మధు, ముసిలాయన హస్తం తాకుతూ - అన్నాడు - "రామకిష్టయ్యగారూ, సుశీ తన వరుణ్ణి ఇదివరకే ఎంచుకున్నట్లుందని చెప్పానే. ఆమాట నిజం.ఆ వరుణ్ణి నేనే."

సుశీ గిరుక్కున తిరిగి ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

"బా...బూ...చిన్న...బాబూ....!" వృద్ధుడికి వెక్కిళ్ళు వచ్చినవి. ఆయన కళ్ళవెంట జలపాతంగా నీరుకారసాగింది.

మరొకవారం రోజుల్లో నిరాడంబరంగా, అతి నిరాడంబరంగా పెళ్లి జరిగిపోయింది. రంగప్ప, వకీలుగారు తప్పితే ఇతరులెవరూ పిలవబడలేదు. పురోహితుడొక్కడే అసంతృప్తి ప్రకటించినవాడల్లా.

సుశీ పాదాలు స్పృశించాలని అతడు ఆ రాత్రి ప్రయత్నించాడు.

"తప్పు" అని ఆమె అతని పాదాలను తన ఆనంద భాష్పాలతో తడిపివేసింది.

# 15

సుశీతో అతని జీవితం ఏ ఉద్వేగమూ లేకుండా నల్లేరు మీది బండి నడకవలె గడిచిపోసాగింది. అతడు, జీవిత గమ్యస్థానం చేరిన పాంథునివలె సంతృప్తిని మొదటిసారిగా ఆస్వాదించాడు. ఆమె అతని కులదేవత. ఇష్టదైవం.

ఒకరోజున ఆమెనడిగాడు: "నీకు సొమ్ములక్కర్లేదా?"

ఆమె చెప్పింది. "నేను స్త్రీని. భారతదేశంలో పుట్టిన స్త్రీని. లోకమంతా మారిపోతున్నదని అంటారు. కాని నాకేమీ కనబడదు. నాకు సొమ్ములు ధరించటం అయిష్టంకాదు. మీకిష్టమయితే నాకూ ఇష్టమే.మీకన్నా నాకు పెద్ద సొమ్మేముంది?"

ఏ కోరికను ముందుంచినా వేదాంతివలె ఆమె ఇచ్చే సమాధానాల ధోరణి ఇట్లాగే ఉంటుంది. అతడు మొదటిసారిగా బ్యాంకీకి పోయి, వాలులో ఎన్నాళ్ళ నుంచో మూలుగుతున్న ఆభరణాలపెట్టె తెచ్చి ఇచ్చాడు. అవన్నీ విలువగలవే అయినా పాతవి. పనితనమంతా ఎంతో హుందాగా ఉంది. ఏ గర్వమూ లేకుండా ఆమె వాటిని ధరించింది. అతని సంతోషానికి హద్దు లేకపోయింది. ఆమె, స్త్రీమూర్తి యొక్క సంపూర్ణత్వంగా అతడికి రాను రాను తోచసాగింది. విలువగల నగలూ, వస్త్రాలూ ధరించకపోయినా ఆమె అందానికి లోపం కలగదు. ఆమె బాహ్య నాగరికత కన్నా, అంతర్గత సంస్కృతే హెచ్చు. ఏపని చేసినా అతి నేర్పు. అతనికి జీవితంలో కోరదగిన వస్తువేమీ కన్పించలేదు - ఆమె సాన్నిధ్యంలో.

ఆమె, వేశ్యా వృత్తాంతము గురించిన ప్రశ్నలతో అతడి నెప్పుడూ భూతకాలపు విషయాలను త్రవ్వనివ్వలేదు. ఆ రోజున అతను ఈ గడచిన నెలల్లో మొట్టమొదటి సారిగా తన ఫిడేలుపెకి తీశాడు. ఆ పెట్టెలో ప్రీతి ఫొటో ఉన్నది.

"ఈ ఫొటో ఎవరిదో తెలుసా?" అని ఆమెకు చూపాడు.

"తెలుసు"

"ఎవరు?"

"మీ మొదటి ఆరాధ్యదేవత"

అతడు ఆశ్చర్యంగా భార్య వంక చూశాడు.

"ఎట్లా తెలుసు?"

"నేను స్త్రీని గదా!" అని సుశీ తిరిగి అన్నది.

మధు - ఫొటోను తిరిగిపెట్టెలో దాచి, భార్య దగ్గరిగా వెళ్ళి ఆమె భుజం మీద

చెయ్యివేసి, ఆమె ముఖాన్ని తన పెదిమలకు దగ్గిరగా తెచ్చుకొన్నాడు.

"సుశీ!"

"మీకు ఏమీ పనిలేకపోవటమే, లేనిపోని దిగులు విచారాలకు కారణమవుతున్నది.

మనది పూర్వీకుల ఆస్తి. ఈ ఆస్తిని ఇంత అల్పంగా చూట్టం మీకెట్లా అబ్బింది? ఆస్తిని పూజించి నిరీశ్వరత్వం అవలంబించమని కాదు. సాధారణ శ్రద్ధయినా చూపించకపోతే ఎట్లా?" అని ఆమె ప్రశ్నించింది.

ఆ మరువాడే అతడు ప్లీడర్ని కలుసుకొన్నాడు. అప్పటివరకూ కోర్టులో జరిగిన రాద్ధాంత సిద్ధాంత కారణాకారణాలనన్నింటినీ అవగాహన చేసుకున్నాడు. ఇంటికి వచ్చి భార్యతో చెప్పాడు. "మనం తప్పక గెలుస్తాం సుశీ" అని ఆమెను ముద్దుబెట్టుకొన్నాడు.

కాని అది అబద్ధం. కింది కోర్టులో జ్ఞాతులూ దొంగవారసులు గెలిచారు. వీలు నామాలో కొంత భాగం చెల్లదని తీర్పు జరిగింది. ఆస్తంతా పరాధీనం కానున్నది. కూతురు పెళ్ళినాటి నుండీ క్రమంగా కోలుకొంటున్న రామకిష్టయ్యగారికి దీంతో మళ్ళీ పక్షవాతం వచ్చింది. కొన ఊపిరితో ఆయన తిరిగి మంచం పట్టాడు. అపీలు చెయ్యవలసిందే అని ప్లీడరు వచ్చాడు. కొత్తగా మళ్ళీ స్టాంప్ ఫీజు కట్టాలి. బోలెడు డబ్బు కావాలి.

సుశీల నగలన్నీ తీసి పెట్టెలో పెట్టి అతనిచేతికిచ్చింది.

"ఆస్తి రాకపోయినా ఫరవాలేదు. ఈ సొమ్ములా? నీవి-?" అన్నాడు మధు వాటిని నిరాకరిస్తూ.

"మళ్ళీ చేయిద్దురుగాని"

అప్పీలు జరిగింది. కాని మధు పూర్తిగా మారిపోయాడు. రానున్న తన దుర్దశకు ఇది నాంది అన్న అనుమానం ప్రవేశించింది. సుశీల గర్భవతి అయిన వాటి నుంచి ఆమె నుండి తప్పించుకు తిరిగే మనో వేదనతో అతడు సంచరించసాగాడు.

ఆ రోజున మళ్ళీ ప్లీడరుగారు వచ్చారు.

"మన అప్పీలు సంగతి తేలిందాకా ఇల్లూ, ఎస్టేటు కోర్టు ఆధ్వర్యం కిందికి పోతున్నవి. మీకు నేడో రేపో నోటీసులు రావచ్చు. కోర్టువారు వచ్చి, నా సమక్షంలో అన్నీ స్వాధీనం చేసుకొంటారు" అని చెప్పాడాయన.

అప్పుడు సుశి వేవిళ్ళతో బాధపడుతున్నది. ఊళ్ళో చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని, దులోకి వెళ్ళారు. రంగప్పా, రామకిష్టయ్యగారూ వరండాలోనే కాలం గడపాలి.

లోపలివి రెండూ చిన్న గదులు. సుశీ ఏమీ ఖిన్నపడలేదు. ఆ ఇంటి ముందున్న కాస్త ఖాళీ స్థలంలోనే ఆమె పూల మొక్కలు వేసింది. కిటికీలు రెంటికీ తెరలు కుట్టింది. ఇల్లంతా పరిశుభ్రంగా శాంతి కుటీరంగా చేసింది.

"అప్పీల్లో మనం గెలుస్తాం" అని ఆమె అనని రోజు లేదు. ఆమె నగలన్నీ అప్పీలు ఖర్చులకిందనే దాదాపు మొత్తంగా కరిగిపోయినై. మొదటి రెండు రోజులూ ఆమె మెడబోసిగా కన్పించందతనికి. కాని గర్భిణీ స్త్రీ తొలి అందంతో, శ్రావణ పూర్ణిమ లాగా ఆమె నడక ఏ లోపానికీ తావివ్వలేదు.

"నీ వరాన్వేషణ ఖర్చుల పైకం ఎక్కడున్నది?" అని ఒకరోజున ఆమెను ప్రశ్నించాడు.

"ఎందుకో!"

"కావాలి"

"లేదు అయిపోయింది. మరి, వాయిదా వాయిదాకు మన తరఫున కోర్టుకు వెళ్లే సాక్షులకు ఖర్చులు ఎక్కడినుంచి వస్తై?"

ఆ తరువాత అతనికి తెలిసింది. సుశి ఆ డబ్బును రంగప్ప పరం చేసింది. వాయిదా నోటీసులు రాగానే రంగప్ప వెళ్లి, సాక్షుల్నందర్నీ జమచేసి కోర్టుకు తీసుకువెళ్తున్నాడు. లేకపోతే, ఈ సాక్షుల్ని యావన్మందినీ ఆ దొంగ వారసులు అమాంతం కొనేస్తారు. ఒకరోజు లేచీ, లేవక ఆమె మాతృస్వరూపంతో బాధపడుతున్నా ఏ వివరాన్ని మర్చిపోవటం లేదు. నిర్ణీతంగా ప్రతి పనీ జరిగిపోవాల్సిందే. ఇన్నింటికీ తోడూ, తీరిక చేసుకుని ఆమె దొడ్లో కూరగాయల పాదులు పెట్టింది-రంగప్ప సాయంతో, నీళ్ళు పోయటం, కలుపుమొక్కలేరటం, చిన్న పందిర్లు కట్టి, తీగెలు తెగకుండా అల్లించటం, పేడ ఎరువు వేయటం-వాళ్ళిద్దరూ పంచుకొని చేస్తున్నారు.

"ఎందుకట్లా అలసట పనులు చేస్తావ్" అని చాలాసార్లు సుశీని మందలించాడు. చివరికోసారి అతనిని తన పక్కనే కూర్చొనబెట్టి చెప్పింది- "అన్ని ఖర్చులు తగ్గించుకొంటున్నాం ఎందుకో! ఇవీ అందుకే."

అతనికీ అర్థం అయింది. తనిప్పుడు లక్షాధికారీ, ఎస్టేటుదారుడూ కాదు. సామాన్య గృహస్థు. తనిట్లా ఉంటే ముందు ముందు తిండికి జరగటమే ఇబ్బంది కావచ్చు. అతనికేమిచేయాలో తోచలేదు. రోజు రోజుకూ దిగులుతో పుట్టెడు కుంగిపోసాగాడు. సుశీ ఒక రోజున సోషలిజం అంటే ఏమిటో వివరించి చెప్పింది.

"ఫాసిజం" అంటే - పొరుగు వాడికో ఆవుంది. వాణ్ణి చంపి ఆవును తెచ్చి పాలన్నీ-త్రాగటం. మీ జ్ఞాతులు చేస్తున్న పని"

"ఎవరు చెప్పినమాట"

"బెర్నార్డ్‌షా"

"నువ్వివన్నీ చదివావా సుశీ! నాకు రాచకీయాలంటే ఏమీ తెలీవు సుమా!"

"చదివాను. మీ ఇంట్లో పుస్తకాలన్నీ నేను చదివినవే. నాన్నగారిచేత తెప్పించుకొని చదివినవే. చదివి పంపిస్తుండే దాన్ని. రాచకీయాలు తెలీకపోతేనేం. మీరు మానవతా వాదులు"

"అయితే నువ్వు చెప్పిన సామ్యవాద సిద్ధాంతం ప్రకారం ఆ జ్ఞాతులకు కూడా ఈ ఆస్థిలో భాగం ఉంటం ధర్మమేగా"

"ధర్మమే"

"అయితే రాజీపడితేనో-"

"అంత ప్రయత్నం జరిగింది. మన ప్లీడరుగారి జిత్తులవల్ల అన్నీ వ్యర్థమైపోయినై. మన ప్లీడరుగారు పూంజీపతి. పెట్టుబడి మనిషి కాకపోయినా ఆ తత్వం గలవాడు. ఆవు తనది గాదు. పాలల్లో హెచ్చుభాగం కావాలి"

అతను ఆమెవంక సాశ్చర్యంగా, ఆరాధనగా చూశాడు.

"అవును అందరూ మేపాలి. పాలు అందరూ తాగాలి. కానీ మేపని వాళ్ళకు పాలు పంచటం నాకూ ఇష్టం లేదు. మీ జ్ఞాతులకన్నమాట. అందువల్ల మన ప్లీడరుగారి చర్యల్ని నేనూ ఉపేక్షించినమాట నిజం" అని నవ్వింది.

ఆమె రోజురోజుకూ బలహీనమైపోసాగింది. అతను మొదట్లో ఒక లేడీ డాక్టరునూ, నర్సును తెచ్చి ఇంట్లో ఆమె కన్న దాకా నియమిద్దామని ఆలోచించినవాడు కాని ఇప్పుడో, చేతిలో గవ్వ కాసులేదు. ఆమెను మందు తీసుకోమని అనటానికే భయపడేవాడు. ఆమెను చూడలేక. ఎడాపెడా తిరిగాడు. ఒక రోజున నిలవేసింది.

"ఎందుకలా తిరుగుతున్నారు? నన్ను చేసుకొన్నదిందుకేనా?"

అతను దుఃఖాన్ని దిగమింగబోయాడు. కాని కళ్ళు పట్టిఇచ్చినై-"సుశీ-నేను నష్టజాతకుణ్ణి"

"నేనుండగానా?"

"నేనేదైనా ఉద్యోగం చేస్తాను"

"చేస్తే చెయ్యండి-ఇపుడు సామ్యవాదులుగా మరి"

అతడు ఆ మాటకు కడుపుబ్బా నవ్వసాగాడు. అతనీ మధ్య పుస్తకాలన్నీ వెతికి

సామ్యవాద వేదాంతాన్నంతా చదివాడు. ఆమె గమనిస్తూనే ఉంది. కాని అతనికంతా అగమ్య గోచరంగానే ఉంది. ఈ సామ్యవాదానికి లక్ష తొంభై భాష్యకారులున్నారు. అందులో పచ్చిరక్తం తాగగోరిన నియంతలు మొదలు, సున్నితంగా లోకాన్నంతా దోపిడీ చేయగలిగిన బొంబాయి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్లవరకూ - సామ్యవాద 'ముసుగు'నే కప్పుకున్నారు.

ఆ ఊళ్లో ఒక ఆయుర్వేద వైద్యుడున్నాడు. ఆయనకు మధు తాతగారి పూర్వీకులిచ్చిన ఈనాం భూములు ఇంకా హక్కు భుక్తంలో ఉన్నాయి. ఆయన ఒక రోజున హఠాత్తుగా వచ్చి సుశీకి ఏవో ఆయుర్వేదపు మందులిచ్చిపోయాడు. మధుకు తను వెనుక వైద్య విద్యను పూర్తిచేయకపోవటం స్మృతికి వచ్చినప్పుడల్లా ఖిన్నపడేవాడు. ఈ వైద్యుడి వాత్సల్యం అతన్నెంతో ఆశ్చర్యపరిచింది. ఆయనతో రోజూ వాళ్ళింటికెళ్ళేవాడు. సన్నికళ్ళలో మందులు నూరటానికి తయారయేవాడు. రోగుల్ని చూచేందుకు ఆయనతోపాటు ఊళ్ళోతిరిగేవాడు. అతనికిదో ఉద్యోగమైపోయింది.

ఒకరోజు ఉదయం రంగప్ప రొప్పుతూ రోజుతూ వైద్యుడింటికి పరుగెత్తుకొచ్చాడు.

"బాబూ!"

సన్నికల్లు మందు కూర్చున్న మధు తుళ్ళిపడి లేచి పరిగెత్తాడు. అతనికంతా తెలుసు రంగప్ప కళ్ళను చదివాడు.

నెలలురాకముందే సుశీకి నొప్పులు ప్రారంభించినై. అతను ఇంటికి చేరేటప్పటికే ముసిలాయన, రామకిష్టయ్యగారి రోదనం బయటకు వినిపిస్తున్నది. సుశీ ఆడబిడ్డను కని చనిపోయింది. ఆడ పసికూన ఏడు నెలలు కూడా తల్లికడుపున పెరగలేదు.

## 16

సుశీల మరణం వరకే, అతని స్మృతిపథంలో ప్రాపంచిక ప్రతిబింబాలు నిలిచింది. భార్య శవం చూసి అతడు భోరున ఏడవలేదు. కళేబరాన్ని, మానవుడు భగవంతుని పాదధూళిని తాకినట్లు పూజతో తాకాడు. చివరకు కన్నీళ్ళు కూడా బయటికి కన్పించలేదు.

ఆరోజునే అతనికి పెద్ద పెట్టున నూట నాలుగు డిగ్రీల జ్వరం వచ్చింది. మగత కమ్మింది. మంచంలో అతని జీవచ్ఛవం హృదయ విదారకచైతన్యంతో పడి ఉన్నది.

తెలివివచ్చి ఒకవారం దినాల తర్వాత అతని ఆలోచనా ప్రవాహం తిరిగి కట్టలు తెగి ప్రవహించసాగింది. అతని ముఖంలో కళలేదు. క్షణికంగా అప్పుడప్పుడు సత్తువతో లేచి కూర్చుంటాడు.

"పసిబిడ్డ ఎక్కడ?" అని అడిగాడు అటువంటి జాగ్రదవస్థలోనే. అతని మంచం పక్క రామక్రిష్టయ్యగారు, ప్లీడరూ, రంగప్పా-దిగులుపడి కూచొని ఉన్నారు.

"పసిబిడ్డకేం ఫర్వాలేదు మధుబాబూ. ఆస్పత్రిలో ఉంచాం. ముందు మీ ఆరోగ్యం చూచుకోండి. చాలా దెబ్బతిన్నారు. మానవులందరికీ వచ్చే కష్టాలే వచ్చినై. అందుకని మొదలు నరికిన చెట్టులయిపోతామా?" అని వకీలుగారు ఓదార్చబోయాడు.

"సుశీ బిడ్డను చూడాలి" అంటూ రోగి మంచం మించి లేచే ప్రయత్నం చేశాడు.

"ఇప్పుడేం తొందర? మీరు లేవలేని స్థితిలో ఉన్నారు మధుబాబూ"

"నిజం చెప్పండి. నా బిడ్డ ఇంకా బతికుందా?"

ఆ గదంతా ఒక్క లిప్తకాలం నిశ్శబ్ద బంధురమైపోయింది.

ముసిలాయన పెద్దపెట్టున ఏడుపు సాగించాడు. రంగప్ప ఆయనను బయటికి తీసుకుపోయాడు.

మధు వకీలుగార్ని మళ్ళీ ప్రశ్నించాడు.

"ఇంకా బతికుందా?"

"లేదు"

తల్లిపోయిన మూడవ రోజునే బిడ్డ కూడా పోయింది. నెలులు నిండక పుట్టిన బిడ్డ కావటం చేత ఆస్పత్రిలో ఉంచారు. కాని లాభం లేకపోయింది.

ఆ తరువాత మధు ఎవర్నీ ఏమి అడగలేదు.

❖ ❖ ❖

రెండు నెలలకు గాని అతడు కోలుకోలేకపోయాడు. లేచి తిరగగల ఓపిక వచ్చింది. మొదటిరోజునే అతను పాతమేడ తోటలోకి వెళ్ళాడు. బావురుమంటున్న తోటలో పూలబాటలనిండా గడ్డి మొలిచి ఉన్నది. మేడ తలుపులన్నీ మూసివున్నై. బిక్కుబిక్కు మంటూ ఒక చౌకీదారుమాత్రం అక్కడ తచ్చాట్లాడుతున్నాడు. ఒకరోజున తను సుశీని మొట్టమొదటి సారిగా ఆ తోట బాటలోనే గోధూళి సమయంలో చూశాడు. ఈనాడు కూడా గోధూళి సమయమే! దూరాన మెల్లగా నడిచివస్తున్నట్లుగా సుశీ కన్పించింది. ఆ తోటలోనే ప్రీతిగూడా అనేకసార్లు పూలుకోస్తుండగా, గోధూళి సమయంలోనే ఆమెను కలుసుకొన్నాడు. కాని ప్రీతి ఆ తోటను ఎంత ప్రేమించి ఉన్నా, అతని ఊహాపథంలో సుశీలే గోధూళి సమయంలో ఏ అనిర్వచనీయ సౌందర్యంతోనో వెలిగి ఒలకపోయే

తోటకు వనరాణిగా సర్వాధికారిణిగా ముద్రపడిపోయింది.

ఇంటికి తిరిగివచ్చి ఈ కొత్తచోటులో సుశీ వేసిన కనకాంబరపు పూలమడి చూచి, "రంగప్పా- ఈ మళ్ళకు నీళ్ళు పోస్తున్నదెవరు?" అని అడిగాడు.

"నేనే బాబూ" అని నడుమెత్తి వెనుదిరిగి రంగప్ప అతని కళ్ళవంక చూచాడు.

"పొయ్యవద్దు, ఎండిపోనీ" అన్నాడు, అది విని.,

కానీ నీళ్ళు తాగకనే కనకాంబరాలు తెగపూచినవి. పూచి మడిలో రాలి, తర్వాత గాలిలో ఎగిరి ఆ ప్రదేశమంతా, ప్రతిదినమూ కమ్మేకొనేవి.

తర్వాత ఇంకో వారం రోజులకు - "రంగప్పా! సుశీ ఇచ్చిన డబ్బు ఇంకా ఉందా?" అని అడిగాడు.

"ఉన్నది బాబూ"

"సాక్షుల కోసం ఇక ఖర్చుపెట్టవద్దు"

రంగప్ప చిన్నబాబును విస్తుపోయి చూచి, మంచంలో ఉన్న రామకిష్టయ్యగారి వద్ద కెళ్ళి చెప్పాడు.

మధుకు చేసే పనిలేదు. వంటపని రంగప్ప మీదే పడ్డది. రామకిష్టయ్యగారు కర్రపూతతో ఎప్పుడైనా లేచి గాలికి తిరగటం తప్పితే, ఆయన దుఃఖం కూడా నోరు పోగొట్టుకున్న పసిపాప అయిపోయింది. సుశీ పోయినప్పటినుంచీ ముసిలాయనతో మధు ఎన్నడూ వెనకటి మాదిరిగా మాట్లాడలేదు. కాని ప్రతిరోజూ, ఆయన మంచం పక్కనే గంటలకు గంటలు విసుగు లేకుండా కూర్చొనేవాడు. ఒకసారి మూగగా ఆయన రెండు చేతుల్నీ తన చేతుల్లోకి తీసుకొని క్షణం సేపు ఉన్నాడు. పాత ఆయుర్వేద భిషగ్రత్న వద్దకు వెళ్ళి మందు తెచ్చి ఇచ్చే పని మాత్రం అతను ఏమరలేదు.

మరొక పదిరోజుల్లో అతడు ప్లీడరుగార్ని తనే వెళ్లి కలుసుకొన్నాడు.

"ఈ వ్యాజ్యం ఇంతటితో వదిలితే నా విలువెంత?" అని ప్రశ్నించాడు.

"నాకు వివరించి చెప్పండి"

"రామకిష్టయ్యగారికి, రంగప్పకూ కొంత వసతి ఏర్పరచి నేను ఇక్కడ్నుంచి వెళ్ళిపో దల్చుకున్నా"

వకీలు అతనిని తదేకంగా పరిశీలించాడు.

"ఎక్కడికి?"

మధు మాట్లాడలేదు. అతనికి గమ్యం లేదు.

"కొన్ని కంపెనీల్లో షేర్లుమాత్రం ఉన్నాయ్- కాని మీరు విరక్తితో ఏం చెయ్యదల్చుకొన్నారో, అది మాత్రం మీ వంటి ఉత్తములు చెయ్యదగింది కాదు"

ఆ వ్యాఖ్యకు పూర్తిగా మధు సమాధానం ఇవ్వలేదు.

"ఆ షేర్లు అమ్మేయటానికి ఒక వారం గడువు చాల్తుందా?"

"ఒక్క రోజు పని"

"ఆ పని చెయ్యండి, వాళ్ళిద్దరికీ చెరిసగం పంచే ఏర్పాటు చెయ్యండి"

వకీలుగారి స్వంత గుమాస్తాను పిలిచి కావలసిన వ్రాతకోతల్ని పూర్తి చేయించేశారు.

"మధుబాబుగారూ! ఒక్క విషయం. కొత్త చట్టం ప్రకారం మన వ్యాజ్యం ఈ సంవత్సరాంతానికే తీర్పవుతుంది. మొదట్లో మనకు ఒరిజినల్ రికార్డులు దొరక్క కేసు దిగజారిపోయింది. అసలు ఆ వారసులు దొంగలు. వాళ్ళకు హక్కులిచ్చే కోర్టు కోర్టే కాదు. మన రికార్డులన్నీ ఇప్పుడు సవ్యంగా ఉన్నై అప్పీలు గెలిచి తీరుతుంది"

మధు ఆయన వద్ద సెలవు తీసుకొన్నాడు.

తన కోరిక ప్రకారం వకీలుగారు చేసిన ఆస్తి పంపిణీ విషయం కొద్ది రోజుల్లోనే దాన గ్రహీత లిద్దరకూ తెలుపబడింది. రంగప్ప కాయితాన్ని ముసిలాయన చదివి వివరించి చెప్పాడు గాబోలు, అతడు పరుగెత్తుకుంటూ వచ్చి మధుకు వంగి వంగి నమస్కరిస్తూ "ఇదేమిటి బాబూ. చిన్నబాబూ, తమరికంటేనా ఈ సేవకుడికి దుడ్డు? తమరు పచ్చగా ఉండాలని కలకాలం కోరేవాణ్ణి- ఈ డబ్బుతో వేరుచేస్తారా బాబు" అని అడ్డు నిలుచున్నాడు. మధు చిరునవ్వు నవ్వి - "మీరిద్దరూ ఇక్కడే ఉంటారు. నాతోనే ఉంటారు" అన్నాడు. రంగప్ప చేతిలోని కాగితం కన్నీళ్ళ చుక్కల్తో మధ్యగా తడిసింది. రామకిష్టయ్యగారు అడుగుతాడేమోనని మధు, ఆయన నిద్రిస్తున్నప్పుడే ఇంట్లో ప్రవేశించాడు ఆ నాలుగురోజులూ.

భౌతిక విలువలు మధు జీవితాన్ని ఉద్రేకపరచిన సంఘటనలు లేకపోలేదు. కాని అట్టి విలువలు బ్రతుకు యొక్క ధ్యేయాలుగా ఎప్పుడూ మారలేదు. జీవిత మార్గంలో లాంతరు స్తంభాలు కాలేదు! మైలురాళ్ళు కాలేదు. అవి అతడి తత్వం మీద పూర్తి పలుకుబడిని సంపాదించలేదెప్పుడూ కూడా. ఒకసారి అతడు వేశ్యకు లొంగిపోయాడు. అంతే మళ్ళీ ఆ తర్వాత రామక్రిష్టయ్య, రంగప్ప - వీళ్ళ భవిష్యత్తును గురించిన భారంతో పెనవేసుకొన్న తన ఆలోచనలతోనే సలసల కాగిపోయాడు. ఇప్పుడు -ఈ సమస్య తేలిపోవటంతో అతని భౌతిక బంధనాలన్నీ తెగిపోయినట్లయింది. ఒక్క

తన నష్టజాతకాన్ని గురించి మాత్రం అతని హృదయం ఎంత పోరాడినా మనస్సు మాత్రం - దాన్ని గురించిన ఆలోచనలనే ఆహ్వానిస్తూ ఉన్నది.

మధు రోజూ నడిచే ఊరి బయటి మార్గంలో పాడుబడ్డ దేవాలయం ఒకటున్నది. నిత్యమూ అక్కడికి పోనిదే అతనికి తోచేదికాదు. అది బహు చిన్న ఆలయం. అసలే చిన్న ప్రహరీగోడ. అది కూడా శిథిలావస్థలో ఉంది. మధుకు ఈ శిథిలవాతావరణంలో అతి సన్నిహితత్వం ఏర్పడింది. రాను రాను ఉప్పుచౌడులో గుంటలు, కాలి గుర్తులు, సగం తిన్న రాళ్ళు ఉనికి. ఆకారం అతని మెదడులో ప్రతిబింబాలైపోయాయి. రంగప్ప ఆ రోజున హఠాత్తుగా మధును ఆ శిథిలాల్లో చూచాడు అతను రంగప్పను ఎందుకొచ్చావని అడగలేదు.

"రంగప్పా! నీకు వేమన కథ తెలుసా?" అని ప్రశ్నించాడు.

"ఏదో వింటం గాని నాకేం తెలుసు బాబూ"

"నాకూ సరిగ్గా తెలీదు"

"పోదాం రండి బాబయ్యా! ఒంటరిగా వుండి మనస్సు చెడగొట్టుకుంటున్నారు ఇంత తిండి తినరు, వేళకు నిద్రపోరు - ఇంకేమైనా ఉందా?"

"రంగప్పా, ఈ గోడ మనం బాగుచేస్తే"

రంగప్ప అతని వంక చూచాడు. పగిలి పతనమైన హృది తుంపుల్ని నేలమీద రాళ్ళ మధ్యలో ఏరుతున్నట్లుగా చూచాడు. అతనికి మధు వయస్సు మూడురెట్లు ఎక్కువైనట్లుగా కనిపించింది. ఏమనుకున్నాడో ఆలయం చుట్టూ కూరుకుపోతున్న వుప్పు చౌడులో ప్రదక్షణగా తిరిగి వచ్చాడు. గుడికి గంటలేదు! దాన్ని ఎవరెత్తుకు పోయారో? లోపలికి పోయి తొంగిచూచి గబ్బిలాల శాంతికి భంగం కలిగించాడు.

"గెరబగుళ్ళో యిగ్రం కూడా లేదు బాబూ"

కాని ఆ మర్నాడే వాళ్ళిద్దరూ ప్రహరీ గోడకు మరమ్మత్తులు ప్రారంభించారు. రంగప్ప ఎంత చెప్పినా వినక మధు కూడా పనిలో చేతులూ, కాళ్ళూ పూర్తిగా వినియోగించాడు. రేగటి మట్టితో అడుసుగలిపి పాత రాళ్ళనే దులిపి తిరిగి పేర్చి గోడను ఒక ఆకారానికి తెచ్చాడు. గర్భగుళ్ళో విగ్రహం గురించి గాని, ప్రాంగణంలో గంటను గురించి గాని వాళ్ళు ఆలోచించలేదు.

ప్రహరీ గోడపని పూర్తి అయిన దినాన రామకిష్టయ్యగారితో చాలాసేపుగా సంభాషించాడు మధు ముసిలాయన ఆరోగ్యం గురించే. భోంచేసి పైన చొక్కా వేసుకున్నాడు జేబు కొంచెం బరువుగా తగిలింది. తడివి చూసుకున్నాడు. అందులో

పదిహేను రూపాయలున్నాయి. కొన్నినోట్లు, కొన్ని పాతవెండి రూపాయలు.

మధు మెల్లగా నడుస్తూ రైలుస్టేషను చేరాడు. టిక్కెట్టు కొన్నాడు. చాలాసేపు ప్లాటుఫారంమీద వేచి ఉన్నాడు. బండిరాగానే ఎక్కి కూచున్నాడు - ఒక పెట్టెలో. అందులో వత్తిడిగా ఉంది. దిగి వేరే బోగీ ఎక్కాడు. అది రెండవ తరగతి పెట్టె. బోగీలో కొంచెం చల్లగా ఉంది. కళ్ళు మూసుకున్నాడు. మరో కొన్ని క్షణాల్లోనే బండి కదిలింది. ఆ ఊపుకు అతడు కళ్ళు తెరిచాడు.

అతని కెదురుగా ఉన్న సీటుమీద ఒక చిరపరిచితుడైన యువకుడు కూర్చొని ఉన్నాడు.

"మధూ!!!"

"శ్రీ....రాం...."

"ఎన్నాళ్ళకు! ఇదేమిటి ఇట్లా తయారైనావ్? ఎక్కడ్నుంచి? ఎక్కడిదాక? వెనక నేనొక ఉత్తరం వ్రాసినట్లు జ్ఞాపకం. అందిందా? ఏం జేస్తున్నట్టసలు!!

బండి మెయిల్‌ట్రైన్ కావటంలో అతి వేగంగా పరిగెడుతోంది. ఇద్దరు మిత్రులూ మాట్లాడుకొంటున్నారు. కాలం గడిచిపోతున్నది. మధు మగతగా నిద్రబోయాడు.

"మధూ! దిగు దిగు, తెల్లవారింది లేవాలి మహాశయా... లేవాలి. పట్నం వచ్చేశాం!"

మధు లేచాడు. ప్లాటుఫారం మీది శబ్దాలన్నీ ఒక్కసారిగా గజిబిజిగా వినిపించినై.

శ్రీరాం హోల్డాలంతా సర్దిపెట్టేసి - మధు జబ్బును ఊపుతూ "లేవయ్యా మహాశయా దిగాలి, దిగాలి. కలియుగాంజనేయుడుగా ఉండాల్సిన రోజుల్లో ఏమిటి బద్ధకం" అని హడావిడి చేసేశాడు.

"ఎక్కడికి?!! అని మొదటిసారిగా పగటి వెలుగులో తన సహాధ్యాయుడి ముఖం చూస్తూ మధు ప్రశ్నించాడు.

"ఓహోహో రాముడికి సీతేం కావాలన్నట్టుంది. ఎక్కడికేమిటి? మా ఇంటికి. పట్నం వచ్చాం. ఇంకా మత్తే. మా ఆవిడకి టెలిగ్రాం అంది ఉంటే ఆమె కూడా వచ్చి ఉండాలి స్టేషనుకు"

ఇద్దరూ దిగారు.

"అదిగో హాల్లో - ప్రీతి - నా భార్యోయ్ మిత్రమా! నా మిత్రుడు - చదువుకున్నాంలే మధు - భలేవాడ్లే - అర్ధాంగి!"

మధు కాళ్ళకింది భూమి, కల్పాల అక్షౌహిణుల భారాన్ని మోయలేక ఒక్కసారి కంపించిపోయింది. అతనికెదురుగా చేతులు జోడించి నమస్కరిస్తూ, ఒకనాడు తన నాడించిన ప్రీతి నిలిచి ఉన్నది.

"డేయ్, హమాల్, పోర్టర్, కమాన్ హియర్ యూ - సామాన్లెత్తు".

## 17

సంతోషం, దుఃఖం - మానవుడి జీవితంలో స్థానం ఆక్రమించుకొని ఉక్కిరి బిక్కిరి చేయగలగటానికి, మనస్సే మూలకారణమని భారతీయ వేదాంతం శతాబ్దాల నుండి హోషిస్తున్నది. కొద్దోగొప్పో ఈ వేదాంత సారాంశం, ప్రతి భారతీయుడి రక్తంలోనూ పరంపరానుగతంగా ఇంకిపోయి ఉండి ఉంటూనే ఉన్నది. భారతీయులై జన్మించి గూడా, భారత సాంప్రదాయాలకు, ఈ దేశ నాగరికతనూ, తృణీకరించి ధిక్కరించి, విద్రోహం తలపెట్టిన - మాతృదేశ ద్రోహులు కూడా. చివరకు తమ అవసాన దశలోనైనా ఈ పురాకృత మహా వేదాంతంలోని ఒక్క ముక్కయినా ఉచ్చరించందే చచ్చిపోరు. అందుకు తార్కాణాలనేకం.

సుఖదుఃఖాలకు అతీతుడనై పోయాననుకొన్న మధుకు తిరిగి ఈ మనోవ్యాకులత అంకురించటానికి, దూరం వెళ్ళిపొమ్మని ప్రోద్బలంచేసి, రైలుబండిలో ఎక్కించిన అతని మనస్సే కారణం. వేదాంతి యొక్క ఈ ఒక్క పొరపాటూ అతడిని, ఒకనాడు అతని విషాద భయాల నుండి మేల్కొలిపి స్త్రీ ప్రేమ యొక్క అనాది సమస్య లోతుల్లో నుంచి వచ్చినట్టే మాయమైపోయిన ప్రీతి సన్నిధిలో విసిరివేసింది. ఒకనాడు తనగది తాళపు చెవిని తెచ్చి ఇచ్చి, ఈనాడు జీవిత రహస్యానికి తారకమంత్రాన్ని తననుండే పొందమని చెబుతున్న శ్రీరాం సన్నిధిలో పడదోసింది. జీవితపు సింహావలోకనమంటేనే ఒళ్ళు జలదరించుకొనే తను, ప్రతిక్షణమూ ఆ సింహావలోకన లోకంలోనే కలలు కంటూ బ్రతకమని చెప్పిపోయింది ఆ ఒక్క చిన్న పొరబాటూ.

ఈ ఆకస్మిక సంఘటన, ఈ ఆకస్మిక కలయిక అతడికి తన ప్రథమ నష్టజాతక వేదాంత ధోరణిలోని నిజాన్ని నమ్మమని ఎదురుగా నిలిచి సవాలు చేస్తున్నాయ్. ఈ సవాలునుండి అతడు తప్పించుకోలేడు. అందుకు సామర్థ్యం లేనివాడు. సుశీలతో అతని సాహచర్యం, ఆ తరువాతి ఆమె మరణం, అతణ్ణి పూర్తిగా అశక్తుణ్ణిగా చేశాయి. ఇక ఏ పనీ చేయటానికీ అతనికి శక్తిలేదు. ఆలోచన లేదు. సుశీ మరణం తర్వాత అతను చేసిన మంచి చెడ్డ కార్యాలన్నీ ఆలోచించి చేసిన పనులు మాత్రం కావు. తన నుండి తాను విడిపోవటానికి అతనికి ఒక మార్గంగా కనబడి అట్లా వ్యవహరించాడు.

ఇతరుల మీద జాలితో అట్లా వ్యవహరించాడు. అన్నిటిమీదా విసిగి అవిశ్వాసంతో భయపడి అట్లా వ్యవహరించాడు. తనలోని ఉత్తమ మానవత చేసిన ప్రోద్బలంతో అట్లా వ్యవహరించాడు.

ప్లాట్‌ఫారం మీద ప్రీతిని తనెంత వేగంగా గుర్తించగలిగాడో ఆమె గూడా అట్లాగే గుర్తించింది. తమ పూర్వ పరిచయాలను గురించి ఎవ్వరూ మాట కూడా అనుకోలేదు. కేవలం అపరిచితులవలె నమస్కారాలు చేసుకొన్నారు. అతడు ఆమె కళ్ళను చూచాడు. ఆ కళ్ళ నుండి ఆమె హృదయాంతర్గత భావాలను చదవబోయాడు. కాని అక్కడ లోతు సరస్సులూ లేవు. పెనుతుఫానులూ లేవు.

ఆమె వెనుకటి చిలిపి కళ్ళే. తను ఎరిగిననాటి నూనూగు మిసిమి అందం కాకుండా ఆమెలోని ప్రత్యేక వ్యక్తిత్వాన్ని స్ఫుటీకరించే స్థిరానందమైన అందం ఆమెదిప్పుడు.

ముగ్గురూ టాక్సీలో కూర్చొని ఇంటికి పోతున్నప్పుడు - శ్రీరాం మళ్ళీ సంభాషణ ప్రారంభించాడు. లోకాన్ని జయించగలిగిన ఉత్సాహం అతనిది.

చదువుకొనే రోజుల్లో నువ్వేగామాలె మధూ! పెళ్ళంటే పెడమొగం పెట్టినట్టుగా మాట్లాడేవాడివి. అప్పుడు పెళ్ళి చేసుకొని వాళ్ళంతా పిచ్చొళ్ళుగా కనిపించేవాళ్ళులే. కాని ప్రీతి కాపరానికొచ్చినప్పట్నుంచీ చూస్తున్నాగదా! మీరంతా రైటేనయ్యా"

ప్రీతి నవ్వుతూ అన్నది - "మీరు అంత పెద్ద బ్రహ్మరాక్షసిని చూస్తూచూస్తూ ఎందుకు చేసుకొన్నారు?"

"బ్రహ్మరాక్షసులు మోహినీ రూపంలో నన్ను వరించబట్టి"

"ఓహో! వరించటానికి బ్రహ్మరాక్షసులకింకెవరూ దొరకలేపాపం"

"కాదోయ్ మధూ- ఇక నా పనీ పాడూ అంతా వదిలి తోకవెంట నారాయణలాగ తిరగమంటుంది. చిన్నప్పుడు సరిగమేలేవో నేర్చుకుందిట! వినమని వేధిస్తుంది. సంగీతం మాష్టార్ని కుదిరిస్తే పరీక్షలకు కడ్తానంటుంది. ఎక్కడ చావను? నా లేబరొటరీ పని చూద్దామా- ఒంటరిగాణ్ణి, పరికరాల్లేవు."

ఇంటిముందు కారాగిందాకా ఇట్లాగే అవాకులు చెవాకులు వాగుతూ ఉన్నాడతను. కాని, గతాన్నుండి పైకి పెళ్ళగిలి వస్తున్న ఆలోచనలు పొగమంచుకు ఆవల ఉండి - ఇవన్నీ దాదాపు ఏమీ వినలేదు మధు. గతాన్ని త్రవ్వితీసే ఏ విషయమైనా అతనికి దుస్వప్నంగా ఉంది. కాని ఈ ప్రీతి తన గతానికి పునాది. ఇక్కడ నుండి వెళ్ళకపోతే తనకు శాంతిలేదు.

రెండురోజులుండి అతను బయలుదేరాడు. "నేను వెళ్తున్నా నమ్మాయ్" అని మొదట ప్రీతికి చెప్పాడు.

"ఎక్కడికి వెళ్ళేది! వీల్లేదు" అంది ఆమె.

అతనికి ఆమె బలవంతం అమితాశ్చర్యాన్ని కలిగించింది.

ఆ సాయంత్రం శ్రీరాం వస్తూనే దినపత్రికలో ఒక కోర్టు ప్రకటన చూపిస్తూ - మధూ ఏమిటీ గందరగోళమంతా! నీ ఆస్తికి ఎవరో వలవేసినట్టుగా ఉందే చూస్తే" అన్నాడు.

మధు తలవూపుతూ ఆ ప్రకటన చదివాడు. అది వాళ్ళ వకీలుగారి ప్రకటన ఈ ఆస్తి వ్యాజ్యం గురించిన ఆక్షేపనలు తెలియపర్చమని కనబడని వ్యక్తులకు న్యాయస్థానాల భాషలో చేసిన సవాలు అది.

"మీ మిత్రుడు వెళ్ళిపోతారట" అని తల వూపుతూ ప్రీతి భర్తతో అన్నది.

'ఎక్కడికెళ్తాడు. వీల్లేదు. నాకూ నీకూ కొన్నాళ్ళయినా ఇక్కడ సాయంగా ఉంటాడనుకొంటుంటే, ఏమిటి నిజమేనా మధూ!"

ఆ రాత్రి అతడు భోజనాలయినాక తన జీవిత చరిత్రంతా చెప్పాడు. అందులో ప్రీతి, వేశ్యయువతి వృత్తాంతాలు మినహాయించి. తన సుశీ, బిడ్డ చనిపోయారని - ఇక తనకు సన్యాసాశ్రమం మీద ఆసక్తి జనించిందని. ప్రతి విషయాన్నీ శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించగల శ్రీరాంను, భవిష్యత్తు తనదే అన్న బ్రహ్మాండమైన విశ్వాసంతో ముందడుగు వేసే శ్రీరాంను - ఈ మిత్రుడి వేదాంతం పూర్తిగా నిరుత్తరుణ్ణి చేసింది. ఆ భార్యభర్తలిద్దరూ, గాలిలో ఆకువలె ఉన్న ఈ మధును అక్కడ నుండి కదలనీయలేదు. శ్రీరాం మనిషిని పంపించి అతని గుడ్డలూ, పెట్టెలూ తెప్పించాడు. నువ్వు సన్యాసం కోసం పుట్టలేదు. అందులో అర్థమూలేదు - అన్నాడు శ్రీరాం ఇన్నీ విని కూడా.

కాని మధు ప్రీతితో చాలా ముభావంగానే ఉన్నాడు. పెట్టెబేడా వచ్చింతర్వాత కూడా వాటిని తెరిచి సర్దుకోలేదు. ప్రీతి వాటిని తెరిచి అన్నీ సర్దింది. అందులో ఆమె ఫొటో కన్పించింది.

"ఇదెక్కడిది?" అని మధును అడిగింది - కనుబొమలు ఎగరవేస్తూ

"ఎందుకడుగుతావ్! నీది గాదూ?" అని అతను చాలా చికాకుతో సమాధాన మిచ్చాడు.

"సుశీ ఫొటో లేదా?"

"తీయించలేదు"

"ఎందుకనో!"

"దేవతలకు ప్రతిరూపాలెందుకు - మానవులకు గాని"

ప్రీతి అతన్ని తేరిపార చూచింది. అతని అవ్యక్త మనస్సులోని సంఘర్షణ అంతా ఆ కలగా రూపొందింది.

తనూ ప్రీతి, తమ పాతయింటి తోటలో ఉన్నారు.

"ప్రీతీ! మన పాతస్నేహం, ఆటలూ - పాటలూ మరిచి పొయ్యావా!"

"ఎందుకు మరచిపోయానోయ్ మధూ. బాల్యస్మృతుల్లాంటివి. మళ్ళీ ఇప్పుడు జ్ఞాపకం వస్తున్నై నిన్ను చూస్తే"

"అంతే నా ప్రీతీ! నా పుస్తకాలతో, పూలతో నిన్ను పూజించాను. నీలో దేవత్వాన్ని వెతికాను. నీవు సంచరించిన మట్టి కూడా పవిత్రంగా భావించాను. కాని.... కాని..."

"ఏమైంది.. ఏమిటిది మధూ!"

"ఏం కావాలి? ఏముందిక? నా ప్రేమ.. అంతా అంతేనా? నన్ను మరిచిపోయావ్ ఎంత సులభంగా? ఎంత నిర్లక్ష్యంగా! మనమెప్పుడూ కలుసుకోనట్లే. మన పాటలకూ. ఆటలకూ అర్థం లేనట్లుగా, అంతేగదూ ప్రీతి!"

"మధూ... నా పిచ్చి మధూ... నేను మాత్రం నిన్ను ప్రేమించలేదా? ప్రేమించాను మధూ.... నా కన్నా చిన్నవాడిని నా తమ్ముడివి. అమాయికుడివి. నీ అందాన్ని, ధనాన్నీ కాదు. అవి లోకం నిండా ఉన్నాయ్... నీ సుగుణాలను నీ భ్రాతృత్వాన్ని - నేను ప్రేమించలేదంటావేం మధూ"

"మరి మొదట్లోనే ఎందుకు చెప్పలేదూ? నా పూలనూ పూజా ద్రవ్యాలనూ మొదట్లోనో అగ్నితో భస్మం చెయ్యలేకపోయావా?" ఆమె వంక అసహ్యంతో చూశాడు.

ఆమె పెద్దగా నవ్వింది.

"పిచ్చి...." అతని తల పట్టుకొని, పిల్లవాణ్ణి ఆటలు పట్టించి, కొబ్బరికాయ నీళ్ళు ఊపి చూసినట్లుగా ఊపింది.

కాని కలలో మధు కామాతురుడై ఆమెను తాకబోయాడు. "దూరంగా పో" అని ప్రీతి గర్జించింది. ఆమె కళ్ళు క్షణంలో అరుణసిక్తమై పోయాయి. భయంతో వణిక పోయాడు. అంతే! అతనికిక జాగ్రదవస్థ వచ్చింది. తనను చూసుకొని తనే అసహ్యించు కొన్నాడు. మరునాడు ఆమె ముకం చూట్టానికి సిగ్గుపడ్డాడు. తప్పించుకు తిరగసాగాడు.

ఆమె వచ్చి "ఎందుకలా ఉన్నావ్, అట్లా పోయి కాస్త లేబరేటరీ అన్నా చూసి

రాకపోయావా" అన్నది.

అదే చాలని అక్కడి నుంచి తప్పించుకున్నాడు. కాని అతను అలజడితోనే మసిలాడు. లేబరేటరీలో శ్రీరాం, తదేక ధ్యానంతో పనిజేస్తున్నాడు. అతను పరిశ్రమల్లో పనికివచ్చే కొన్ని కొత్త రసాయనికాల మీద ప్రయోగాలు చేస్తున్నాడు. అతడు రసాయనిక శాస్త్రమే కాకుండా, భౌతిక శాస్త్ర ప్రయెగాలనూ కొనసాగిస్తున్నాడు. ఇది చాలా అరుదైన విషయమని మధుకు, లేబరేటరీలో ఉన్న అసిస్టెంటు ఒకరు చెప్పారు. కాని అక్కడ కూడా ఎక్కువకాలం గడపలేకపోయాడు. ఇంటికి వచ్చాడు. ప్రీతి అతనికి భోజనం సిద్ధపరిచి ఉన్నది. అతను భోజనం ముందు కూర్చుంటూ ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు సమాధానం ఇన్నాళ్ళనుండీ తను అడగకనే వస్తుందని భ్రమపడ్డాడు.

"ప్రీతీ! - శ్రీరాంను ఎట్లా పెళ్ళి చేసుకొన్నావ్?"

ఆమె పకాపకా నవ్వింది. " ఏం మధూ, ఆయన నిజంగా రాక్షసుడు కాదు గదా!" అతనికీ నవ్వు వచ్చింది.

"వెనుక మా ఇంట్లో మీరు ఉన్న రోజుల్లో."- తమ పూర్వ పరిచయాన్ని గురించిన సంభాషణ రావటం ఇదే మొదటిసారి.

"అదా- ఓ చిన్న కథలే. మీ ఊళ్ళో ఉండగా నాన్నగారి బ్యాంకి దివాలా తీసింది. చెట్టియారు డైరెక్టర్లిద్దరూ ఐ.పి పెట్టి దగాచేశారు. ఆ రాత్రికి రాత్రి ఖాళీచేసి మా ఊరు వెళ్ళాం. అప్పుడే శ్రీరాం కూడా వచ్చి ఉన్నాడు. మా నాన్నగారికి దూరపు బంధువు. ఈ అబ్బాయిని చేసుకొంటావా? అన్నారు నాన్నగారు. ఆయన చాలా దిగుల్లో ఉన్నారు. నా పెళ్ళి అయిపోతే చాలా భారం తగ్గుతుందనుకొన్నారో ఏమో! పది రోజుల్లో మా పెళ్ళయిపోయింది."

"నాన్నగారు..."

"రెణ్ణెళ్ళల్లోనే పోయారుగా"

ఆమెను నిదానంగా చూశాడు. ఆమె కళ్ళ నీళ్ళు వత్తుకొని "మా నాన్న చాలా మంచివాడు మధూ!" అన్నది.

## 18

"నాకు సంగీతం చెప్పవా యేమిటి?" అని ప్రీతి అతడి బద్ధకాన్ని సడలించే ఉద్దేశంతో తరచుగా హెచ్చరించేది.

చాలాసార్లు ఆ ప్రశ్నవిని అక్కడినుండి లేచి ఏ గమ్యమూ లేని షికారుకని నిశ్శబ్దంగా

జారుకోవటం అతనికి అలవాటయింది. ఆ రోజున ఆమె చాలా ఖచ్చితంగా అడిగింది. "రోజూ ప్రార్థిస్తున్నాను. నాకు సంగీతం చెప్పటానికి ఎందుకు జంకుతున్నావో తెలీటం లేదు. నెల జీతం ఇచ్చుకోలేననేనా?"

"నేను సంగీతం నేర్పే రోజులు గతించినై. నాకు రాదు, మరిచిపోయాను."

"ఎవరన్నా నమ్మాలి. అది నీలో నీ రక్తంలో ఉంది. అట్లా పాడి వెనక నా దుంప తెంచేవాడిని" అని ఆమె అతని ముందు వాయులీనం తెచ్చి పెట్టింది.

"ఇటుతే. నా భరత వాక్యం పాడుకొంటాను. అదొక్కటే మిగిలింది." ఫిడేలు చాలా బరువైన వస్తువైనట్లుగా నెమ్మదిగా ఎత్తాడు. కమానుఎత్తి తంత్రుల మీద ఆడించాడు. ఏవో అర్థంలేని అపశబ్దాలతో ఒక పాట వెలువడింది. అతడు దాన్ని కింద ఉంచుతూ తీగల్ని పట్టుకొని చూచాడు. ఒక తీగె పుట్టుక్కున చివర తెగి విడిపోయి వచ్చేసింది.

ఆమె విసుక్కుని "ఎందుకు దాన్ని తెంపుతున్నావ్?"అని ముఖం చిన్నది చేసుకున్నది.

"దాన్ని కాదు తెంపింది. నీకు చెబితిని కదా. అది నా భరత వాక్యం తప్పితే ఇంకేమీ పాడనంటున్నది."

ఆ తరువాత వారం రోజులు మధు శ్రీరాం ఎక్కడ ఉంటే అక్కడే అతనితో తిరగటం ప్రారంభించాడు. శ్రీరాంకు ఈ రోజుల్లో దినపత్రికలు చూసే తీరిక కూడా లేదు. అతనికి రానురాను లేబరేటరీయే లోకం అయిపోయింది. ఒక్కొక్కనాడు ఇంటి వద్ద భార్యను కూడా మరిచిపోతాడన్నా అతిశయోక్తి లేదు. శ్రీరాంకు తన భవిష్యత్తు మీద అమోఘమైన నమ్మకం ఉంది. ఏ పని అయినా చాకచక్యంతో చేస్తాడు. అలసట అన్నది అతని ముఖకళవికల్లో వెతకటానికి కూడా కన్పించదు. అతను ఈ శతాబ్దపు మానవుడు ప్రకృతి శక్తిని పూర్తిగా నిర్జించి వీరుడై. ఆమె శక్తి సంపదలన్నిటినీ తనకు దాసోహం చేసుకొన్న వాడివలే మాట్లాడతాడు. అతనికి తెలియని పనిలేదని చూచిన వారెవరైనా వెంటనే నమ్మేశక్తి సామర్థ్యాలను ప్రతి క్షణమూ ప్రదర్శిస్తుంటాడు. కాని ఆ ప్రయోగశాల చాలాచిన్నది. కావలసిన పరికరాలన్నింటికీ డబ్బులేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న శాస్త్రకారుల వేతనంతోనే అటు ఇంటినీ, ఇటు తన ప్రయోగాల్నీ నెట్టుకొస్తున్నాడు. ఆ సంగతి మధుకు బాగా తెలుసు. స్నేహితుడికి చదువుకొనే రోజుల్లో ఇచ్చిన తన వాగ్దానం అతడు మర్చిపోలేదు - "నీకు మధు అనే స్నేహితుడున్నాడనే మాట మరిచి పోవద్దు" శ్రీరాం! అని ఆనాడైతే మంచి పరిస్థితుల్లో అన్నాడే గాని ఈనాడు తన

చేతిలో రాగిబొట్టు లేకుండా, ఆ స్నేహితుడి అతిథిగానే తను ఉన్నాడు: శ్రీరాం ఉత్సాహానికి తను చేయగలిగిన దోహదం ఏమీ కన్పించలేదు.

మధు ఆ రోజున ఇంటికి రాగానే ప్రీతి నవ్వుతూ అన్నది.

"ఎందుకట్లా తప్పించుకు తిరుగుతున్నావ్. నీ మీద నా కోపమంతా చల్లారి పోయింది. గుండెలో అంత దిగులు పెట్టుకుని తిరుగు తున్నావ్. తప్పంతానాదే"

ఆ రోజు నుంచీ ఇంట్లో మామూలుగానే మసులుతున్నాడు. శ్రీరాం బొత్తిగా ఇల్లు ధ్యాస కూడా లేకుండా ఉంటంలో వాళ్ళిద్దరూ ఇంట్లో మాట్లడుకోక తప్పలేదు. దగ్గిరా దాపూలేని లేబరేటరీకి వెళ్దామన్నా ఓపికా ఉత్సాహం అతనిలో అకస్మాత్తుగా చచ్చిపోయినవి. సంగీతం కూడా లేకపోవటంతో వాళ్ళిద్దరికీ పొద్దుపోవటం పెద్ద సమస్యగా తయారయింది.

ఆమె ఒక రోజున హఠాత్తుగా ఒక ప్రశ్న వేసింది.

"నీ కూతురు బ్రతికి ఉంటే ఏం పేరు పెట్టేవాడివి?"

అతను చాలా సేపు ఆలోచించి సమాధానంగా అన్నాడు - "నీ పేరు"

"ఎందుకని"

"సుశీకి నీవంటే ఎంతో ప్రేమ"

"నీ కంటేనే?"

"నీకు తెలీదు సుశీల మనుష్యమాత్రురాలు కాదు. దేవత. పొరబాటున భూలోకంలో పుట్టింది."

ఈ సంభాసణ జరిగిన కొద్దిరోజులకే ఆమె హడావిడిగా అతని గదిలో ప్రవేశించి అడిగింది.

"బొమ్మలు గియ్యటం ఎప్పట్నించి"

నిజానికి మధు చక్కగా చిత్రాలు వేస్తాడు. ఆస్తంతా పోయి సోమరిగా ఉన్న రోజుల్లో సుశీల అతన్ని ప్రోద్బలంచేసి ఉన్నది. ఆమెను సంతృప్తి పరచటానికన్నట్లుగా మొదట్లో పిచ్చిపిచ్చిగా తన పరిశ్రమ మొదలుపెట్టాడు.

ఆరోజున ప్రీతి ఈ హడావిడి ప్రశ్నవేసేసరికి ఎదురుగా ఒక పాడుబడ్డ దేవాలయం బొమ్మ ఉన్నది. దానివి మొండి గోడలే అయినా పైన కొద్దిగా మరామ్మత్తు చేస్తున్నట్లు కన్పిస్తున్నది. ధ్వజస్తంభం దగ్గిర ఇద్దరు వ్యక్తులు కూర్చొని ఉన్నారు. అది సిరా గీతల్తో వేసిన పెద్ద బొమ్మ. ఒక ప్రక్క వ్రాసివున్న పాత కాగితాలు ఏరి, వాటివెనక యీ చిత్రం

వేశాడు. అతని వద్ద రంగులూ, కుంచెలూ ఏమీ లేదు.

అతను ఇంకో బొమ్మ వేస్తున్నాడు.

ప్రీతి తల పంకిస్తూ - "ఆ దేవాలయం బొమ్మలో మనుషుల ముఖాలు చాలా పరిచితమైనవి" అని అతనిని ప్రశ్నార్థకంగా చూసింది.

"అయితే నేనూ చిత్రాకారుణ్ణే అన్నమాట. ఆ వ్యక్తులిద్దరూ నువ్వెరిగినవాళ్ళే"

"ఒకరు నువ్వు - రెండోది..."

"రంగప్ప"

"అవును. మీ ఇంట్లోపని..."

"ఈ బొమ్మెవరిదో కనుక్కో"

ఆమె పరకాయించి చూచింది. అది ఒక యువతి ఆకారం దాలుస్తున్నది.

"తెలియదు"

"సుశీల"

"ఇట్లా ఉండేదా?"

"ఆమెకు బాహ్యరూపం లేదని చెప్పాను. ఆమెదంతా అంత సౌందర్యమే. ఈ బొమ్మ నేను పూర్తి చెయ్యలేను"

"ఎందువల్ల? నేను రంగులు తెప్పిస్తాలే. ఈ సిరా ఏమిటి పిచ్చి సిరా"

"ఆమె నాకు జ్ఞాపకం లేదు. ఆమె హృదయాన్ని చిత్రించేంత శక్తి లేదు ఈ ఛోటా చిత్రకారుడికి"

ఎందువల్లనో ఆ దినం నుండి ఆ చిత్రం పూర్తిచేయటానికి అతనికి పడలేదు. దేవాలయం బొమ్మను, గదిలో ఉన్న ప్రీతి ఫొటో తీసేసి ఆ ప్రదేశంలో కట్టాడు. ఆమె చూచి అడిగింది - "దీనర్థం?"

"నేనిక్కడికినుంచి వెళ్ళిం తర్వాత నాతో ఏమైనా పనివస్తే శ్రీరాం ఈ దేవాలయం వెతుకుతూ వస్తే అక్కడ ఉంటానన్నమాట."

అతని మానసికాందోళన ఇక మాట్లాడనివ్వలేదు.

"దుఃఖం వల్ల వైరాగ్యం వచ్చేమాట నిజమే. అయితే మధ్య నేనేం చేశాను? నా ఫోటో తీసేశావ్? నేను అంతగా బాగులేనా?"

"ఎందుకు లేవు. అద్భుతంగా ఉన్నావు ప్రీతీ!"

ఆ ఒక్కమాటా అని అతను నాలిక కొరుక్కున్నాడు. ఆమె తిరిగి బల్లమీద పెట్టి పోయిన ఫోటోను కళ్ళార్పకుండా చూశాడు. దాన్ని ఆవలకు తిప్పి వేశాడు. కాని అది కొన్ని నిముషాల్లోనే మామూలు స్థితిలో తిరిగి కన్పించేది.

## 19

ఒక రోజున మధుకు ఒక విశేషమైన అనుభూతి ఎదురైనది. ఏమీ తోచక బజారు వైపు వెళ్ళాడు. ఆ పట్నంలో ఉన్న దేవాలయాలన్నీ వెతకటం అతనికో నిర్బంధమైన విద్యుక్తధర్మంగా మారింది. వెనక నుంచి ఎవరో పిలిచినట్లయింది. వెనుదిరిగి చూడగా ఒక వృద్ధుడు తననే పిలుస్తున్నాడు ఆగమని. ఆయన లలాటం నిండా వెడల్పుగా విభూది రేఖలు తీర్చిదిద్దినట్టున్నవి. ఆ రేఖల మధ్య పెద్ద కుంకుమ బొట్టు విశిష్టంగా గోచరిస్తున్నది. ఆయన తెల్లని గెడ్డం మెరుస్తున్నది.

"బాబూ! ఇవ్వాళ మీకేదైనా శుభవార్త అందిందా? "అని ఆ అపరిచిత వృద్ధుడు ప్రశ్నించాడు.

ఒక్కక్షణం బిత్తరపోయి మధు అన్నాడు తల అడ్డంగా ఊపుతూ: "శుభవార్తా? నాజీవితంలో శుభవార్తను ఇంకా వినవలసి ఉంది. కాని, వింటానని నేనెప్పుడూ ఎదురు చూడనక్కర్లేదు"

"ఇవ్వాళ వింటారు బాబూ. ఇంటికి వెళ్ళండి".

అతనికి కోపం వచ్చింది. కాని వెనుదిరిగి ఇంటి ముఖం పట్టాడు.

ఇంటి గుమ్మం ఎక్కబోతుండగా వెనకనుంచి సైకిల్‌గంట మోగిస్తూ టెలిగ్రాఫు బంట్రోతు - "మధుబాబూ" అని పిలిచాడు.

"నేనే"

"తంతి"

గబాగబా కవరు చించి చదువుకున్నాడు. 'అప్పీలు గెలిచింది" అని వకీలుగారిచ్చిన తంతివార్త. వకీలుగారు పెట్టిన గడువు మధు మనస్సులో క్షణికంగా మెరిసింది. దాంతో కాలగమనం యొక్క వేగం కూడా తెలుసుకొన్నాడు. ఈ తంతికి అతనెప్పుడూ ఎదురు చూడలేదు. టెలిగ్రాఫ్ మనిషి అటు తిరగగానే తంతి కాయితాన్ని చింపి ముక్కలు, ముక్కలు చేసేశాడు. కాని ఈఒక్క వాక్యం తన జీవితంలో ఏదో కొత్త పరిణామానికి నాంది అని వెంటనే తోచింది. ఒళ్ళు జలదరించింది. ఎంత ప్రయత్నించినా వుప్పెనవలె పొంగివస్తున్న ఆలోచనల ధోరణి అరికట్టలేకపోయాడు. ఎన్నో ఆలోచనలు ఊహలు,

పశ్చాత్తాపాలు ఒకదాని వెనక ఒకటి పెనవేసుకుని మనస్సును క్షోభపెట్టసాగినవి. తను వాగ్దాన ప్రకారం శ్రీరాంకు పెద్ద మొత్తం ఇస్తే ఈ యువశాస్త్ర కారుడి ఆశలన్నీ ఫలిస్తయ్.

ఛటుక్కున దారిలోనే మరచిపోయిన ఆ వృద్ధుడి మాటలు జ్ఞప్తికి వచ్చి చరాచరా ఆ దారినే వెతకబోయాడు. ఆయన మొదట కలసిన స్థలం చుట్టూ చూశాడు. ఆ చుట్టు ప్రక్కలంతా గాలించాడు. సాయంత్రం దాకా అన్నం నీళ్ళు మరిచిపోయి వెతుకుతూనే వున్నాడు. ఆయనెక్కడా అవుపించనేలేదు.

ఇంటికి వచ్చి అలసటతో గదిలో ప్రవేశిస్తుండగా

"మధూ, ఎక్కడికి వెళ్ళావ్ అన్నం కూడా తినకుండా?" అని ప్రీతి ఎదురువచ్చి అడిగింది.

"దేవాలయానికి" అని ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

"పద, పద, చాలా అల్లరి పిల్లవాడివవుతున్నావ్. మూగతనం తప్పిస్తే కొంటె వేషాలన్నీ వేస్తూనే ఉన్నావ్. కాస్త ఎంగిలిపడు" అని ఆమె పకాలున నవ్వింది కోపపు నటన ఫలించక.

అంతకు క్రితం మూడు, నాలుగు రోజుల్నుంచి ప్రీతి చాలా దిగులుగా కనిపిస్తూ తిరిగింది. శ్రీరాం ఇంటికి రాకుండా నిశాచరుడిలాగా అక్కడే పనిచేస్తూ ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నాడని, అసలు భార్య సంగతే మరిచిపోయాడని ఆమె పెద్దగా విసుక్కున్నది కూడా.

మర్నాడు ప్రొద్దునే రామక్రిష్టయ్యగారికి, రంగప్పకూ కలిపి ఒక చిన్న ఉత్తరం వ్రాశాడు. వాళ్ళకేమి కావలసినా వకీలుగారి నుండి కోర్టులో ఉన్న మొత్తం తీసి ఖర్చుపెట్టుకోవాల్సిందని ఆ ఉత్తరంలో తాత్పర్యం. ఆ విధంగానే ప్లీడరుగారికి కూడా వ్రాశాడు. అందులోనే శ్రీరాంకు తను ఇవ్వదలచిన మొత్తం తయారుగా ఉంచమని కూడ ఉదహరించాడు. కాని అతని ఆందోళనంతా ఆ అపరిచిత వృద్ధుడిని వెతకటం గురించే, ప్రీతికిగాని, శ్రీరాంకు గాని ఈ విషయమై అతడు పల్లెత్తుమాట చెప్పలేదు. పూర్తిగా అన్వేషణలో మునిగిపోయాడు.,

మరి రెండు దినాల ప్రయాసతో కాని ఆ వృద్ధ పండితుడి పునర్దర్శనం లభింపలేదు. ఆయన ఒక మారుమూల దేవాలయపు మంటపంలో ఒంటరిగా కూర్చున్నాడు. మధుకు పంచప్రాణాలు ఒకేసారి అచేతనావస్థనుండి చేతనమయినట్లయినది. వెళ్ళి ఆయన పాదాలు తాకుతూ నమస్కరించాడు.

"నువ్వు చెప్పబోయేది నాకు తెలుసు బాబూ. నాకు తెలుసు. కాని ఈ పట్నంలో

ఇంకా ఉండమని నీకు చెప్పలేను బాబూ. వెంటనే నిర్గమించు. అది శుభం"

ఏమో అడుగుదామనుకున్నాడు మధు,ఆ అద్భుతవ్యక్తిని, కాని ఆయన "శుభం!" అంటూనే లేచి దేవాలయం వెనుకగా మలుపుతిరిగి మాయమైపోయాడు. మధు కొన్ని క్షణాలపాటు అగమ్యంగా దిక్కులు చూశాడు. అతని వెనుకటి నిరాశా జీవిత వేదాంతం. బాహ్యాంతర చేతనా చేతన కణాలనన్నిటిని అకస్మాత్తుగా ఆవహిస్తున్నది. ఎడారి ఇసుకలో పోసిన నీరు ఇంకిపోయినట్లుగా ఒక్కసారిగా అతని ఆలోచనలన్నీ కట్టుబడి పోయినవి.

అతను పరుగులతో గృహోన్ముఖుడైనాడు. అప్పటికే కనుచీకటి పడ్డది. తనకని ప్రీతి ప్రత్యేకించిన గదిలో ఏకాఏకిన ప్రవేశించాడు, ఆ గదిలో తన పెట్టెలు రెండు, శిథిల దేవాలయపు చిత్రం, అసంపూర్ణమై నిలచి ఉన్న సుశీలబొమ్మ, ప్రీతి ఫోటో ఒకటి ఉన్నవి. పెట్టెలూ, గుడ్డలూ అసంబద్ధంగా అర్థరహితంగా కనపడ్డవి. వాటిని తీసుకోవలసిన అవసరమేమీ తట్టలేదు., తన చిత్రాలను రెంటినీ కాయితం మడతలో చుట్టాడు. నిల్చున్నపాటున బయలుదేరాడు.

అతని తలుపువద్ద ఏదో శబ్దమైంది. తలఎత్తి చూచాడు. ఆ ఇంట్లో వంట మనిషి వితంతువు మంగమ్మ నిలబడి ఉంది.

"బాబూ అమ్మగారికి జ్వరం మండిపోతున్నది"

"ఎప్పటినుంచీ"

"రాత్రినుంచీ"

"నేను వెళ్తున్నాను"

"తమర్ని పిలవమన్నారు"

వెళ్ళాడు మాగన్ను నిదరనుండి కలవరించినట్లు ప్రీతి మేలుకొన్నది. తన లలాటం చూపింది. ఎడమచేతితో ఆమె లలాటాన్ని స్పృశించాడు. ఇనుప కొలిమివలె మండిపోతున్నది.

"ప్రీ....తీ!

"వెళ్ళిపోతున్నావా?"

"ఎవరు చెప్పారు?"

"విన్నాను నువ్వు సర్దుకుంటున్నావు. వెళ్తావా? ఆయనకయినా చెప్పావా?"

విషమ సమస్యతో అశాంతి, ఈ యుద్ధం, ఈ విధి బలం ముందు తను

ఓడిపోతున్నట్లు గ్రహించాడు. విభూతి రేఖలతో శక్తి పూజారి దృక్కుల్తో దేవాలయంలో జోశ్యం చెప్పిన పండితుణ్ణి సవాలు చేస్తున్నట్లు పెదిమలు బిగించాడు.

"నేను వెళ్ళటంలేదు - ప్రీతీ! ఈ స్థితిలో నిన్ను వదలివెళ్తానా?"

అతని కంఠం గజగజ వణికింది. కాళ్ళు బలహీనతతో కూలిపోతున్నవి. కళ్ళనీళ్ళు జలజలమని రాలినవి. హఠాత్తుగా వంగి ఆమె గుండెల్లో తన తలవాల్చుకుని బావురుమన్నాడు.

'మ..... ధూ.... మ.... ధూ....."

మరుక్షణంలో ఆమె పిలుపుతో తేరుకుని లేచాడు.

"డాక్టరును తీసుకువస్తా" అని చర్రున బయటికి పోయాడు.

❖ ❖ ❖

ప్రతిభావంతులు, ఉత్తమ మానవశ్రేణికి చెందిన వ్యక్తులు తాము ఆరంభించిన పని సఫలీకృతం అయ్యేవరకు విశ్రాంతి తీసుకోరనిచెప్పిన పెద్దల మాట శ్రీరాం విషయంలో బాగా అన్వయిస్తుంది. అతని ప్రయోగశాల పక్కనే ఉన్న మందుల కంపెనీకి టెలిఫోను ఉన్నది. శ్రీరాంతో మాట్లాడేందుకు అది చాలా ఉపయోగంగా ఉంది.

మందుల కంపెనీ కుర్రవాడు వచ్చి శ్రీరాంకు పక్కనే నిలబడ్డాడు గాని అతడు పరికించనే లేదు.

"బాబూ, మీకు ఫోను"

"ఏం ఫోనోయ్... ఆ సంగతి కొంచెం నువ్వే కనుక్కోలేకపోయావుటోయ్" అంటూ స్పిరిట్ లాంప్ ఆర్పేసి ఫోనువేపు వెళ్ళాడు.

"ఓ మధూ... నువ్వా, ఆఁ ఆఁ... ప్రీతికి జ్వరమా .... అరె.... అయినా విశేషం ఏం కాదుగా - దట్ విల్ డూ... ఆ డాక్టరు మనవాడే.. ఓ తగ్గిపోతుందిలే. కొంచెం ధైర్యంచెప్పు. నో నో నో నువ్వు వెళ్ళే వీలులేదు. నా ప్రయోగాలు రెంటికీ - మోక్షం కనిపిస్తున్నది... ఆయిల్ అని చెప్పానే... స్పేర్ పార్ట్స్ అరిగిపోకుండా ఎల్లప్పుడూ కాపాడే నూనె అన్నమాట... ఇంకోవారం రోజులపని ..... పడకా?.... ఇక్కడే.... బై.... బై... యస్... ఒక్కమాట మూర్తి ఉన్నాడే, అతన్ని పంపుతున్నాను. ఇక్కడే పని చేస్తున్నాడు. మందులు అవీ కావాల్సుంటే తెప్పించు..."

శ్రీరాం వెళ్ళి మళ్ళీ స్పిరిట్ లాంప్ వెలిగించాడు.

మధు ఒక్కడే ప్రీతికి నర్సుగా మారిపోయాడు.

## 20

మానవుడు సంఘజీవి అని నవ్య సమాజ వాదులు పురోగతిని సూచించటానికి తరచు పేర్కొంటారు. నిజమే, మానవుడు సంఘజీవియే. కాని దాని అర్థం బహు సంకుచితమైనది. మానవుడు జీవించాలి. తప్పదు. అందుకు సంఘంలో సంచరించాలి. అదీ తప్పదు. అంతకు మించి అతడితో ఈ ప్రస్తుత సమాజ వ్యవస్థకు ఏ సంబంధమూ లేదు.

మానవుడు చైతన్యయుతంగా ఉన్న లోకంలో తిరుగుతూనే, తను ఒంటరికాదనే అపనమ్మకాన్ని నమ్మాలని ప్రయత్నిస్తూనే తన ఏకాకితనానికి చిన్నపోతుంటాడు. తుఫానులో లేత ఆకు వలె గిజగిజ తన్నుకులాడుతాడు. శరీరం పది మందిలో కలిసి తిరిగి నంత మాత్రాన? అతని హృదయం? అది ఏకాకి. ఒంటరి. దానినెవరూ చూడలేరు. కలియలేరు. అర్థం చేసుకోలేరు. అతని బాధను పంచుకుంటున్నామని సానుభూతిని చూపుతారు. సహాయపడతారు ఒక్కోసారి. కాని ఆ హృదితో భాగం పంచుకోగలరా. పంచుకుంటున్నామని అనుకుంటారు. అంతే. లోకంలో ఎంతో సత్యంగా కనపడే ఎన్నో విషయాలు హేతువాదంతో ఎంత అసత్యమని తేలగలవో ఇదీ అంతే.

తన స్నేహితుల మధ్యఉంటూ, పరస్పర హితకాంక్షతోనే జీవిస్తూ మధు ఈ జీవితకఠిన సత్యాన్ని క్రమక్రమంగా గ్రహించాడు. హఠాత్తుగా వచ్చిన జీవితానుభవాలు అతడిని "నువ్వు ఏకాకివి కాదు" అని కొన్నాళ్ళకు మభ్య పెట్టినయ్. తన హృదయాన్ని పంచుకునే వాళ్ళున్నారనే భ్రమలో ఎన్నాళ్ళో తిప్పించినాయ్, చివరకు వడ్లగింజలో బియ్యపుగింజవలె ఈ పొర అడుగునుండి మానవజీవితపు విషాద సత్యం బయటపడింది.

ఆ ఇంట్లో మధు మీద ద్వేషం వహించి అతని నిర్గమనానికి , పతనానికి వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటున్న ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకరు వంటమనిషి అయిన వితంతువు మంగమ్మ, ఆమెతో సంబంధం కలిగిన మూర్తి రెండవవ్యక్తి. మూర్తి శ్రీరాం లేబరేటరీలో చిల్లరపనులు చేస్తుంటాడు. తనకు తీరిక ఎట్లాగూ లేదు గనుక - ఇంట్లో బజారు వెచ్చాలపనికి కూడా పురమాయిస్తుంటాడు శ్రీరాం. మూర్తి ఆకారంలోనే నక్కజిత్తులూ, విషహృదయపు నీడలూ... సామాన్య పరిశీలకునికి కూడా తలవని తలంపుగా తడతాయి. మధు ఆ ఇంటిలో అడుగుపెట్టిన నాటినుంచి మూర్తి యొక్క అకారణ ద్వేషానికి, అసూయకు గురి అయిపోయాడు. ఖలులైన మానవులకు

కారణాలతో హేతువాదంతో పనిలేదు. అకారణమే వాళ్ళ సర్వకారణం. మధు ఈ పసిగర పురుగుల్ని ఎన్నడూ గమనించనేలేదు.

ఒక్క చిన్న సంఘటన మీద ఈ రహస్య యుద్ధం హఠాత్తుగా పైకి పొక్కిపోయింది.

ప్రీతికి జ్వరం తగిలిన మరునాడే.... మెడలో నెక్‌లెస్, ఇంకో గొలుసూ తీసి మధు చేతికిచ్చి పెట్టెలో దాచమని చెప్పింది. మధు తన మామూలు మతిమరుపు అలవాటుతో వాటిని హాల్లో టేబిల్‌మీద ఉంచి, తను ప్రీతికి మందు ఇచ్చేందుకు వెళ్ళిపోయాడు. తిరిగి వచ్చేప్పుడతనికి హఠాత్తుగా గొలుసుల విషయం గుర్తుకు వచ్చి వెతికాడు. లేవు!!! ఒక్కనాలుగు క్షణాల వ్యవధిలో! అటువంటి సమయాల్లో మానవుడిలో అంతర్లీనమైన సహజలోచనా శక్తి పైకివుబికి కార్యాచరణను ప్రేరేపిస్తుంది. ఆ యిన్‌స్టిన్‌క్టుతోనే మధు మెట్లమీది మాయమైపోతున్న శబ్దాన్ని వింటూ అటు పరుగెత్తి పోయాడు.

అనుమానస్పదంగా మెట్లుదిగి పోతున్న మూర్తి అతని కంటపడ్డాడు. పై మెట్టు నుంచి రెండంగలలో లంఘించి మూర్తిని పట్టుకుని చెట్టుకొమ్మని విదిలించి ఊపినట్లుగా ఊపివేశాడు. అతనిలో ఏదో పిచ్చిబలం ఆవేశించింది.

"గొలుసులు... గొలుసులు... ఎక్కడ?" అని గద్దించాడు. కోపం ఆగలేదు. శరీరంలోని రక్తమంతా ముఖంలో జేవురించి ఉన్నది. మూర్తి గొంతు ఒక్కచేత్తో గట్టిగా నొక్కుతూ ఆ దవడా, ఈ దవడా వాయించి వేశాడు.

ఆ కుత్సితుడికి ఆలోచించే అదను దొరకలేదు. అహింసామూర్తిగా, పిరికిగా కనుపించే మధు నుండి ఈ ఆకస్మికావేశాన్ని అతను ఊహించనేలేదు. నిశ్చేష్టుడైనాడు. ఇంకొక్క ఊపుతో జేబులోనికి చెయ్యిపోనిచ్చి దొంగవస్తువులు పైకి తీసి ఇచ్చేశాడు. కాని ఆపాదమస్తకమూ గజగజ వణికిపోతున్నది. మధుకళ్ళెర్రజేసి "పరమనీచుడివి" అని ఆ విషరూపం ముఖంలో ముఖంపెట్టి అరిచి వెనుదిరిగి లోపలికి పోయాడు. అతని మహోన్నత స్వభావంతో ఈ ఉదంతాన్ని మరుక్షణంలోనే మరిచిపోయాడు. కాని, మూడవతరగతి మానవస్వభావంతో జీవితాన్ని రసవత్తరం చేసుకుంటున్న నీచులు ఇట్టి ఉన్నతక్షమను ఎరుగరు. మంగమ్మ సాయంతో చేసిన ఈ ఉచ్చులో తన కాళ్ళే ఇరికించుకున్న మూర్తి తాచుపాము పగపట్టాడు.

పదిరోజులదాకా ప్రీతిజ్వరం తగ్గనేలేదు. శ్రీరాం తీరిక చేసుకుని వచ్చినప్పుడల్లా ప్రీతి నిద్రబోతూనో, మాగన్నుగా విశ్రాంతి తీసుకుంటున్నట్లుగానో కన్పించేది. మధు అనుకున్నాడు తన మిత్రుడికి చిన్నకారు ఉంటే ఈ దూరం ఎంత దగ్గిరయ్యేది? ఈ దంపతులిద్దరకూ మనోవ్యాకులతలూ, స్పర్థలూ తగ్గిపోయ్యేవి కదా? వాళ్లిద్దరూ

భౌతికవాదులు. భౌతిక సుఖాల నుంచే ఆనందం పొందచూసేవాళ్ళు.

జ్యోతిష్కుడి ఆదేశం జ్ఞప్తికి వచ్చి మధు భయపడని క్షణం లేదు. తన ముందే ఈ చక్కని చిన్న సంసారంలో అగ్ని పర్వతం ప్రభవిస్తున్నది. ఇది ఏ "లావా" ను వెదజల్లబోతోందో?

ప్రీతి మందు తాగుతూ అన్నది. "ఎందుకబద్ధాలాడతావ్ మధూ? నేనాయనకు మట్టి పురుగుతో సమానం. కీర్తి, డబ్బు ముందు నేను తృణపణాన్ని. ఆయన వస్తాడని నేను ఎదురు చూడబోవటం లేదు"

మధు సర్ది చెప్పాడు. "ఇప్పుడేవచ్చి వెళ్లాడంటే నమ్మవెందుకని? నువ్వు నిద్రబోతున్నావు కదా. రోగి నిద్రాభంగం చెయ్యమంటావా? నేనిక్కడే ఉన్నానని తెలుసుకదా!"

మధు ఆమెకిప్పుడు దాయి. వైద్యుడూ, స్నేహితుడు, తన ఆహారం, నిద్ర, గుడ్డలూ, శుభ్రం అన్నీ మరచిపోయాడు. డాక్టర్ని రిసీవు చేసుకోవడం, మందు సమయానికివ్వటం, పళ్లరసం పోయటం, కథలు చెప్పి నిద్రపుచ్చటం అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకున్నాడు. ఆమె అడిగినప్పుడల్లా తను పాటలు పాడటం, ఫిడేలూ, ఫ్లూటూ తెచ్చి కాస్త రోగికి ఉల్లాసం కలిగించటం, క్రమంగా అతనికి విసుగూ, విరామం దూరమయిపోయినయ్. దానితో మనశ్శాంతి దూరమైపోయింది. ఈ ప్రీతికి సన్నిహితుడు కావాలని అతనిప్పుడు కోరటంలేదు.

## 21

అవకాశం దొరికినపపడల్లా మూర్తి సద్వినియోగం చేసుకుంటున్నాడు. సందు దొరికితే చాలు శ్రీరాంకు విషం నూరిపోయటానికి సిద్ధంగా ఉన్నాడు. లేబొరేటరీ ఇప్పుడు హడావుడిగా ఉంది. స్పేర్ పార్ట్సు అరిగిపోకుండా ఖర్చులు తగ్గించే కొత్త నూనెను గూర్చిన ప్రయోగాలన్నీ ఫలించినవి. ఇద్దరు, ముగ్గురు పారిశ్రామికులు పేటెంటు హక్కులు కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వంతో శ్రీరాం ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతున్నాడు.

జ్వరం వచ్చిన వారానికి గాని ప్రీతికి సన్నిపాతం అని వైద్యుడు నిర్ధారణ చెయ్యలేదు. తరచుగా మూర్తినే ఇంటికి వెళ్ళి ఆమె జ్వరం సంగతి కనుక్కుని వచ్చే పనికి పురమాయిస్తున్నాడు శ్రీరాం. అన్ని ఇబ్బందుల్ని స్వశక్తితో గట్టెక్కగలిగిన అతనికి ప్రీతి జ్వరం ఏ భయాన్ని రేకెత్తింపలేదు. కాని మూర్తి వేసిన జిత్తుల వుచ్చులు క్రమంగా అన్ని మూలల నుంచీ వచ్చి కలుస్తున్నాయ్.

"ఎట్లా ఉంది ఈ ఉదయం టెంపరేచరు?"

"ఆ గదిలోకి ఇంక ఎవ్వరూ వెళ్ళే వీలులేదండీ, ఆయన మీ చుట్టమో, స్నేహితుడో నేనంటే మండిపడతాడు. ఆ గదిలోకి నేనెట్లా వెళ్ళేది?"

మొదట్లో శ్రీరాం చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. ఒకరోజున అతనివంక తీవ్రాలోచనలతో చూశాడు. ఎంత పెద్ద అసత్యమైనా చర్వితచరణం చేస్తుంటే నిజమై కూచుంటుంది. శ్రీరాం రోజులో ఎప్పుడో ఒకప్పుడు తీరిక చేసుకుని ఒక్కసారైనా వచ్చి భార్యను చూడటం ప్రారంభించాడు. కాని ప్రీతి తన ముభావాన్ని సరిదిద్దుకోలేదు. శ్రీరాం రావటం ఏదో ఒక మొక్కుబడి చెల్లించేందుకు అన్నట్లుగానే తోచింది ఆమెకు. ఇద్దరి హృదయాల్లోను అనుమాన బీజాలు అంకురించిన మాట మాత్రం నిజం.

మూడువారాల లంఖణాలు చేసింతర్వాత ప్రీతి జ్వరం వెనకపట్టింది . శ్రీరాంకు హృదయభారం తీసివేసినట్లయింది. ఇక తను వెళ్ళిపోవచ్చు కదా అని మధు ఆనందించాడు. కాని మానవుడి ఊహలకు మించినదీ, అతీతమైనదీ వేరొకశక్తి ఉన్నది కదా? ఆమెకు పథ్యం పెట్టిన మరునాడే బజార్లో కారుకింద అకస్మాత్తుగా పడి దెబ్బతిన్న మధును, నలుగురు మనుష్యులు పట్టి ఇంటికి చేర్చారు. అతను స్పృహలో లేడు. గుడ్డలన్నీ రక్తసిక్తాలయినాయ్. తలమీద గాయం. వడలంతా దోక్కుపోయి ఉన్నది. ఆ సమయంలో ప్రీతి ఒక్కర్తే యున్నది. తనకు టానిక్కు కొని తెచ్చేందుకు మధుబజారు పోయి ఉన్న సంగతి ఆమెకు తెలుసు. అతని కుడిచేతిలో పగిలిపోయిన మందుసీసా పెంకులట్టాగే ఉన్నాయి. ఆమె హృదయం ఒక్కసారిగా ఉప్పెనపోటులో సముద్రము వలె కరిగిపోయింది. ఆమె పడుతూ లేస్తూనే వచ్చి తన బలహీనతలోనే అతనికి పక్క అమర్చి డాక్టరుకు కబురు చేసింది. మరొక అరగంటలో అంబులెన్సు వచ్చి మధును ఆస్పత్రిలో చేర్చింది.

అకారణంగా మధు మీద తను పడ్డ అపోహను, ఒక్కసారిగా శ్రీరాం మనసునుండి ఈ విషాద సంఘటన తుడిచివేసింది. మధుకు తనెంత ఋణపడి ఉన్నాడో, ఆ స్నేహితుడి విలువ ఏమిటో దివ్యదర్శనంగా, మెరుపుగా తెలియవచ్చిందతనికి. ఇప్పుడు కొంచెం తీరిక దొరుకుతున్నది. ప్రతిరోజూ ఆస్పత్రికి వెళ్ళేవాడు. తలకు కుట్లుకుట్టి గాయాల ప్రమాదం లేదని డాక్టర్లు నిర్ణయించగానే ఇంటికి తీసుకువచ్చేశాడు. అందుకు కొంత ప్రీతి కూడా కారణమే.

"మధును దిక్కులేనివాడిగా ఆస్పత్రిలో ఉంచాలా?" అని తీవ్రంగా భర్తను

అడిగింది.

"ఇందులో దిక్కులేని తనం ఏముంది? ప్రమాదస్థితి తొలగిపోగానే ఇంటికి వస్తాడు. అసలు ఆస్పత్రికి పంపింది నువ్వే కదా?"

"అవును నేనే. నాకు జరిగిన ఉపకారమే. నా కోసం ప్రాణాంతకం తెచ్చుకున్న అతడికి జరుగుతుందని ఆస్పత్రికి కబురు చెయ్యటం కూడా తప్పే-?"

శ్రీరాం మరేమీ మాట్లాడలేదు. ఆమె కోపం ఇంకా తగ్గలేదని అతనికి తెలుసు. ఆ సాయంత్రం ఒంటినిండా కట్లతో మధును ఇంటికి చేర్చాడు. వకీలుగారికి కబురు అందచేయక్కరలేదని ఖచ్చితంగా అతడు శ్రీరాంతో చెప్పాడు. అందువల్ల శ్రీరాం ఎవరికి వ్రాయలేదు. మధుకు ఉపచారాలన్నీ ఇప్పుడు తన వంతు చేసుకున్నది ఇంకా పూర్తిగా కోలుకోని ప్రీతి. ఆమె అతని సేవలో పూర్తి నిమగ్నురాలయినది. తన దేహ పరిస్థితి ఆమెకు తట్టనూ లేదు. అడ్డురానూలేదు. పాలుగుడిచే శిశువు కందకుండా, నలగకుండా, దాదివహించే జాగ్రత్తలన్నీ ఆమె వహించింది పశ్చాత్తాపంతో. కరుణతో, కృతజ్ఞతతో ఆమె హృదయం నిండిపోయింది.

"మధూ, పిచ్చిమధూ! నా కోసం మృత్యువు కోరల్లో చిక్కుకున్నావా?" అతడు వెనుకటి మాదిరిగా నిద్రలో కలవరించాడు.

"నా చెల్లి.. నా చెల్లి... జ్యోతిష్కులు..."

ఆమెకు అర్థం కాలేదు. ఆ కలవరింతకు వెనక దాగివున్న మనోవ్యధ ఆమె ఊహకు అందని విషయం.

ఒకరోజున మధుతో అన్నది.

"నేనూ, మా నాన్నగారూ మీ ఊరు వదలివచ్చేటప్పుడు నీకు వ్రాయకపోవటం ఎంత పొరపాటయింది మధూ."

మధు ఆమె వంక దీర్ఘంగా చూచాడు.

"పొరపాటు కాదు. మన ఇద్దరి జీవితాల్ని రక్షించావు"

"అదేమిటి? మన జీవితాలకేమి ప్రమాదం?"

"నీకు తెలియదు ప్రీతీ! నాది దుష్టహస్తం, నాది రాక్షసుల మనఃప్రవృత్తి.

"ఎవరన్నారు? నువ్వు దేవతా సంభవుడివి"

.... .... .... ....

శ్రీరాం మాత్రం దినం తప్పకుండా మిత్రుడి ఆరోగ్యాభివృద్ధి తెలుసుకునేందుకు

వస్తూనే ఉన్నాడు. కాని అతన్ని చూడగానే ప్రీతి ఆ గదిలోంచి బయటకు పోవటమో, మాట్లాడక నుంచోటమో చేస్తున్నది. ఆ సారి ఆమె ఇంట్లో చేసిన పిండివంట ఏమిటో మధుచేత తినిపిస్తున్నది. శ్రీరాం వచ్చి అన్నాడు.

"గాయాలు చీము పట్టగలవ్! శనగపిండి కదూ?"

ఆమె ఏమి సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయింది. తన కోసం టిఫిన్ తీసుకు వస్తుంది కదాయని అతను అక్కడే వేచి ఉన్నాడు. కాని ఆమె తిరిగి రాలేదు. వంట మనిషి వచ్చి పళ్ళెం ముందు ఉంచి, టీ కప్పు పెట్టి వెళ్ళిపోయింది.

ఇంకోసారి మధు మంచం పక్కనే కుర్చీలో కూర్చుని ఆమె పాట పాడుతున్నది శ్రీరాం రాగానే ఆపివేసింది.

"ఎందుకాపుతున్నావ్? నేను వినకూడదా?"

ఆమె అతని మాటలు వినిపించుకోకుండానే వెళ్లిపోయింది. మధు అన్నాడు "నీ మీద కోపం".

"నా మీద కోపమయితే అయింది. నీకు మాత్రం హాయిగా కాలక్షేపం అవుతుందనుకుంటా మధూ."

స్నేహితుడిని మధు తేరిపార చూశాడు. అతనికా మాటల్లో జ్యోతిష్కుడి మాటల స్వరూపం పొడగట్టింది. కాని సమాధానమేమి ఇవ్వలేదు. శ్రీరాం కూడా వేరేమి కల్పించుకుని మాట్లాడలేదు. అతను భోజనం ముందు కూచున్నాడు కాని ఏమి సయించటం లేదు. అన్నీ ఒక్కటొక్కటే నెట్టివేశాడు. అతని కళ్ళు ఎర్రని జ్యోతులయి పోయినయ్. ముఖమంతా ముడతలు పడి ఉంది. వంటమనిషి మంగమ్మ వడ్డిస్తున్నది. అతడు తనలో తనే ఏమో మాట్లాడుకుంటూ హఠాత్తుగా మంగమ్మను చూసి అడిగాడు.

"ఏమిటి విశేషాలు?"

వితంతువు అటూ ఇటూ చూసింది. కళ్ళు నేల మీదకు వాల్చింది. అతనిలోని భయమూ, అనుమానమునూ తన మౌనముతోనే వృద్ధిచేసింది.

"ఆయన మంచివాడు కాదు."

సైంటిస్టు శ్రీరాం కనుబొమ్మలు ముడిచాడు. భోజనపు పళ్ళేన్ని ఒక్క విసురులో కిందకు నెట్టి గబగబా లేబరేటరి వైపు నడిచిపోయాడు. అతనికి దారి మధ్యలో మధు అమాయకపు ముఖం స్మృతిలో వచ్చి నిల్చుంది.

## 22

మధుకు వర్తమాన జీవితం ఒక దుస్వప్నంగా తోచింది. రానురాను తన దురదృష్ట జాతకఫలం ఈ అమాయకపు ప్రీతి మీద సైతం ప్రతిఫలించగలదేమోనన్న విషాదఛాయ అతని మనోక్షేత్రాన్నావహించింది. కంచుగంట మోత గర్భగుడి ప్రాంగణం నుండి దేవాలయావరణనంతా మారుమ్రోగినట్లుగా, ఆనాటి అపరిచిత, అసాధారణ జ్యోతిష్కుని హెచ్చరిక అతనిని అనుక్షణమూ వెన్నాడుతూనే ఉన్నది. ప్రమాదం సంభవించిన మొదటిరోజునే అతనికి నిండు జ్వరం వచ్చింది. ఒకటి రెండు దినాలు మాత్రం అతడు ఆశా నిరాశాల మధ్య ఊగిసలాడాడు. శిథిల దేవాలయ ప్రాంగణపు శాంతికోసం అతను తహతహలాడాడు. తన స్నేహితుడి అభివృద్ధిని కాంక్షించాడు. మొదట ఎంత తెలివి గలదిగా చిలిపి పిల్లగా తన హృదయంలో శాశ్వత స్థానాన్ని ఆక్రమించిందో, ఆ ప్రీతి ఇప్పుడొక శుద్ధ అమాయకపు బాలికగా అతని కరుణను కొల్లగొన్నది. ఆమె భవిష్యత్తు శాంతికోసం నిరంతర ప్రార్థనలు చేశాడు.

జ్వరం తగ్గిపోగానే అతనిలో మాటలకూ, ఊహలకూ అందని అమరశాంతి నెలకొన్నది. అతని కోరికలన్నీ మటుమాయమయిపోయినయ్. భౌతిక విలువల మీద మానవ సహజమయిన మమత కూడా అదృశ్యమైపోయింది. నిన్న మొన్నటి వరకు అనుక్షణం అశాంతిగా ఉన్న ప్రీతిని ఒక్కసారిగా మరచిపోయాడు. శిథిల దేవాలయపు ఆవరణలో నివసించివలెననే కోర్కె అతనిలో మిగిలిపోయింది.

కొంచెం ఓపిక చిక్కింది. వెంటనే బయలుదేరిపోయే సన్నాహంలో పడిపోయాడు. ఆరోజున రంగప్పు కళ్ళల్లో మెదులుతున్నాడు. ఆ ప్రయాణసన్నద్ధత మళ్ళీ తనకే ఆశ్చర్యం కలిగించింది. కాలాన్ని, వేగాన్ని జయించుకుంటూ పోవాలి. తిరిగి మరుక్షణంలో ఐహిక మమతల్లో కొన్ని అయినా చుట్టుముట్టి తిరిగి వచ్చినవి. కొత్తగా వచ్చిన చెక్కుబుక్కు జేబులో పెట్టుకున్నాడు. చక్కని చిన్నకారుకొని దంపతులకు హఠాత్తుగా బహుకరించాలన్న ఆలోచన. లేబరేటరీ వైపు వెళ్ళామనుకున్నాడు. కాని పట్నంలో ఆటోమొబైల్ కంపెనీల వైపు కాళ్ళులాగినవి.

.... .... .... ....

ఆనాడు శ్రీరాం జీవితానికి విజయదశమి. అతని ప్రయోగాలన్నీ సంపూర్ణంగా ఫలించినయ్. పారిశ్రామిక పత్రికల్లో అతని ప్రయోగాల ఉత్తమ ఫలితాలను గురించిన వార్తలు ఇదివరకే ప్రకటితమయ్యాయి. ఇది వరలో అతని కొత్త రసాయనిక వస్తువుల ప్రయోగాలను పేటెంటు హక్కులుగా కొనగలమని ఆసక్తి చూసిన కొందరు పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానాలు పంపాడు. ఆనాడు లేబరేటరీ సందర్శనకు వస్తున్న పెద్దలకు

విందు చేయటానికని ప్రీతికొక చీటి వ్రాసి సాయంత్రం 5 గంటలకల్లా అంతా తయారుగా ఉండాలని - మూర్తి ద్వారా ఇంటికి కబురు పంపాడు.

మూర్తి మధ్య తాత్సారం చేస్తూ ఇల్లుచేరేసరికి మధు కొని తెచ్చిన కొత్తకారు వాకిట్లో కన్పించింది. అందమైన చిన్నకారు తనది కాబోతున్నది. ప్రీతి ఆనందంతో గంతులు వేస్తున్నది. ఆమెకు తన భర్తమీద కోపమంతా తాటియాకు మంటవలె చల్లారిపోయింది.

"రోజూ లేబరేటరీకి వెళ్లి చూసివస్తా"

"శ్రీరాంకు హఠాత్తుగా చూపించి గమ్మత్తు చేయ్యాలి"

"మరి నాకు డ్రైవింగ్ నేర్పుతారా ఆయన?"

ఆమె ఆనందంలో పాలుపంచుకుంటూ మధు అక్కడే నిలిచి ఉండటాన్ని కూడ మూర్తి గమనించాడు.

ప్రీతి చప్పట్లు చరచి, మూర్తిని పంపి కొబ్బరికాయ తెప్పించింది. పూలమాల తెప్పించింది. కారు "హుడ్" కు పసుపు పూసి కుంకుమ బొట్టుగా దిద్దింది. హారతి ఇచ్చింది. కొబ్బరికాయ కొట్టి దిష్టి తీసివేసింది.

"ఇవ్వాళే దీన్ని ప్రారంభోత్సవం చేయ్యాలి" అన్నది.

మధు అన్నాడు. "ఇంకేం చేశావుగా? ఇంతకన్నా ఏం కావాలి? చివరకు దిష్టి కూడా తీసేస్తివి"

"అట్లా కాదు. మొన్న మహిళాసమితివాళ్ళు రోగుల సహాయార్థం నాట్య ప్రదర్శనం ఏర్పాటుచేయించి టికెట్లు అమ్మి వెళ్లారు వాణీ హాల్లో. ఈవేళే ప్రదర్శనం మనందరం అక్కడికి వెళ్ళాల్సిందే."

"సరే.... ఇక మీ భార్యాభర్తల ఇష్టం. ఇక నాదేముంది?"

"అది సరేనయ్యా ఆయన ఇక్కడకు వచ్చి కారు చూస్తే గమ్మత్తేమీ ఉండదు. వాణీ హాలుకు రమ్మనమని మూర్తి చేత కబురుచేస్తా. ఇంటికొచ్చేటప్పుడు కారు చూసి ఆశ్చర్యపడేటట్లు చెయ్యాలి."

ప్రీతి గబాగబా ఒక కాయితం ముక్కమీద శ్రీరాంను తప్పకుండా సాయంత్రం 5 గంటలకల్లా వాణీమహల్‌కు రావాలని, తప్పదు, జరూరు అని ముగించి, కారు సంగతి ఆయనతో చెప్పవద్దని మూర్తిని మరీ మరీ హెచ్చరించి మూర్తినే పంపించింది లేబరేటరీకి.,

ఇది మూర్తికి ఒక స్వర్ణావకాశం ఇచ్చినట్లయింది. శ్రీరాం సందేశాన్ని ప్రీతికి గాని, ప్రీతి సందేశాన్ని శ్రీరాంకు గాని అందచేయలేదు. ఆ రెండు కాయితాలను నలిపి మూలకు విసిరివేసి విజయ గర్వంతో మంగమ్మవేపు చూశాడు.

ప్రీతి కొత్త కారులో వాహనయోగాన్ని పొందిన పురోహితుడిలాగా వాణీహాల్లో ప్రదర్శనకని మధుతో వెళ్లిపోయి శ్రీరాం రాక కొరకు ఎదురు చూస్తున్నది.

కాని అతిథులను వెంటపెట్టుకొని శ్రీరాం నిర్ణీత సమయానికి ఉల్లాసంగా ఇంటి కి వచ్చాడు.

ప్రీతి లేదు.

మంగమ్మను పిలిచి అడిగాడు.

విందుకు ఏ ప్రయత్నము జరుగలేదు.

"ఎక్కడికి పోయింది? ఎక్కడికి?" అని వంట మనిషిని గద్దించి అడిగాడు.

"నాకేమి చెప్పలేదు బాబూ, కొత్తకారొకటి వచ్చింది. ఆ కార్లో అమ్మగారూ కూడా కూర్చొని ఉంది. మధుబాబూ, వారూ కలిసి ఎక్కడికి వెళ్ళారో ఏమో?"

శ్రీరాం ముఖం వివర్ణమైపోయింది. శరీరం నిండా తేళ్లు, జెర్రులు , పాములూ పాకినట్లయింది. క్రోధం, అనుమానం దావాగ్ని వలె చుట్టుముట్టినవి. చేతనమైన మనస్సు అచేతనమైపోయింది. అచేతనమైన మనస్సు, చేతనమై పూర్తి అధికారాన్ని పొందింది. పెద్దగా కాళ్ళు నేలకేసి కొడుతూ "ద్రోహులు, ద్రోహులు.. విషకుంభాలు.. నా ఇల్లు కూల్చారు" అని బిగ్గరగా పిచ్చివాడివలె కేకలు పెట్టాడు. ఆ ఉన్మత్త ఆకారాన్ని చూసి భయపడిపోయి వంటలక్క తలుపులు బిగించుకుంది.

బయట అతిథులు ఒకరి ముఖం ఒకరు చూచుకుని కుర్చీల్లోంచి లేచారు ఈ గృహచ్ఛిద్రాల్లో ఇహ తమ విందు ముగిసినట్లే అనుకున్నారు. సమంజసమో, అసమంజసమో అనుకుంటూనే ఒకరి వెనక ఒకరు బయటికి జారుకున్నారు.

శ్రీరాం ఆవేశం దిగగానే వచ్చి చూశాడు. అతిథుల ఆసనాలన్నీ ఖాళీగా ఉన్నాయ్. అతని హృదయం భగ్నమైపోయింది. ఆ నిరాశనుండే క్రోధాగ్ని జ్వాలలు పైకి లేచినయ్. ఉన్మత్త ప్రేలాపనతో పళ్లు పటపట కొరుకుతూ అతను లేబరేటరీ వైపు దారి తీశాడు. అతను నడవలేదు. గాలితోపాటు, కాళ్ల శక్తి ఎటు గుంజితే అటు ఉత్తేజితుడై పరుగెత్తాడు. అటూ ఇటూ దారి తప్పి, తెలివివచ్చి చివరకు లేబొరేటరీ చేరగలిగాడు. ప్రయోగశాలలో స్మశానపు నిశ్శబ్దం నెలకొని ఉన్నది. చుట్టూ విశ్వరూప సందర్శనం వలె ఏ అద్దంలో చూసినా, ఏ గాజు సీసాలో చూసినా, ఏ టెస్టు ట్యూబులో చూసినా, అతని ఆకారమే

ప్రతిఫలిస్తున్నది. అది సైంటిస్టు ఆకారం కాదు. సైతాన్ ఆకారం. చుట్టూ కలియ చూసుకున్నాడు. వింత వింత నీడలు ప్రతి వస్తువు మీద నాట్యమాడుతున్నాయ్యి

స్నానం చేసి వచ్చినట్లుగా వళ్ళంతా దిగచెమటలు పోసినయ్. మెడలో ఉన్న "టై" ఉరిత్రాడువలె తోచింది. దాన్ని చికాకుతో విప్పి నలిపి కాళ్ళ కింద వేసుకున్నాడు. "టై" వెనకపక్కన "మధు" అన్న పేరు ఇంగ్లీషు పొడి అక్షరాల్లో ఎంబ్రాయిడరీ రంగు దారాల్లో కుట్టి ఉన్నది. అతనికి లోకంలోని అపోహలెన్నో కళ్లముందు, విషపింఛాలు విప్పి వెక్కిరిస్తున్నాయ్. మనస్సులోని ప్రచండపు కోపం తాపుకు తట్టుకోలేకపోయాడు. తూలు వచ్చింది. జేబులోని చేతిగుడ్డతో ముఖం తుడుచుకున్నాడు. కుండీలోని నీళ్లలో దాన్ని తడిపి నుదుటి వేడిమీద వేయాలని పిండాడు. మళ్లీ అవ్వేరంగుదారాల పొడి అక్షరాలు 'మధు'

"ద్రో..హి.... ద్రో...హి...."

మధు మంచం మీద, గాయాలతో జ్వరంతో పడి ఉండగా - ప్రీతి అల్లిన చేతి గుడ్డలను, నెక్ టైలను, మంగమ్మ సహాయంతో మూర్తి దొంగిలించి ఇక్కడకు చేర్చిన సంగతి అతనికేమి తెలుసు? అసూయాగ్ని ముందు, గుడ్డి క్రోధం ముందు శ్రీరాం ఒకనాటి జీవితంలోని ఉన్నత భావ సముదాయ సంపత్తంతా దగ్ధమైపోయింది.

"ద్రోహి.... ద్రోహులు...."

ఆ అరుపులకు ప్రయోగశాలంతా ప్రతిధ్వనించిపోయింది. రాక్షసత్వం ఆవహించి మంచి చెడ్డల తారతమ్యం తెలుసుకునే విచక్షణా శక్తిని దొంగిలించి మానవుణ్ణి చంపి, దానవుణ్ణి ఆ శరీరంలో నిలబెట్టింది.

అతను చేతికందినదల్లా విసిరి పగలగొట్టడం ప్రారంభించాడు. సీసాలు, టెస్టుట్యూబు దీపాలు, బీరువాలు, అన్నీ కనబడ్డ ప్రతి వస్తువునూ! హఠాత్తుగా అతనికి ఒక బీరువాలో ఉక్కుయంత్ర భాగాల విడగొట్టే రసాయనికం సంగతి జ్ఞప్తికి వచ్చింది. అది బల్లమీద పగిలిన పెద్దసీసాలో పోసి నిప్పు ముట్టించాడు. అందులో స్పిరిట్ సీసాలు విసిరేశాడు. ప్రయోగశాలంతా "ఢాం. ఢాం" అనే భయంకర ధ్వనులతో తుత్తునియలై చుట్టూ పొగ కమ్మివేసింది. అతను వెలికివచ్చి చుట్టు చీకటిలో కలసి- ఇంటివేపుకు పరుగులు తీశాడు.

❖ ❖ ❖

వాణీ హాలు వద్ద ప్రీతి, మధు ఎంతోసేపు వేచి చూశారు. పదినిముషాల కొకసారి, ప్రీతి మధును గేటుదాకా పంపి ఎదురు చూచింది. కాని శ్రీరాం జాడలేదు. కాని చిన్న

కారు సంగతి ఎప్పుడెప్పుడు చెబుదామా అన్న ఆమె ఆత్రుత ప్రతిక్షణంలోనూ ఉప్పొంగి పోతున్నది.

ప్రదర్శనం ముగిసీ, ముగియక ముందే ఇద్దరూ కారులో ఇంటికి వచ్చారు. కాని శ్రీరాం లేడు. వంటలక్క మాత్రం మెదలక ఉపేక్షించి ఊరుకున్నది. మధు కారును ఇంటి వద్దే నిలిపి తనే స్వయంగా శ్రీరాం ప్రయోగశాలవైపు బయలుదేరాడు. ఆ రాత్రే అతను ప్రయాణం తలపెట్టి ఉన్నాడు. ఏది ఏమైన అతను ఇక ఒక్క క్షణం జాగుచేయ తలచలేదు. ఒకవేళ శ్రీరాం ఇంటికి ఈలోపునే వస్తే, ఈకారు చూసి ఆశ్చర్యపోవాలని ప్రీతి మధును కారు కదలనీయలేదు. అతనికి దారిలో శ్రీరాం కనిపించలేదు. నేరుగా లేబొరేటరీకి వెళ్లి చూశాడు.

ఏమున్నదక్కడ?

శిథిలాలు శివతాండవం చేస్తున్నై.

అతను పదిక్షణాల పాటు నిశ్చేష్టుడైపోయి కళ్ళు మూసుకున్నాడు.

అతనికి ఆనాటి శక్తి పూజా నిరతుడిగా కన్పించిన జ్యోతిష్యుని వృద్ధమూర్తి కళ్ళ ఎదుట పొడగట్టింది.

ఇదీ రహస్యం! ఇదీ!! ఇదే!!!

అతనికంతా అర్థమైంది. ఇవి శ్రీరాం ప్రయోగశాల శిథిలాలుగా కన్పించలేదు. తన జీవితం యొక్క శిథిలాలుగా కన్పించినవి. అతను జేబు తడుముకున్నాడు. అందులో చెక్కుబుక్కు చేతికి తగిలింది. తన పేర బ్యాంకులో చేరిన మొత్తంలో సగభాగం శ్రీరాం పేర వ్రాసి విరిగిపోయిన ఒక బల్లను తుడిచి సర్ది దానిమీద కన్పించేటట్లుగా పెట్టాడు. అప్పటికే ప్రయోగశాల బయట చాలామంది జనం మూగారు - బయటికి వచ్చిన పొగలూ, సెగలూ చూసి లేబరేటరీలో ఏదో ప్రమాదం జరిగి ఉంటుందని భావించి వాళ్లంతా వెళ్లిపోయారు. మధుకు మళ్లీ కొంచెం శాంతి లభించింది. చెక్కుబుక్కు అట్ట చించి దానిమీద నాలుగైదు పంక్తులు గీకాడు.

"శ్రీ రాం, నేను నష్టజాతకుణ్ణని ఇది వరలో అంటుంటే నమ్మేవాడివి కాదు. దైవ వశాత్తు మనిద్దరం తిరిగి కలుసుకున్నాం. ఇట్లా విడిపోతున్నాం. నన్ను తప్పుగా అర్థం చేసుకుంటే నా దురదృష్టాన్ని మాత్రమే నిందించగలను. ప్రీతి నా సోదరి. మీ ఇద్దరి భాగ్యోన్నతి, మీ ఇద్దరి ఆనందం కోసమే నేనిక్కడ ఇన్నాళ్ళున్నది. నా కొరకు కాదు. నా ఆస్తిలో సగభాగం మీకు చెందేటట్లుగా పత్రాలు వస్తాయి. ఈ చెక్కుమీది మొత్తంతో లేబొరేటరీని పునర్నిర్మించు. నా వాగ్దానం జ్ఞాపకం ఉంది కదా? నా చెల్లెలి కోపాన్ని

క్షమించు. అదొక్కటే ఆమె దోషం. ఒకనాడు నా గది తాళపు చెవినిచ్చి నేను చీకట్లో నిద్రించకుండా రక్షించావు. ఈనాడు నా జీవిత విశేషానికే మార్గం చూపావు. నేను సన్యసిస్తున్నాను. నా చెల్లెలూ, నువ్వూ ఇద్దరూ చిన్న బిడ్డలే. భవిష్యత్తు మీది. కారు చూశావా? దూరాన్ని జయించి గతించినవన్నీ మరచిపోండి. సెలవు - మధు."

అతను ప్రయోగశాల తాళాలు లేని తలుపులను దగ్గరచేర్చి బయటికి వెళ్ళాడు. చీకటిలో తిరోముఖంగా నడిచిపోయాడు.

.... .... .... .....

శ్రీరాం పిచ్చి ఆకారం ఇల్లు చేరగానే అతనికోసం ఎదురు చూస్తున్న ప్రీతి కన్పించింది. కారు దగ్గరే. చిన్నపిల్లకు ఆకాశంలోని చందమామ దొరికినట్లుగా ఉంది ఆమెకు. ఆమె అతన్ని ఆకారాన్ని కూడా గమనించే అవకాశం లేదు.

"ఎక్కడికి వెళ్లావ్?" అని గద్దించాడు.

"వాణీ హోలుకు. మీకు కబురుచేసినా రాలేదు కదూ? ఇది చూశారా.. ఇది.. మధు బహుమతి..."

"చూశా... అన్నీ చూశా... నీ రాకాసి రూపమంతా చూశా.."

ఆమె భయంతో వెనుకకు తగ్గింది. అతను మీద మీదకు పోయి ఆమె గొంతును రెండు చేతులతోను హంతకుడివలె గట్టిగా పట్టుకున్నాడు.

"ద్రోహులు... నా ఇల్లు కూల్చే ద్రోహులు...."

ఆమె కెవ్వున కేకవేసి మూర్ఛపోయింది. ఇందాకటి నుంచి పొంచి చూస్తున్న వంటలక్క ఈ విషమపరిస్థితిని తన స్త్రీ సహజ అబలత్వంతో ఎదుర్కొనలేకపోయింది. తన ఎదుట ఒక పెద్ద హత్య జరగబోతున్నదని నిబ్బరాన్ని కోల్పోయి పెద్దగా కేకలు పెట్టింది. ఆ వెర్రి కేకలతో శ్రీరాంకు తెలివి వచ్చింది. మూర్ఛలో పడి శవంలాగా కూలిపోయిన ప్రీతిని చూశాడు. మళ్ళీ ఏదో దుష్కార్యం చేస్తాడేమోనని మంగమ్మ తిరిగి భయాతిరేకంతో అరిచింది. కాని హాని చేసే శక్తి అప్పటికే అతనిలో మాయమైపోయింది.

"ఎవరు నువ్వు..."

"నే...ను... బాబూ... నేను..."

"ఎందుకిక్కడ నక్కావ్!"

ఆమె గజగజా వణికిపోతున్నది. నోరు పెగలలేదు.

"చెప్పు!"

"చెబుతా. నేను నిర్దోషిని బాబూ. చేసిందంతా ఆ మూర్తే. వాడి వల్లోపడి మీ నుండి నిజం దాచాను. మీ భార్య నిర్దోషి. ఆమెనేమీ చెయ్యవద్దు."

శ్రీరాం అచేతనంగా ప్రీతివంక చూశాడు. ఒక్క క్షణంలో ప్రీతిని ఎత్తి చేతులమీద వేసుకుని ఇంట్లోకి తీసుకుపోయాడు. మంగమ్మ నీళ్లు తెచ్చి ఇచ్చింది. ప్రీతి మెల్లగా అటునుండి, ఇటు కదిలిందాకా నీళ్లు చల్లుతూ ఆమె మంచం పక్కనే కూచున్నాడు. భార్య కొంచెం తేరుకోగానే అతని భయమంతా పోయింది. మంగమ్మ వంక తిరిగి "నిజం చెప్పు" అన్నాడు

వంటలక్క లోపలికి పోయి క్షణంలో మూడు చీట్లు తెచ్చి ఇచ్చింది. విప్పి చదువుకున్నాడు. మొదటిది ప్రీతికని మధు వ్రాసిన వీడ్కోలు జవాబు.

'చెల్లీ... ఇది మీ ఆతిధ్యం కొరకు నేను నోచిన చివరి రోజు. నాకు అనుజ్ఞ అయింది. వెళ్ళాలి. నీవు శ్రీరాంను తరచుగా పోయి చూచేందుకు కారు నా బహుమానం నీ మాతాపితలిచ్చిన సొమ్ముగా భావించు. శ్రీరాం ఉన్నతాశయాన్ని నువ్వు అర్థం చేసుకుంటే మీ ఇద్దరూ ఆదర్శ జీవనం గడపగలరు. అతని కీర్తి, ధనం, నీదే కదా! అపోహలకు తావివ్వవద్దు. ఉత్తమ పురుషులు ఆరంభించిన కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగాలంటే, నిర్విరామ కృషి అవసరం. అదే శ్రీరాం చేస్తున్న పని. నీమీది నిర్లక్ష్యంతో కాదు. అతను తరచు నీ జబ్బులో రానిది. నేను - నీ సోదరుణ్ణి ఇక్కడ ఉన్నానన్న ధైర్యంతోనే. నా గమ్యం తెలీదు. కాని శిథిలాలయం వద్ద కనపడతాను. అన్నయ్య మధు."

రెండవది తను ప్రీతికి వ్రాసిన విందు సందేశం. మూడోది ప్రీతి తనకు వ్రాసిన ప్రదర్శనాల సందేశం.

అతనికి కళ్లు విప్పినట్లయింది. మూర్తి చర్యలలోని అనుమానకర విషయాలన్నీ తేటతెల్లంగా విశదమైనాయ్. జీవితంలో ప్రతి చిన్న పెద్ద విషయాలన్నీ శాస్త్రీయంగా ఆలోచించి నిర్వర్తించే తను ఈ తొందరపాటుకు - అసూయకు - ఎట్లా బానిస అయినాడో ఆ క్షణంలో అతనికి అవగాహన కాలేదు. జరిగినది, జరగనున్నది అతని నుండి ఒకే లిప్తలో, పశ్చాత్తాపాగ్నిలో, కాలి, తొలగిపోయినవి. జరుగుతున్నది మాత్రమే అతనికి ప్రాణబిందువులనిచ్చే అమృతపాత్ర.

"ప్రీ... తీ... !"

ఆమె కళ్లు తెరిచి బలహీనతగా, భీతిగా చూచింది.

"నన్ను క్షమించవూ....?"

ఆమె మాట్లాడ ప్రయత్నించింది. అతను వారించాడు.

"వద్దు .... క్షమించాను అంటే చాలు ప్రీతీ...."

చిరు అలగా ఆమె మందహాసంతో సన్నని పెదవులు కదిలినవి. అతని హృదయంలో ఆనందం తిరిగి తొలిముద్ర వేసినది.

"ప్రీతీ"

"మధు రాలేదా ఇంకా?"

"ఎక్కడికి వెళ్లినట్లు?"

"మీ కోసం లేబరేటరీకి."

"అక్కడ ఏమీ లేదు. అంతా బూడిదపాలు చేసి వచ్చాను ప్రీతీ! నీకు కులాసాగా ఉంటే, మధును నేనే పోయి తీసుకువస్తా."

ఆమె నిదానించి తల అడ్డంగా ఊపి అన్నది. "లాభం లేదు"

కాని శ్రీరాం ఆమె మాటలు విని ఉపేక్షించలేదు. మధు బహుకరించిన కార్లోనే త్వరితంగా లేబరేటరీకి పోయి చూశాడు. బయట తలుపులు దగ్గరగా లాగి ఉన్నాయ్. లోపల మధు వదలివెళ్లిన చివరి కాన్కలు - ఉత్తరమూ - చెక్కూ కన్పించాయి. అతని హృదయం మళ్లీ శోకతప్తమయింది. ఉత్తరం చదువుతున్నప్పుడు హస్తాలు గాలిలో లేత ఆకులవలె వణికిపోతున్నవి. ప్రతి అక్షరమూ, అతని చీకటి ఆత్మను పరిశోధిస్తున్న దివ్వె వలె కన్పిస్తున్నది.. ఆ శిథిలాల నుండి బయటపడి తిరిగి ఇల్లు చేరుకున్నాడు. అదే గగనమైన పనిగా కన్పించింది. జరిగినదీ, జరుగనున్నదీ మహా సమస్యలై పొడగట్టినవి.

"లేదు ప్రీతీ- మన ఆత్మ బంధువు కన్పించలేదు"

ఆమె చివాలున లేచిపోయి, మధు గదిలోనుంచి అతని శిథిల దేవాయలపు బొమ్మ తెచ్చి ఇచ్చింది.

❖ ❖ ❖

నిజమే. ఆ శిథిల మందిరం ఇప్పుడు కళకళలాడుతోంది. ఆ మందిరం ప్రాంగణంలోనే కొత్త పూజారి కుటీరం.

**(అయిపోయింది)**

రెండు ఒంటరితనాల మధ్య మరో ఒంటరితనం జీవితం!

\- రామగిరి శివకుమార శర్మ